# సమాచార యోగి
## మాసపత్రిక
# SAMACHARA YOGI
### Telugu Monthly

సంపుటి : 2  సంచిక : 8  ఆగస్టు : 2025  వెల : రూ.25/-

Volume:2  Issue : 8  August : 2025  Cost : Rs. 25/-

ఎడిటర్ :
**డా॥ పోలోజు కృష్ణమాచారి**

సబ్‌ఎడిటర్ : **విష్ణుమూర్తి**

స్టాఫ్ రిపోర్టర్స్ :
**ఇ. కిరణ్ కుమార్**
**పి. సుధీర్ కుమార్**

డి.టి.పి. : **అప్పం శ్రీనివాస్**

**అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ :**
H.No. 6-3-1373, B-1373
NGO's Colony, Vanasthalipuram
Hyderabad - 500070
Cell : 9390222472

Edited,Printed, Published and Owned by:
**POLOJU KRISHNAMACHARY,**
Printed At : MANI RAGHAVA PRINTERS,
#A-20, VAMBAY COLONY,
HYDERGUDA, RAJENDRAGANAR,
RANGAREDDY TELANGANA,
PUBLISHED FROM: B-1373, NGOS
COLONY, VANASTHALIPURAM,
HAYATH NAGAR MAN DAL,
DISTRICT, RANGA REDDY
TELANGANA - 500070.
EDITOR : **POLOJU KRISHNAMACHARY,**
Ce11:9390222472,
pkrishnamachary1979@gmail.com
RNI TEL TEL NO.2024/89286

## లోపలి పేజీలలో..



తెలంగాణ 'ఫిరాయింపుల' కేసులో కీలక తీర్పు వెల్లడించిన సుప్రీం కోర్టు | 3



భారత్ పైన అమెరికా సుంకాల మోత | 5



లీడర్‌షిప్ అంటే క్రెడిట్ కాదు.. బాధ్యత తీస్కోవడం కేంద్రానికి ప్రియాంక హితవు | 13



కాంగ్రెస్ తప్పిదం వల్లే పాక్ పుట్టింది పీవోకేను స్వాధీనం చేసుకునే చాన్స్ వచ్చినా వాడుకోలే : అమిత్ షా | 14

## ఎడిటోరియల్

# భారత్ కు భయపడ్డ ట్రంప్ ?

అమెరికా అధ్యక్షుడు గౌనాల్డ్ ట్రంప్.. 2024 ఎన్నికల్లో గెలిచి పదవి చేపట్టింది మొదలు.. అనేది అనూహ్య నిర్ణయాలు తీసుకుంటూ అందరినీ ఉంట్రెత్తిస్తున్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఆగేన్- మాగా నినాదంతో.. ప్రపంచ దేశాలను వాణిజ్యం పేరుతో భయపెడుతున్నారు. మంతాలు విధిస్తానంటూ తన దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే భారత్ తో వ్యవహరించే ప్రయత్నం చేశారు. భారత్ ఎంతకీ తన దారికి రాకపోవడంతో టారిఫ్స్, పెనాల్టీలు, విధిస్తానంటూ వాణిజ్య యుద్ధానికి తెరలేపారుకి ఈ నేపథ్యంలో ట్రంప్ ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? భారతక్ కు భయపడి ఇదంతా చేస్తున్నారా? ఈ చర్యలను ఎలా చూడాలి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఈ ఏడాది ఏప్రిల్ లో ట్రంప్ పలు దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించారు. భారత్ పై 26 శాతం విధిస్తానని అప్పుడు చెప్పారు. ఆ తర్వాత టరీఫ్ విధించే నిర్ణయాన్ని రోజుల పాటు ఆపేశారు. ఈ క్రమంలో భారత్ అమెరికా మిస్ బ్రేక్ డీల్ కుదుర్చుకునేందుకు సన్నాహాలు దేశాయి. అయితే ఎంతకూ చర్చలు ఒక కొలిక్కి రాకపోవడంతో, అసహనానికి గురైన ట్రంప్. ఇండియాపై లారిఫ్ బాంబ్ పేల్చారు. 25 శాతం అదనపు సుంకాలతో పాటు రష్యా నుంచి సమూరు కొంటున్నందుకు పెనాల్టీ విధిస్తారని బెదిరింపులకు దిగారు. దీంతో భారత్ అమెరికా వాణిజ్య సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

అంతకుముందున్న అగ్రరాజ్య అధినేతలతో పోలిస్తే ట్రంప్ చాలా భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. మాటలు, చేతలు కూడా అలాగే ఉన్నాయి. ట్రంప్ తన “పరి” చేష్టల వల్ల చాలా సార్లు, విమర్శలు ఎదుర్కొన్నారు. ఓసారి నేనే పోప్ అయితా అంటారు. పోప్ అంత్యక్రియల్లో అందరూ నల్లని సూట్  ధరిస్తే, ఈయన మాత్రమే బ్లూ సూట్ వేసుకొచ్చారు. ఎలాన్ మస్క్ను అనూహ్యంగా డోజ్ అధిపతి చేసి మళ్లీ ఆయనతో కయ్యానికి కాలుదువ్వారు. ఇమ్మిగంట్లను బలవంతంగా స్వదేశాలకు వంపడం, వాళ్లను సైనిక విమానాల్లో స్వదేశాలకు పంపి ఆయా దేశాలను రెచ్చగొట్టడం, ఉక్రెయిన్ అదినేత జెలెన్ స్కిన్ పై అందరిముందే అరవడం.. భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపావని అనేక సార్లు గొప్పలు చెప్పుకోవడం.. ఒకటా రెండా..గడిచిన ఆరు మాసాల్లోనే ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ చూస్తుంటే... ట్రంప్ అధ్యక్షుడిగా అమెరికాలో నియంతృత్వ పాలన కొనసాగుతోంది అన్న కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ సోరెన్ మాటల్లో నిజం ఉందేమో అనే భావన వస్తోంది.

ఈయన ప్రమాణ స్వీకారం చేశాక, నియంతృత్వ పాలనలోకి అమెరికా జారుకుంది. అని యూనివర్సిటీ ఆఫ్ ఒట్టావా పొలిటికల్ సైంటెస్ట్ డానియల్ స్టాకేమర్ అన్న మాటలు సరైనవే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా వాణిజ్యం విషమంలో ట్రంప్ ప్రవర్తనను భిన్నంగా ఉన్నాయని నిపుణులు వెలుతున్నారు. భారత్ విధించే టారిఫ్లు... అమెరికా ఎగుమకదారులకు అడ్డంకిగా ఉన్నాయని ట్రంప్ భావిస్తున్నారు. అందుని భారత్ పైన ఇంతవరకు తక్కువ వాణిజ్యం చేశామని తెలుతున్నారు.

ఎంతకూ చర్చలు కొలిక్ని రాకపోవడంతో.. అసహనానికి డీల్ నెగోషియేషన్ (ఒప్పంద చర్చల  వ్యూహం) టాక్తిక్ లో భాగంగా టారిఫ్ విధిస్తానంటూ భారత్ పై ఒత్తిడి పెంచుతున్నారు. అలా అయితే భారత్ తన మార్కెట్ మరింత మెరుగు పరుస్తుందని అమెరికా భావిస్తోంది. ఇక ఇండియాతో వాణిజ్య లోటు ఉండటం, చర్చలు కూడా నెమ్మదిగా సాగుతుండటంతో అసహనానికి గురైన ట్రంప్. టరీఫ్ విధిస్తానంటూ ఒత్తికి తెస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. భారత్ పై టారీఫ్కు రష్యాను లింక్ చేస్తూ ట్రంప్.. వ్యూహాత్మకంగా వ్యవహరించారు. రష్యాను ఒంటరి చేయాలని అమెరికా ఎప్పటినుంతో పరితపిస్తోంది. అందుకే యుద్ధాన్ని బూచిగా చూపి రష్యా పై ఆంక్షలతో ముప్పేట దాడి చేస్తోంది, తన పశ్చిమ స్నేహితులను కూడా రష్యా పైకి ఉసిగొల్పుతోంది. ఈ క్రమంలో భారత్... రష్యా నుంచి సమూరు కొనుగోలు చేస్తూ ఆ దేశానికి అండగా నిలుస్తోంది. అది ట్రంప్ కు రుచించదు లేదు. అందుకే రష్యా నుంచి చమురు కొంటే పెనాల్టీ వేస్తానంటున్నాడు.

**- ఎడిటర్**

# తెలంగాణ 'ఫిరాయింపుల' కేసులో కీలక తీర్పు వెల్లడించిన సుప్రీం కోర్టు



తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సుప్రీం కోర్టు జులై 31న కీలక తీర్పు వెల్లడించింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిందేనని తెలంగాణ స్పీకర్ను ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును రద్దు చేసింది. అలాగే.. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి (మూడు నెలలు) విధిస్తున్నట్లు పేర్కొంది.ఏళ్ల తరబడి ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లు పెండింగ్లో ఉంచడం సరికాదన్న భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్.. ఆ పది మంది ఎమ్మెల్యేల అనరత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిందే అని తీర్పు వెల్లడించారు. అదే సమయంలో న్యాయస్థానమే వేటు వేయాలని పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తిరస్కరించింది. 'అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్ లైన్ సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. విచారణను పొడిగించడానికి ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే.. స్పీకర్ తగు నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై విజయం సాధించిన ఎమ్మెల్యేలు.. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్.. అటుపై అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనరత వేటు వేయాలని పలువురు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్ ను కోరారు. అయినా, స్పీకర్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవటంతో.. పార్టీ పిరాయించిన ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ న్యాయస్థానాలను ఆశ్రయించింది.

హైకోర్టులో ఎదురుదెబ్బ టు సుప్రీం కోర్టు తీర్పు దాకా.. అనరత పిటిషన్ల టైం లైన్

– 2024 ఏప్రిల్లో.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు పది మందిని అనర్హులుగా ప్రకటించాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు

– 09.09.2024.. నాలుగు వారాల్లో వి వివరణ షెడ్యూల్ ఇవ్వాలని స్పీకర్ కార్యాలయానికి జస్టిస్ బి విజయ్సేన్ రెడ్డి బెంచ్ ఆదేశం.

– 22.11.2024.. హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఆదేశాలను రద్దు చేస్తూ.. స్పీకర్ నిర్ణయంతీసుకోవాల్సిన సమయం.. రీజనబుల్ టైం కావాలంటూ వ్యాఖ్య. స్పీకర్కు షెడ్యూల్ ఖరారు చేయాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ

– జనవరి 2025..

హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం

కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, వివేకానంద

– 10.02.2025.. పార్టీల హక్కులు నిర్లక్ష్యం చేయబడకూడదు అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానిస్తూ.. స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన 'రీజనబుల్ టైం' అంటే ఎంత? అని ప్రశ్నించింది.

– 18.02.2025.. సుప్రీం కోర్టు తదుపరి విచారణకు తేదీ నిర్ణయించింది, స్పీకర్ సమాధానం కోసం వేచి చూసింది.

– 2025 మార్చి 4 – కోర్టు స్పీకర్, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ కార్యదర్శి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

– 03.04.2025.. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై వాదనలు ముగిశాయి. సుప్రీం కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

– 31.07.2025.. చర్యలు తీసుకోవాల్సిందేనని స్పీకర్ కు కాలపరిమితి విధిస్తూ మరీ సుప్రీం కోర్టు తుది తీర్పు విలువరించింది.





" సమాచార యోగి" మాస పత్రికకు మీరు పంపదలచుకున్న వ్యాసాలు, వార్తలు ఈ క్రింది ఇ –మెయిల్ కు ప్రతీ నెల 20వ తేది లోగా పంపించగలరు. అలాగే "సమాచార యోగి " లో వస్తున్న వ్యాసాలు, వార్తలపై మీ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరుకుంటున్నాము.

**ఎడిటర్ : డా॥ పోలోజు. కృష్ణమా చారి**

**సెల్ : 390222472**

**samacharayogi@gmail.com**

# న్యాయ నిపుణులతో చర్చిస్తా

## ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం తీర్పుపై స్పీకర్ ప్రసాద్ కుమార్



పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. కోర్టు తీర్పును పూర్తిగా చదివాక ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పందిస్తానని తెలిపారు. తీర్పుపై త్వరలోనే న్యాయ నిపుణులతో చర్చిస్తానని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తాము గతంలోనే నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. కాగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోపే స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని తోసిపు చ్చింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును డిస్మిస్ చేస్తూనే.. పార్టీలు ఫిరాయిస్తున్న ఎమ్మెల్యేల పట్ల పార్లమెంట్లో ఓ చట్టం చేయాలని ధర్మాసనం కామెంట్ చేసింది. త్వరలోనే అన్ని వివరా లను వెల్లడిస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ కామెంట్ చేయడం సర్వత్రా ఆసక్తిని రేపుతోంది.

# భారత్ పైన అమెరికా సుంకాల మోత



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్పై సుంకాల మోత మోగించారు. భారత్పై 25శాతం సుంకాలే కాదు అదనంగా పెనాల్టీ విధించినట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పైన టారిఫ్ బాంబ్ పేల్చారు. అమెరికా కాలమాన ప్రకారం జులై 30న ఉదయం ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ఆట్వీట్లో భారత్ పైన టారిప్ తో పాటు అదనంగా జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఈ సుంకం ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చింది. భారత్ మాకు మిత్రుడే అయినప్పటికీ అత్యధిక దిగుమతి టారిఫ్లు, కఠినమైన ట్రేడ్ బారియర్లు ఉన్నాయని విమర్శించారు. భారత్.. రష్యా నుంచి భారీగా ఆయుధాలు, ఇంధనం కొనుగోలు చేస్తుంది. ఉక్రెయిన్పై రష్యా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ నిర్ణయం హేయమైన చర్య' అనే అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత్ మా స్నేహ దేశమే. కానీ వారు ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్లు విధిస్తున్న దేశాల్లో ఒకటి. రష్యా నుంచి ఆయుధాలు, ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు గాను 25 శాతం టారిఫ్ పాటు పెనాల్టీ కూడా చెల్లించాల్సిందేనని ట్రూత్ సోషల్ వేదికగా చేసిన ట్వీట్లో పేర్కొన్నారు.

# సరోగసి ముసుగులో శిశు విక్రయాలు

## నా అండం, నా భర్త వీర్యం తీసుకుని, వేరొకరి బిడ్డను అప్పగించారు, మోసం ఎలా బయటపడిందంటే..



నా నుంచి అండం, నా భర్త నుంచి వీర్యం తీసుకుని సరోగసీ విధానంలో బేబీని పుట్టిస్తామని చెప్పారు. ఆ తర్వాత మాకు ఇచ్చిన పసికందు మా బిడ్డ కాదని, మేం మోసపోయామని అర్థమైంది" అంటూ హైదరాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసర్చ్ సెంటర్‌పై రాజస్థాన్‌కు చెందిన దంపతులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన హైదరాబాద్ గోపాలపురం పోలీసులు.. నిబంధనలకు విరుద్ధంగా ఫెర్టిలిటీ సెంటర్ నడుపుతున్నట్లుగా గుర్తించారు.

సరోగసి ముసుగులో శిశు విక్రయాలు చేశారని పోలీసులు చెబుతున్నారు. నిర్వాహకురాలు, డాక్టర్‌గా వ్యవహరిస్తున్న నమ్రత సహా 8 మందిని అరెస్టు చేసినట్లు హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ మీడియాకు చెప్పారు.

**అసలు ఏం జరిగిందంటే...** రాజస్థాన్‌కు చెందిన భార్యాభర్తలు(పేర్లు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు) సికింద్రాబాద్ ప్రాంతంలో ఉంటున్నారు. పిల్లలు పుట్టకపోవడంతో ఐవీఎఫ్ విధానంలో బిడ్డను కనేందుకు నిరుడు ఆగస్టులో సికింద్రాబాద్ లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసర్చ్ సెంటర్ (సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్)ను సంప్రదించారు. రూ. 66 వేలు చెల్లించి అన్ని మెడికల్ టెస్టులు చేయించుకోగా.. అంతా బాగానే ఉన్నట్లుగా వచ్చింది. అయినప్పటికీ సరోగసీ విధానంలో పిల్లలను కనేందుకు మాపై ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నమ్రత ఒత్తిడి తెచ్చారు. మేం ఇచ్చే అండాలు, వీర్యంతోనే పిండాన్ని తయారు చేసి సరోగసీ విధానంలో పిల్లలు పుట్టిస్తామని చెప్పారు అని పోలీసులకు చేసిన ఫిర్యాదులో రాజస్థాన్ దంపతులు తెలిపారు.

ఇందుకుగాను రూ. 30 లక్షలు ఖర్చు అవుతుందని

ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు చెప్పారని దంపతులు తెలిపారు. నిరుడు సెప్టెంబరులో విశాఖపట్నంలోని ఫెర్టిలిటీ సెంటర్‌కు దంపతులను తీసుకెళ్లి.. వారి నుంచి అండం, వీర్యం సేకరించారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసర్చ్ సెంటర్‌కు సికింద్రాబాద్‌తోపాటు విశాఖపట్నం, విజయవాడల్లోనూ బ్రాంచీలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. సెప్టెంబరు 23వ తేదీన సరోగేట్ తల్లి (బిడ్డను కనేందుకు ఒప్పందం చేసుకున్న మహిళ) దొరికిందని సెంటర్ నిర్వాహకులు రాజస్థాన్ దంపతులకు సమాచారం ఇచ్చారు. తర్వాత వివిధ దశల్లో ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు డబ్బులు వసూలు చేశారు. అలా ఈ ఏడాది మే నాటికి రూ. 30.26 లక్షలు చెల్లించాం" అని బాధిత మహిళ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ప్రెగ్నెన్సీకి సంబంధించి స్కాన్లు చూపించేవారని తెలిపారు.

**బిడ్డ వారిది కాదని ఎలా తెలిసిందంటే...** మోసం ఎలా బయటపడిందో పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. వారు చెప్పిన వివరాల మేరకు..బేబీ పుట్టాక డీఎన్ఏ టెస్టు చేయాలనేది ఫెర్టిలిటీ సెంటర్, రాజస్థాన్ దంపతుల మధ్య ఒప్పందంగా ఉంది. డెలివరీకి ముందుగానే డీఎన్ఏ టెస్టు చేయాలని వారు కోరినా, డాక్టర్ నమ్రత దాటవేస్తుండటంతో దంపతుల్లో అనుమానం మొదలైంది. తర్వాత సరోగేట్ తండ్రి మరికొంత డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ నిర్వాహకులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో రూ. 2 లక్షలు ఇచ్చేందుకు దంపతులు అంగీకరించారు. ఆ తర్వాత వారి చేతిలో అప్పుడే పుట్టిన బేబీని పెట్టారు. డీఎన్ఏ రిపోర్టులు లేకుండా బిడ్డను ఇవ్వడంతో రాజస్థాన్ దంపతులకు అనుమానం వచ్చి నిలదీయడంతో డీఎన్ఏ శాంపిల్స్ తీసుకున్నారు. అయితే, టెస్టులు చేయకుండా ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు దాట వేస్తున్నట్లుగా దంపతులు గుర్తించారు. తర్వాత ఆ దంపతులు దిల్లీకి వెళ్లి, అక్కడ బేబీ సహా ముగ్గురికీ డీఎన్ఏ టెస్టులు చేయించగా.. అసలు విషయం బయటపడింది. ఆ పసికందుకు వారు తల్లిదండ్రులు (బయోలాజికల్ పేరెంట్స్) కాదని తేలింది.

**సరోగసీ విధానాన్ని అనుసరించలేదు...** ఈ విషయంపై మాట్లాడేందుకు సికింద్రాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు జూన్ 24న రాగా, మమ్మల్ని కలవకుండా డాక్టర్ నమ్రత వెళ్లిపోయారఅని తమ ఫిర్యాదులో చెప్పారు రాజస్థాన్ దంపతులు. దీంతో మోసపోయామని గ్రహించిన దంపతులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు సరోగసీ విధానాన్ని అనుసరించలేదని విచారణలో తేలిందని డీసీపీ రష్మీ పెరుమాళ్ చెప్పారు. హైదరాబాద్‌లో ఉంటున్న అస్సాంకు చెందిన మొహమ్మద్ అలీ అదిక్, నస్రీన్ బేగం దంపతులతో బేబీని కని ఇస్తే డబ్బులు ఇస్తామని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు ఒప్పందం చేసుకున్నారు. అలా బేబీని కన్న వెంటనే రాజస్థాన్ దంపతులకు అప్పగించి, వారి అండం, వీర్యం ద్వారానే జన్మించినట్లుగా చెప్పారు' అని డీసీపీ తెలిపారు. బిడ్డను కన్న మహిళను హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖపట్నం తీసుకెళ్లారు. అక్కడ బిడ్డను కన్న తర్వాత ఆమెకు రూ. 80– 90 వేలు ఇచ్చినట్లుగా మా విచారణలో తెలిసింది అని రష్మీ పెరుమాళ్ చెప్పారు. సరోగసీ పేరిట పిల్లల క్రయవిక్రయాలు చేస్తున్నారని, అందుకే కేసులో బిడ్డను విక్రయించినందుకు అస్సాంకు చెందిన దంపతులు, వారికి సహకరించిన ఏజెంటును కూడా అరెస్టు చేశాం అని డీసీపీ చెప్పారు. అలాగే, ఆ పసికందును శిశువిహార్‌కు తరలించినట్లుగా చెప్పారు రష్మీ పెరుమాళ్.

**పోలీసులు అరెస్టు చేసింది వీరినే...** అత్తలూరి నమ్రత అలియాస్ పచ్చిపాల నమ్రత.. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసర్చ్ సెంటర్ నిర్వాహకులు. పచ్చిపాల జయంత్ కృష్ణ.. ఇతను నమ్రత కుమారుడు. న్యాయవాదిగా పనిచేస్తున్నట్లుగా చెప్పి సెంటర్‌లో ఆర్థిక లావాదేవీలన్నీ చూస్తుంటారు. ఎవరైనా ఎదురు తిరిగి ప్రశ్నిస్తే 'లీగల్'గా సమస్యలు ఎదుర్కొంటారని బాధితులను బెదిరిస్తుంటారని డీసీపీ చెప్పారు. సి. కల్యాణి.. ఈమె విశాఖపట్నంలోని యూనివర్సల్ సృష్టి సెంటర్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గొల్లమండల చెన్నారావు.. ఇతను ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. నర్గుల సదానందం.. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తూ, యూనివర్సల్ సృష్టి సెంటర్‌లో అనస్థీషియా స్పెషలిస్టుగా పనిచేస్తున్నారు. ధనశ్రీ సంతోషి.. అస్సాం దంపతుల విషయంలో ఏజెంట్‌గా పోలీసులు చెబుతున్నారు. మొహమ్మద్ అలీ అదిక్, 8. నస్రీన్ బేగం.. వీళ్లది అస్సాం. వీరు బిడ్డను కని అమ్ముకున్నట్లుగా పోలీసులు తెలిపారు.

**2021లోనే అనుమతులు రద్దు...** డాక్టర్ నమ్రత 1995లో మెడికల్ ప్రాక్టీసు ప్రారంభించి, 1998 నుంచి ఐవీఎఫ్, సంతానోత్పత్తి వైద్యం చేస్తున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. సికింద్రాబాద్, విశాఖపట్నంలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసర్చ్ సెంటర్‌లో వైద్యారోగ్యశాఖాధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులు దాడులు చేశారు. ఐవీఎఫ్ చికిత్సతో పాటు మొత్తంగా యూనివర్సల్ సృష్టి సెంటర్ అనుమతుల్లేకుండా నడుస్తున్నట్లుగా గుర్తించి సీజ్ చేశారు. ఫెర్టిలిటీ సెంటర్‌పై 2021లోనే ఫిర్యాదులు రావడంతో సికింద్రాబాద్‌లోని సెంటర్‌ను సీజ్ చేసినట్లుగా హైదరాబాద్ డీఎంహెచ్‌వో వెంకటి చెప్పారు.

గతంలోనే సెంటర్ సీజ్ చేయడం జరిగింది. నమ్రత డాక్టర్ లైసెన్స్ కూడా 2021లోనే ముగిసింది. రెన్యూవల్ చేసుకోలేదు. వేరొక డాక్టర్ పేరుతో సెంటర్ నడుపుతున్నట్లుగా ప్రస్తుతం

విచారణలో తేలింది" అని చెప్పారు.ఒక అపార్ట్మెంట్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకుని, ఎవరైనా బాధితులు సంప్రదించినప్పుడే అక్కడికి వీళ్లు వస్తున్నట్లుగా వెంకటి చెప్పారు.నాలుగేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా సెంటర్ నడుస్తున్నప్పటికీ, గుర్తించకపోవడంపై వైద్యారోగ్య శాఖపై విమర్శలు వస్తున్నాయి. మేం తనిఖీలకు వెళ్లిన సమయంలో మూసివేసి ఉంటోంది. అందువల్ల మా సిబ్బంది గుర్తించలేకపోయారు. అంతేతప్ప నిర్లక్ష్యం లేదు" అని వెంకటి సమాధానం ఇచ్చారు. వైద్యారోగ్య శాఖ లెక్కల ప్రకారం, హైదరాబాద్ నగరంలో 158 ఐవీఎఫ్, ఐయూఐ, సరోగసీ సెంటర్లు నడుస్తున్నాయి. సెంటర్లన్నింటిలో తనిఖీలు చేపడతాం" అని చెప్పారు డీఎంహెచ్‌వో.

**సరోగసీ నిబంధనలేమిటి?..** భారత్‌లో సరోగసీ విధానంపై పరిమితులు ఉన్నాయి. సరోగసీ(నియంత్రణ) చట్టం, 2021 పేరుతో కేంద్రం ప్రభుత్వం 2022 జనవరి నుంచి నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో కమర్షియల్(వాణిజ్య) పద్ధతిలో, అంటే డబ్బుల కోసం సరోగసీ విధానంలో పిల్లలను కనడం చట్టవిరుద్ధం. కేవలం నిస్వార్థ పద్ధతిలో పిల్లలను కనేందుకు చట్టం అనుమతిస్తుంది. మరోవైపు, ఎవరైనా సరోగసీ విధానంలో పిల్లలు కనేందుకు డబ్బులు వసూలు చేస్తుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి" అని డీసీపీ రష్మీ పెరుమాళ్ కోరారు.

**సుమోటోగా తీసుకున్న తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ :** అక్రమ సరోగసీ, శిశువులను అమ్మే వ్యవహారంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. సికింద్రాబాద్లో ఉన్న యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం అంతటా ఉన్న అనుబంధ క్లినిక్లో చట్టవిరుద్ధమైన, అనైతిక పద్ధతులకు సంబంధించి వివిధ వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా స్వీకరించింది.

ఈ వ్యవహారంపై ఆగస్టు 28లోగా సమగ్ర నివేదిక అందజేయాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

# సుప్రీంకోర్టేమీ పోస్టాఫీసు కాదు

## జస్టిస్ వర్మపై సుప్రీం బెంచ్ ఫైర్




న్యూఢిల్లీ: ఇన్ హౌస్ ఎంక్వైరీ ప్యానెల్ విచారణ కు ముందే కోర్టును ఎందుకు ఆశ్రయించలేదని జస్టిస్ యశ్వంత్ వర్మను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఇన్ హౌస్ ఎంక్వైరీ ప్యానెల్ ఇచ్చిన రిపోర్టును సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ దాఖలు చేసిన పి టిషన్పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీ కూడిన బెంచ్ జులై 30న విచారణ చేపట్టింది. ప్యానెల్ విచారణకు హాజరైన తర్వాత, ఆ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేయడమేంటని జస్టిస్ వర్మను నిలదీ సింది. జస్టిస్ వర్మను తొలగించాలని కమిటీ ఇచ్చిన నివేదిక రాజ్యాంగ విరుద్ధమని, దానికి సిఫార్సు లు చేసే అధికారం లేదని, ఈ కేసు పొలిటికల్గా మారిందని లాయర్ కపిల్ సిబల్ వాదించగాకోర్టు తీవ్రంగా స్పందించింది. "చీఫ్ జస్టిస్ ఆఫీస్ అంటే పోస్టాఫీస్ కాదు. న్యాయవ్యవస్థకు నాయకుడిగా దేశానికి సంబంధించి ఆయనకు కొన్ని బాధ్యతలు ఉన్నాయి.

దుష్ప్రవర్తనకు సంబంధించిన నివేదికలు తన వద్దకు వచ్చిన పుడు.. వాటిని రాష్ట్రపతి, ప్రధానికి పంపాల్సిన బాధ్యత సీజేఐపై ఉంది" అని తెలిపింది.

# తెలంగాణ రాష్ట్రం లో త్వరలో ఒకటే స్టాంపు పేపర్!

- రూ.20, రూ.50 ఎన్జఎస్ పేపర్ల రద్దు యోచన
- అన్నింటికీ రూ.100 స్టాంపు పేపరే వాడకం
- కొన్ని వర్గాలకు, కొన్ని పనుల్లో 'స్టాంపు'మినహాయింపు
- బూట్ పద్ధతిలో చేపట్టే పనులపై 0.5 శాతం స్టాంపు డ్యూటీ
- సరికొత్త విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు




సరికొత్త స్టాంపుల విధానాన్ని అమలులో కి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లలో రూ.20, రూ.50 విలువగల పేపర్లను రద్దుచేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. బహుళ ప్రయోజనకరంగా ఉపయోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల (ఎన్జఎస్) విధానంతోపాటు అనేక అంశాల్లో మార్పులు చేస్తూ కొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు మొదలుపెట్టింది. కొత్త విధానంలో స్టాంపు డ్యూటీ విధింపు, మినహాయింపుల్లో కూడా మార్పులు రానున్నాయి. కొత్త పాలసీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని, చర్చల అనంతరం దీనికి తుదిరూపు ఇస్తారని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

**లాభం లేదు.. భారమే అధికం :** రాష్ట్రంలో ప్రస్తుతం రూ.20, రూ.50, రూ.100 స్టాంపు పేపర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం లైసెన్సులు జారీ చేసిన స్టాంపు వెండార్లతోపాటు రిజిస్ట్రేషన్ల శాఖ వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచుతోంది. రూ.50 వేల విలువ వరకు జరిగే లావాదేవీలకు రూ.20.. రూ. లక్ష లోపు లావాదేవీలకు రూ.50.. రూ. లక్ష కంటే ఎక్కువ విలువ ఉండే లావాదేవీలకు రూ.200 చొప్పున (రూ.100 స్టాంపు పేపర్లు రెండు) స్టాంపు పేపలి ఉపయోగిస్తున్నారు. పలు రకాల అఫిడవిట్లు, డిక్లరేషన్లు, ఒప్పంద పత్రాలు, సేల్డీడ్లు, కంపెనీల మధ్య ఒప్పందాలు తదితర అనేక లావాదేవీల్లో వీటిని ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం భౌతికమైన స్టాంపు పేపర్లతోపాటు ఆన్లైన్ ఫార్మాట్ (ఫ్రాంకింగ్)లో ఈ స్టాంపు పేపర్లు అందుబాటులో ఉంటున్నాయి. వీటిని నాసిక్ లోని ముద్రణాలయం నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, వీటి నిర్వహణ, సీలింగ్, పేపర్, రవాణా లాంటి ఖర్చులు కలిపితే రూ.20, రూ.50 స్టాంపులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వానికి వాటి విలువ కంటే ఎక్కువ ఖర్చవుతోందని, స్టాంపు వెండార్లకు ఇచ్చే 5 శాతం కమీషన్ కలిపితే వీటి అమ్మకాల వల్ల ప్రభుత్వంపై అధిక భారం పడుతోందని రిజిరస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.20, రూ.50 స్టాంపు పేపర్లను రద్దు చేయాలని, రూ.100 విలువైన పేపర్లను మాత్రమే అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా స్టాంపు పేపర్ల సరఫరా నుంచి ప్రభుత్వం

పూర్తిగా తప్పుకుని ఫ్రాంకింగ్ విధానంలో మాత్రమే ముందుకెళ్లేలా కొత్త పాలసీలో పెట్టాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ప్రతి లావాదేవీకి రూ.100 స్టాంపు పేపర్లు కొనుగోలు చేయడం విద్యార్థులు, రైతులు వంటి వర్గాలకు భారమవుతుందని భావించి.. ఆయా వర్గాలు ప్రభుత్వ భాగస్వామ్యం కార్యక్రమాల్లో ఇచ్చే అఫిడవిట్లు, డిక్లరేషన్లను మాత్రం ఉచితంగా ఇచ్చేలా పాలసీలో మార్పులు తేవాలనే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నారు.

**కొందరికి మినహాయింపు** : స్టాంపు డ్యూటీ విషయంలోనూ కొత్త పాలసీలో మార్పులు తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. భూములు లేదా ఆస్తులను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే స్టాంపు డ్యూటీలో 1 శాతం మినహాయింపు ఇవ్వాలని యోచిస్తోంది. కాంట్రాక్టు పనులకు ప్రస్తుతం గరిష్టంగా రూ.200 స్టాంపు డ్యూటీ విధిస్తుండగా ఇకపై 'బూట్' పద్ధతిలో నిర్వహించే కాంట్రాక్టు పనులకు స్టాంపు డ్యూటీని విధించాలని, మొత్తం పని విలువలో 0.5 శాతాన్ని డ్యూటీ కింద వసూలు చేయాలని, ఈ మొత్తం గరిష్టంగా రూ.20 లక్షల వరకు ఉండేలా కొత్త పాలసీలో ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# ప్రేమ జంటపై బ్లాక్ మెయిలింగ్

- **లాడ్జిలో ఏకాంతంగా గడుపుతుండగా వీడియో చిత్రీకరణ**
- **బ్లాక్ మెయిల్ చేసి రూ.60వేలు దండుకున్న వైనం**
- **అదనంగా అడుగుతుండడంతో పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట**



ఓ ప్రేమ జంటను ఒక వ్యక్తి బ్లాక్మెయిల్ చేస్తూ రూ.60వేలు దండుకున్న ఘటన చోటుచేసుకుంది. అదనంగా మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు ప్రేమజంట పోలీసులను ఆశ్రయించగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే పట్టణంలోని రామాలయం రోడ్డులో గల రఘురామ్ లాడ్జిలో ఓ ప్రేమ జంట ఇటీవల రూంను అద్దెకు తీసుకుని ఏకాంతంగా గడుపుతున్న సమయంలో ఒక వ్యక్తి వీడియోను చిత్రీకరించాడు. అనంతరం సదరు ప్రేమ జంటకు ఆ వీడియోను చూపించి బ్లాక్మెయిల్కు తెరలేపాడు. బెంబేలెత్తిన ప్రేమజంట బేరసారాలకు రాగా రూ.20వేల చొప్పున మూడు సార్లు మొత్తం రూ.60వేలు ముట్టచెప్పారు. మరలా అదనంగా డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తుండడంతో ఏమీ పాలుపోని సదరు ప్రేమజంట పోలీసు స్టేషన ను ఆశ్రయించారు.

విషయం తెలుసుకున్న బ్లాక్మెయిల్ చేసిన వ్యక్తి ఉడాయించాడు. దీంతో పోలీసులు బీఎన్ఎస్ 66 సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారణ ముమ్మరం చేశారు. లాడ్జిలోని రూమ్లో ఎవరికి తెలియకుండా వీడియో తీయడానికి అనువైన ప్రదేశం ఎలా సృష్టించాడు..? దీనికి ఎవరి సహకారం ఉంది. ..? వీడియో తీసిన వ్యక్తి లాడ్జి యజమాన్యానికి చెందిన వాడా ..? లేదా ప్రేమజంటను ఫాలో అయ్యి ప్లాన్ ప్రకారం వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేశాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా ఈ విషయంలో పట్టణ వ్యాప్తంగా దావాళంగా వ్యాపించ దంతో కావాలని కొందరు లాడ్జీ నిర్వాహకులే ఇటువంటి దురాఘ తాలకు పాల్పడుతున్నారని, వారికి లాడ్జీ నుంచి డబ్బులు సరిపోక కావాలనే ఇలా ప్రేమ జంటలకు, అసాంఘిక కార్యకలాపాలకు అద్దెకు ఇస్తూ, మరలా వీడియోలు తీయించి బ్లాక్ మెయిల్కు తెర లేపుతున్నారని మండిపడుతున్నారు. పట్టణ వ్యాప్తంగా ఉన్న లాడ్జీలను పోలీసులు, నిఘా వర్గాలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వీరి ఆట కట్టించాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాజ్యాంగ పరిహారపు హక్కు..




భారత పౌరుల హక్కులకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భవిష్యత్తులో ఏరకమైన ఆటంకాలు, భంగం కలగ కుండా ఉండటం కోసం భారత రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగం ప్రసాదించే ప్రాథమిక హక్కులసంరక్షణ బాధ్యతను సుప్రీంకోర్టు, హైకోర్టులకు అప్పగించారు. ఈ హక్కును భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం వంటిదని బి.ఆర్.అంబేద్కర్ వర్ణించారు. రాజ్యాంగం ప్రసాదించే ప్రాథమిక హక్కులకు పూచీకత్తు వంటిది ఈ హక్కును పేర్కొంటారు. ప్రభుత్వాల అధికార దుర్వి నియోగం, నియంతృత్వ విధానాలనుంచిపౌరులుఈ హక్కు ద్వారా పరిహారాన్ని పొందవచ్చు..

- పౌరులు ఎవరైనా తమ హక్కులకు భంగం కలిగి నప్పుడు వాటి సంరక్షణ కోసం, అలాగే ప్రాథమిక హక్కుల అమలు కోసం ఆర్టికల్ 32(1) ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులను సంప్రదించవచ్చు.
- పౌరుల ప్రాథమిక హక్కుల సంరక్షణ కోసం అలాగే హక్కుల అమలు కోసం ఆర్టికల్ 32(2) ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులు రిట్లు జారీ చేస్తాయి. ప్రభు త్వాలకు గానీ ప్రభుత్వ అధికారులకు గానీ అలాగే అధికారేతర సంస్థలకు గానీ ఉన్నత న్యాయస్థానా లు రిట్లను జారీ చేస్తాయి.
- సుప్రీంకోర్టు, హైకోర్టుల రిట్లు జారీ చేసే అధికారం పై ఆర్టికల్ 32(3) ప్రకారం పరిమితులు విధించే అధికారం పార్లమెంట్ కు ఉంటుంది.
- న్యాయస్థానాల రిట్ల అధికారంపై చట్టబద్ధంగా తప్పమరే విధంగానూ అధికారంపై పరిమితులు విధిం చరాదు. రిట్లు జారీ చేసే అధికారం సుప్రీంకోర్టు. హైకోర్టులకు మాత్రమే ఉన్నది. రిట్లు జారీ చేసే పద్ధతి బ్రిటన్ నుంచి గ్రహించారు.

**రిట్ల జారీ..** ప్రాథమిక హక్కులను పరిరక్షించే బాధ్యతను మన రాజ్యాంగం సుప్రీంకోర్టు, హైకోర్టులకు అప్పగించిం ది. సుప్రీంకోర్టు 32వ అధికరణ ప్రకారం, హైకోర్టు 226వ అధికరణ ప్రకారం ఐదు రకాల అజ్ఞలను జారీ చేయడం ద్వారా ప్రాథమిక హక్కులను కాపాడుతుం ది. సామాన్యమైన పౌరుడు కూడా ఉన్నత న్యాయస్థానా లను సంప్రదించడానికి అవకాశం ఉన్నది.

**మాండమస్...** ఈ రిట్ పరమాదేశం లేదా మేం ఆదేశస్తున్నాం అని అర్థాన్ని ఇస్తుంది. ఒక ప్రభుత్వ అధికారి లేక బాధ్యతా యుత సంస్థ తమ విద్యుక్త ధర్మాన్ని అంటే తమ విధులను సక్రమంగా నెరవేర్చని సందర్భంలో వ్యక్తులు తమ హక్కులను కోల్పోయిన లేక భంగం కలిగిన ఉన్నత న్యాయస్థానాలను సంప్రదించినప్పుడు న్యాయస్థానాలు ఈ రిట్ను జారీ

చేస్తాయి. రాష్ట్రపతికి, గవర్నర్లకూ, ప్రైవేట్ వ్యక్తులకూ, విదేశీయులకు జారీ చేయరాదు.

**హెబియస్ కార్పస్: ఐందీ ప్రత్యక్ష, శరీరాన్ని** కలిగి ఉండటం అని పేర్కొనే ఆజ్ఞ ఇది. ఒక వ్యక్తి ఆరెస్టు చట్టబద్ధమా? కాదా? అనేది ని ర్ణయించడానికి ఉన్నత న్యాయస్థానాలు ఈ ఆజ్ఞను జారీ చేస్తాయి. దీని ప్రకారం అరెస్ట యిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప కోర్టులో హాజరుపరచాలి. అరెస్టుకు కారణాలు తెలపాలి. అరెస్టయిన వ్యక్తికి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించారు. ఈ రిట్ ను ప్రభుత్వ అధికారులకు జారీ చేస్తారు.

**ప్రొహిబిషన్..** దిగువ న్యాయస్థానం లేదా ట్రిబ్యునల్లో విచారణలో ఉన్న కేసుల విచా రణను తక్షణం నిలిపివేయాలని ఆదేశిస్తూ ఉన్నత న్యాయస్థానాలు జారీ చేసే రిట్. ఉన్నత న్యాయస్థానాలు దీన్ని జారీ చేయడా నికి గల కారణం, దిగువ న్యాయస్థానాలకు ఆకేసును విచారించే అధికారం లేకపోవడం లేదా సాంకేతిక కారణమై ఉండవచ్చు.

**కోవారెంటో...** ఒక వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా గానీ ఎలాంటి అధికారాలు లేనప్పటికీ లేని అధికారాలను నిర్వహించే సందర్భంలో ఏ అధికారంతో మీరు ఈ విధులను నిర్వహిస్తు న్నారు అని ప్రశ్ని స్తూ ఉన్నత న్యాయస్థానా లు జారీ చేసే రిట్. సదరు అధికారికి చట్ట బద్ధంగా, న్యాయబద్ధంగా ఆ అధికారాలను నిర్వర్తించే అధికారం లేకపోవడమే ఈ రిట్ జారీకి ప్రధాన కారణం.

**సెర్షియోరరీ..** ఈ ఆజ్ఞను ప్రొహిబిషన్తో కలిపి జారీ చేస్తారు. దిగువ కోర్టుల్లోనూ లేక ట్రిబ్యునళ్లలోనూ కేసు విచారణను తక్షణం నిలిపివేసి ఆ కేసును తనకు లేదా మరో కోర్టుకు బదిలీ చేయాలని ఆ రిట్ను జారీ చేస్తారు.

# రూ.382.5 కోట్లతో జోగులాంబ ఆలయ అభివృద్ధి

## మాస్టర్ ప్లాన్పై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సమీక్ష



అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని రూ.382.5 కోట్ల వ్యయం తో, మూడు విడతల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటిం చారు. సెక్రటేరియట్ లో జులై 30న టెంపుల్ మాస్టర్ ప్లాన్పై ఎండో మెంట్ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, ఎండోమెంట్ ప్రిన్స్ పల్ సెక్ర టరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంక టరావు, తెలంగాణ ధార్మిక్ అద్వయి జర్గోవిందహరి తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. జోగు లాంబ ఆలయాల అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం ఎక్కడా రాజీపడబోదని చెప్పారు. రాష్ట్రం లోని అన్ని దేవాల యాల మాదిరి గానే ఇక్కడా డెవలప్ చేస్తామన్నారు. కృష్ణా- తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో జోగు ళాంబ శక్తి పీఠం ఉందని, ఈ ఆలయ ప్రగతికి ప్రభు త్వం చర్యలు చేపట్టిందన్నారు. భక్తు లు, సందర్శకులు, పర్యాటకుల రద్దీ మేరకు ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ కుల గణన మోడల్ కు రాజ్యాంగ బద్ధత లేదు..

## నిజమైన బీసీలకే రిజర్వేషన్లు అందాలి: ఆర్.కృష్ణయ్య



తెలంగాణ ప్రభుత్వం చేప ట్టిన కుల గణన తప్పుల తడక మోడల్ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మోడల్ కు రాజ్యాంగబద్ధ విలువ లేదన్నారు. బీసీలు అంటే కుల వృత్తులని, నిజమైన బీసీలకే రిజ ర్వేషన్ ఫలాలు అందాలన్నారు. అంతేకాని, బీసీల పేరుతో దేశాన్ని పాలించిన నిజాంలు, దొరలు, జమీందర్లకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు.

జులై 28న ఢిల్లీ లోని తెలంగాణ భవన్ లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీలో బీజేపీ సపోర్ట్ చేసిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ, న్యాయ, చట్టపర అవరోధాలు లేవన్నారు.

ఈ విషయంలో కోర్టుకు వెళ్లినా రాష్ట్ర ప్రభుత్వం గెలుస్తుందని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఇప్పటికే సుప్రీంకోర్టు 50 శాతం క్యాప్ను ఎత్తివేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. ఇంత క్లియర్ గా ఉన్నప్పుడు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఆరు నెలలుగా కాంగ్రెస్ ఎందుకు తైతక్కలాడుతోందని ఫైర్ అయ్యారు. బీసీలు అంటేనే అభ్యంతరాలు వస్తాయని, ఈ వర్గాన్ని రాజకీ యంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగకుండా చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రంపై బురదజల్లడం ఆపి, 42 శాతం రిజర్వేషన్ల అమలుపై సీఎం ఫోకస్ పెట్టాలని సూచించారు. బీసీలకు అన్ని రంగాల్లో వాటా ఇవ్వడానికి డిసైడ్ అయ్యాకే కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందని చెప్పారు

# లీడర్షిప్ అంటే క్రెడిట్ కాదు.. బాధ్యత తీస్కోవడం
## కేంద్రానికి ప్రియాంక హితవు



న్యూఢిల్లీ: శత్రువులు ఎక్కడికీ వెళ్లలేని సమయంలో పాక్ యుద్ధాన్ని ఎందుకు ఆపారని కేంద్ర సర్కా రును కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. యుద్ధాన్ని మధ్యలో ఆపడం చరిత్రలో ఇదే తొలిసార ని తెలిపారు. జులై 29న లోక సభలో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా ప్రియాంకా గాంధీ మాట్లాడారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రసంగాన్ని టార్గెట్ చేస్తూ ప్రశ్నల వర్షం కురిపించా రు. నెహ్రూ గురించి, తన తల్లి కన్నీళ్ల గురించి మాట్లా డిన అమిత్.. అసలు పాక్ యుద్ధాన్ని ఎందుకు ఆపారో చెప్పలేదని నిలదీశారు. భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు చేయడమేంటని మండిపడ్డారు. ఇది మన ప్రధాని మోదీ బాధ్యతారాహిత్యమేనని అన్నారు. నాయక త్వం అంటే క్రెడిట్ తీసుకోవడం మాత్రమే కాదని.. బాధ్యత తీసుకోవడం అని చెప్పారు. తన నానమ్మ ఇందిరాగాంధీ గొప్ప దేశభక్తురాలని, యూఎస్ ప్రె సిడెంట్ నిక్సన్ను ఎదుర్కొని పాకిస్తాన్ను రెండుగా విభజించారని చెప్పారు. కానీ ఆమె ఏనాడూ ఆ క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నించలేదని కొనియాడారు.

**నష్టం జరగకుంటే ఎందుకు దాస్తున్నారు** ? ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఫైటర్ జెట్స్ కోల్పోకుంటే.. పార్లమెంట్ లో ఆ విషయం ఎందుకు చెప్పడంలేదని కేంద్ర సర్కారును ప్రియాంక ప్రశ్నించా రు. పహల్గాం దాడిని నిరోధించడంలో నిఘా సంస్థల వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని అడిగారు.

నా తల్లి కన్నీళ్ల గురించి సభలో చర్చించారు. నేనుదీనికి సమాధానం చెప్పాలనుకుంటున్నా. భర్త 44 ఏండ్ల వయసులో ఉగ్రవాదుల చేతిలో అమరుడైతే నా తల్లి కళ్ల వెంట కన్నీళ్లు వచ్చాయి. ఈ రోజు నేను ఈ సభలో నిల్చొని పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన 26 మంది గురించి మాట్లాడు తున్నాను.. నాకు వారి బాధ తెలుసు.. నేనూ అనుభవించిన" అని వ్యాఖ్యానించారు.

**మన దౌత్యం విఫలం** ఆపరేషన్ సిందూర్ లక్ష్యం పాకిస్తాన్ ను గుణపాఠం చెప్పడమేనని, కానీ బహుశా ఇది నెరవేరకపోవచ్చని ప్రియాంకా గాంధీ అన్నారు. ఎందుకంటే మన దౌత్యం విఫలమైందని వ్యాఖ్యా నించారు. అమెరికా అధ్యక్షుడితో రక్తంతో తడిసిన చేతులతో ఉన్న ఓ పాకిస్తాన్ జనరల్ భోజనం చేయడమే దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు.

**ఉగ్రదాడిలో చనిపోయినోళ్లందరూ అమరవీరులే** పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన భారతీయులందరూ అమరవీరులేనని ప్రియాంకా గాంధీ అన్నారు. వారందరి పేర్లను సభలో చదివి వినిపించారు. "కాశ్మీర్లో ఉగ్రవాదం ముగిసిన అంకమని, అక్కడ పర్యటించాలని ప్రభుత్వాలు కోరుతున్నాయి. కానీ.. అక్కడ జరిగింది మరొకటి. శుభం ద్వివేదీకి వివాహమై ఆరు నెలలే అయ్యింది.

ఏప్రిల్ 22న అందరి టూరిస్టుల్లాగే పహల్గాంలో ఆ జంట ఆనందంలో మునిగిపోయింది. అడవుల్లో నుంచి వచ్చిన ఉగ్రవాదులు వాళ్లపై తెగబడ్డారు. భార్య కళ్ల ముందే శుభంను చంపేశారు. గంట వ్యవధిలో మరో 25 మందిని పొట్టనబెట్టుకున్నారు. ప్రతీరోజూ వేలాది మంది పర్యటించే ఆ ప్రాంతంలో ఒక్క సైనికుడు కూడా కాపలాగా ఎందుకు లేదు? వాళ్లు ప్రభుత్వాన్ని నమ్మి వస్తే.. ఈ ప్రభుత్వం దేవుడి మీద భారం వేసి వాళ్లను అలా వదిలేసిందా? ఈ దాడికి బాధ్యత వహిస్తూ రక్షణమంత్రి, ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యత వహించారా? అని నిలదీశారు.

# కాంగ్రెస్ తప్పిదం వల్లే పాక్ పుట్టింది

## పీవోకేను స్వాధీనం చేస్కునే చాన్స్ వచ్చినా వాడుకోలే : అమిత్ షా



న్యూఢిల్లీ: కాంగ్రెస్ చేసిన తప్పిదం వల్లే పాకిస్తాన్ పుట్టిందని, దేశ విభజనకు ఆ పార్టీ ఒప్పుకోకపోయి ఉంటే అసలు పాక్, టెర్రరిజం అనేవే ఉండేవి కావని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫైర్ అయ్యారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకునే చాన్స్ వచ్చినా అప్పటి కాంగ్రెస్ సర్కార్ వినియోగిం చుకోలేదన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నిర్ణయం వల్లే ఐక్యరాజ్యసమితిలో భారత్ కు శాశ్వత సభ్యత్వం కూడా దొరకలేదన్నారు. జులై 29న లోక్ సభలో 'ఆపరేషన్ సిందూర్'పై ప్రత్యేక చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు టెర్రరి స్టులనూ భద్రతా బలగాలు మట్టుబెట్టాయని లోక్ సభలో ఆయన ప్రకటించారు. ఆపరేషన్ మహదేవ్ లో భాగంగా సోమవారం జమ్మూకాశ్మీర్ లో ఆర్మీ. సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జాయింట్ ఆపరే షన్లో ఈ ముగ్గురు టెర్రరిస్టులను హతమార్చినట్టు వెల్లడించారు. "ఈ ముగ్గురు టెర్రరిస్టులను పాకిస్తాన్ కు చెందిన సులేమాన్, అఫ్గనీ, జిబ్రాన్ గా గుర్తించారు. వీరిలో సులేమాన్, అఫ్గనీ లష్కరే తాయిబా ఏ కేటగిరీ టెర్రరిస్టులు. పహల్గాం బైసరన్ వ్యాలీలో అమాయక టూరిస్టులను కాల్చి చంపింది వీరేనని నిర్ధారణ అయింది. వీరిలో ఇద్దరికి పాకిస్తాన్ ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయి. వీరి వద్ద పాక్ లో తయారైన చాక్లెట్లు కూడా దొరికాయి. ఒక ఎం9, రెండు ఏకే 47 రైఫిల్స్, ఎంప్టీ క్యాట్రిడ్జ్ లను స్వాధీనం చేసుకు న్నారు. టూరిస్టులను కాల్చేందుకు వాడిన బుల్లెట్లు, గన్స్ ఇవేనని ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది. పహల్గాం టెర్రరిస్టులను హతమార్చామన్న వార్త వినగానే అధికార, ప్రతిపక్ష సభ్యులు సంతోషిస్తారని అనుకు న్నా. కానీ ఇక్కడ ప్రతిపక్ష సభ్యుల ముఖాలు మాడి పోయి కనిపిస్తున్నాయి" అని ఆయన ఎద్దేవా చేశారు.

**పటేల్ నో అన్నా.. నెహ్రూ సీజ్ ఫైర్ ప్రకటించారు..**

పాక్ ఆక్రమించుకున్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన అవకాశాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వాలు వినియోగించుకోలేదని అమిత్ షా అన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పాకిస్తాన్ పై పూర్తిస్థాయి యుద్ధం ఎందుకు చేయలేదంటూ మోదీ సర్కారును ప్రశ్నించడం విడ్డూరంగా ఉంద న్నారు. "కాశ్మీర్లో 1948లో మన బలగాలు నిర్ణయా త్మక స్థానంలో ఉన్నాయి. కాల్పుల విరమణకు అప్పటి ఉప ప్రధాని, కేంద్ర హోం మంత్రి సర్దార్ పటేల్ నో చెప్పారు. కానీ అప్పటి ప్రధాని నెహ్రూ మాత్రం ఏకప క్షంగా కాల్పుల

విరమణ ప్రకటించారు. నేడు పీవోకే అనేది ఉందంటే.. అది నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడమే కారణం. అందువల్ల పీవోకేకు నెహ్రూయే బాధ్యుడు. అంతేకాకుండా ఇండియాకు భౌగోళికంగా, వ్యూహాత్మకంగా ఉన్న అడ్వాంటేజ్ ను నెహ్రూ పట్టించుకోలేదు. సింధూ జలాల్లో 80% వాటాను పాక్కు అప్పగిస్తూ 1960లో సింధూ జలాలఒప్పందం కుదుర్చు కున్నారు" అని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. "బంగ్లాదేశ్ లిబరేషన్ వార్లో విజయం తర్వాత 1971లోనూ పీవోకేను స్వాధీనం చేసుకునేందుకు మరో అవకాశం వచ్చినా కాంగ్రెస్ ఫెయిల్ అయింది.

షిమ్లా అగ్రిమెంట్ చేసుకుంది. కనీసం పీవోకేను తిరిగి ఇవ్వాలని అడగలేదు. ఇండియా స్వాధీనం చేసుకున్న భూభాగాలను అప్ప గించింది" అని చెప్పారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఇండియాకు పర్మనెంట్ సీట్ పొందలేక పోవడానికి కూడా నెహ్రూ నిర్ణయమే కారణమన్నారు.

**పాకు చిదంబరం క్లీన్ చిట్..** పహల్గాం ఉగ్రదాడిలో పాక్ పాత్ర లేదంటూ కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి. చిదంబరం క్లీన్ చిట్ ఇచ్చారని అమిత్ షా మండిపడ్డారు. "మీరు ఎవరిని రక్షించాలని అనుకుంటున్నారు? పాక్ ను రక్షించడం ద్వారా ఏం సాధిస్తారు?" అని అమిత్ షా అడిగారు. "1986లో రాజీవ్ గాంధీ ప్రభుత్వ హయాంలో దావూద్ ఇబ్రహీం కస్కర్. 1993లో కాంగ్రెస్ సర్కార్ హయాంలోనే సయ్యద్ సలాహుద్దీ న్, టైగర్ మెమన్, అనిస్ ఇబ్రహీం కస్కర్ దేశం విడిచి పారిపోయారు. రియాజ్ భత్కల్ 2007లో, ఇక్బాల్ భత్కల్ 2010లో పారిపోయారు. వీళ్లందరినీ దేశం విడిచి ఎందుకు పారిపోనిచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

**టెర్రరిస్టుల కోసం ఖుర్షీద్, సోనియా ఏడ్చారు..** 2008 నాటి ఢిల్లీ బాటా హౌస్ ఎన్ కౌంటర్ ఘటనలో హతమైన టెర్రరిస్టులకోసం సల్మాన్ ఖుర్షీద్ కన్నీరు కార్చారని అమిత్ షా అన్నారు. "బాట్లా హౌస్ టెర్రరిస్టుల కోసం సోనియా కూడా కన్నీరు కార్చారు. నిజంగా ఆమె కన్నీళ్లు రాల్చాలని అనుకుంటే.. ఆ ఘటనలో అమరుడైన మోహన్ శర్మ కోసం చేయాల్సింది" అని విమర్శించారు.

# రోజుకు 50 సార్ లు మాత్రమే బ్యాలెన్స్ చెకింగ్

- **ఆటోపే లావాదేవీలకు టైమ్ స్లాట్లు**
- **యూపీఐ సేవల్లో పలు మార్పులు**
- **ఆగస్టు 1 నుంచి కొత్త నిబంధనలు**




యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్ (యూపీఐ)లో ఆగస్టు 1 నుంచి పలు మార్పులు అమ ల్లోకి వచ్చాయి. ఇవి వినియో గదా రులతోపాటు బ్యాంకులు, వ్యాపారు లను ప్రభావితం చేయనున్నాయి. ఫలి తంగా యూపీఐ వినియోగదారులు ప్రస్తుతం ఉన్నట్టు అపరిమితంగా కాకుండా రోజుకు 50 పర్యాయాలు మాత్రమే తమ ఖాతాలోని బ్యాలెన్సును చెక్ చేసుకునే వీలుంటుంది. యూపీఐ ఆటోపే లావాదేవీలకు ఎన్పీసీఐ నిర్ణీత టైమ్ స్లాట్లను నిర్ణయించడంతో సబ్ స్క్రిప్షన్లు, ఈఎంఐలు, వినిమయ బిల్లులు లాంటి చెల్లింపులను ఇకపై పగటిపూట ర్యాండమ్గా కాకుండా నిర్ణీత సమయాల్లో మాత్రమే ప్రాసెస్ చేస్తారు.

ఈ మార్పు వల్ల కస్టమర్లపై ప్రత్యక్ష ప్రభా వమేమీ ఉండదు. ఎందుకంటే వారి ఆటో–పేమెంట్లు యథావిధిగా పనిచే స్తాయి. కానీ, వ్యాపారులు మాత్రం తమ పేమెంట్ కలెక్షన్ షెడ్యూళ్లను నిర్దే శిత టైమ్ స్లాట్లకు అనుగుణంగా తిరిగి సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐని మరింత ఆధారపడదగిన దిగా, ప్రత్యేకించి రద్దీ సమయాల్లో అంత రాయాలకు తావులేకుండా లావాదేవీలు సజావుగా సాగేలా తీర్చిదిద్దడం ఈ మార్పుల లక్ష్యం.

# నిసార్ సక్సెస్..
# శ్రీహరికోట నుంచి ప్రయోగించిన ఇస్రో




శ్రీహరికోట: భారత్, అమెరికా అంతరిక్ష సంస్థలు ఇస్రో, నాసా సంయుక్తంగా చేపట్టిన తొలి ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. భూ ఉపరితలాన్ని అత్యంత స్పష్టంగా ఫొటోలు తీసి పంపగలిగే 'నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ (నిసార్)' ఉపగ్రహం సక్సెస్ఫుల్గా అంతరిక్షంలోకి చేరింది. ఏపీలోని శ్రీహ రికోట 'షార్' అంతరిక్ష కేంద్రం నుంచి జులై 30న సాయంత్రం 5:40 గంటలకు నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ ఎఫ్ 16 రాకెట్ 19 నిమిషాల ప్రయాణం తర్వాత నిసార్ శాటిలైట్ను ని ర్దేశిత 745 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి చేర్చింది. ఐదేండ్లపాటు సేవలు అందించే నిసార్ శాటిలైట్ 3 నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. నిసార్ శాటిలైట్ ప్రాజెక్టును ఇస్రో, నాసా పదేండ్ల క్రితం ప్రారంభించాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ఇందులో రెండు ఫ్రీక్వెన్సీలతో కూడిన ఎల్ బ్యాండ్, ఎస్ బ్యాండ్ రాడార్లను అమర్చారు. ఎల్ బ్యాండ్ రాడార్ న్ను నాసా, ఎస్ బ్యాండ్ రాడార్ను ఇస్రో తయారు చేశాయి. 12 మీటర్ల వెడల్పుతో కూడిన భారీ యాంటెన్నాను జోడించారు. 2,393 కిలోల బరువైన ఈ శాటిలైట్ తయారీకి 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేశారు.

**12 రోజులకోసారి మొత్తం భూగోళం డేటా..** భూమి చుట్టూ ప్రతి 97 నిమిషాలకు ఓసారి తిరిగివచ్చే నిసార్ శాటిలైట్ ప్రతి 12 రోజులకు ఓసారి మొత్తం భూగోళ ఉపరితలాన్ని కొండలు, అడవులు, సముద్రాలు, హిమాలయాలు, గ్లేసియర్లు, ఎడారులు సహా అణువణువూ ఫొటోలు తీసి పంపనుంది. పగలు, రేయి, ఎలాంటి వాతావరణం ఉన్నాఒక సెంటీమీటర్ స్థలంలో జరిగే మార్పులను కూడా ఇది పసిగట్టనుం ది. ప్రపంచంలో ఇంతవరకూ ఏ భూ పరిశీలన ఉప గ్రహమూ అందించనంత పెద్ద ఎత్తున డాటాను ఈ శాటిలైట్ భూమికి పంపనుంది. ఈ ఉపగ్రహం పంపే టెరాబైట్ల కొద్దీ డేటాతో భూభాగం, మంచు ఖండాల 3డీ వ్యూను కూడా రూపొందించవచ్చు. ఇస్రో, నాసా గ్రౌండ్ సెంటర్లకు చేరే ఈ సమాచారాన్నిభారత్, అమెరికాతోపాటు ఇతర అన్ని దేశాల రీసెర్చర్లకూ అందు బాటులో ఉంచనున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, క్లైమేట్ చేంజ్, వరదలు, వ్యవసాయం, జల వనరుల వంటి అనేక అంశాలపై కచ్చితమైన సమాచారం అందనుంది.

# ట్రంప్ అబద్ధం ఆడుతున్నారని మోదీ చెప్పలేకపోతున్నారు

- **ఆయన ఎక్కడ నిజాలు చెప్తాడేమోనని భయపడ్తున్నారు: రాహుల్ గాంధీ**
- **కాల్పుల విరమణలో తనదే కీలక పాత్ర అని ట్రంప్ 30 సార్లు చెప్పారు**
- **ట్రేడ్ డీల్ కోసం ఇండియాపై ఒత్తిడి తెచ్చేందుకేనని ఆరోపణ**
- **ట్రంప్ కు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం మోదీకి లేదు: ఖర్గే ఎద్దేవా**



భారత్– పాక్ మధ్య సీజ్ ఫైర్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అబద్ధం చెబుతు న్నారని ప్రధాని మోదీ చెప్పలేకపోతున్నారని లోక్సభప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇరుదే శాల మధ్య యుద్ధం ఆపడంలో తాను కీలక పాత్ర పో షించానని ఇప్పటివరకూ ట్రంప్ దాదాపు 30 సార్లు చెప్పారని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్పై లోక్ సభలో చర్చ సందర్భంగా గంటకు పైగా ప్రసంగించిన మోదీ.. ట్రంప్ ప్రస్తావన తీసుకురాలేదని అన్నారు.

పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్లో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. సీజ్ ఫైర్ విషయంలో ట్రంప్ అబద్ధం చెబుతున్నారని ప్రధాని మోదీ చెప్పలేర ని, అలా చేస్తే ట్రంప్అసలు నిజాలు ఎక్కడ బయట పెడ తారోనని మోదీ భయపడుతున్నారని అన్నారు. "ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోదీ చెప్పలేదు. అక్కడ ఏం జరిగిందో క్లియర్గా ఉంది. అయినా.. ట్రంప్ అబద్ధం ఆడుతున్నారని చెప్పలేకపోతున్నారు. ట్రంప్ చెప్పేది అబద్ధమని చెబితే.. ఆయనే బహిరంగంగా నిజం చెబుతారు. అందుకే ప్రధాని ఏం చెప్పలేకపోతున్నా రు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ట్రేడ్ డీల్ కోసం భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ట్రంప్ ఈవ్యాఖ్యలు చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పుడు ఎలాంటి వాణిజ్య ఒప్పందం జరుగుతుందో మనమందరం చూస్తున్నామంటూ ఎద్దేవా చేశారు.

**మోదీ తీరు అనుమానంగా ఉంది: ఖర్గే** సీజ్ఫైర్ విషయంలో ట్రంప్ అబద్ధాలు చెబుతున్నా రని చెప్పే ధైర్యం ప్రధాని మోదీకి లేదని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ తీరు చూస్తుంటే ఏదో అనుమానంగా ఉన్నదని తెలిపారు. చర్చల్లో థర్డ్పార్టీ మధ్యవర్తిత్వాన్ని తాము ఎప్పుడూ అంగీక రించలేదని, అది ఇప్పటికీ ఆమోదయోగ్యం కాదని అన్నారు. "మరి దీనిని వారు ఎందుకు అంగీకరిం చారు? ఇందుకు గల కారణాలు ఏంటి? అనేది వారు (కేంద్ర సర్కారు) దేశానికి చెప్పాలి" అని డిమాండ్ చేశారు. మోదీ తన ప్రసంగంలో ఒక్కసారి కూడా ట్రంప్ పేరును ప్రస్తావించలేదని అన్నారు. సీజ్ఫైర్ విషయంలో ట్రంప్ వ్యాఖ్యలను ఖండించి, ఆయన భారత ప్రతిష్టను వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నార ని మోదీ చెప్పి ఉండాల్సింది అని ఖర్గే అన్నారు. కాగా, ట్రంప్ అబద్ధం చెబుతున్నారని ప్రధాని మోదీ లోక్స భలో స్పష్టం చేసి ఉండాల్సిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభిప్రాయపడ్డారు.

# రవాణాశాఖలో సర్వీస్ చార్జీల మోత
## పెరిగిన లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ల చార్జీలు




ఇప్పటికే ఇంధన ధరలు, ఇన్సూ రెన్స్ ఖర్చులు, టోల్ ఫీజులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులపై రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ల సర్వీస్ చార్జ్ లను పెంచి మరింత భారాన్ని మోపింది. రాష్ట్ర రవాణాశాఖ వాహనదారులపై సర్వీ సు చార్జీలను భారీగా పెంచింది. ట్యాక్సే షన్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్, పర్మిట్ సర్టిఫికెట్లకు సంబంధించిన చార్జీలను పెంచుతూ ఉత్త ర్వులు జారీచేసింది. కొత్త రేట్ల ప్రకారం.. లైసెన్స్ సర్వీస్ చార్జీని రూ. 200కు, మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ సర్వీస్ చార్జీని రూ.300కు పెంచారు. నాన్ ట్రాన్స్పోర్ట్ లైసెన్సు కొత్తగా రూ.400 వసూలు చేయనున్నారు. వాహన రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెరిగాయి. టూవీలర్ల రిజిస్ట్రేషన్లో కొనుగోలు ధరపై రూ.0.5శాతం అదనపు చార్జి వసూలు చేయనుండగా, నాన్ ట్రాన్స్ పోర్ట్ వాహనాలపై 0.1శాతం పెంపు అమ లులోకి వచ్చింది. ఆటో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.250కు చేరగా, మిగతా వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500కు పెరిగింది. ఫిట్ నెస్ సర్టిఫికెట్ రేట్లు కూడా సవరించారు. త్రీవీలర్లకు రూ.200, మిగతా వాహనా లకు రూ.300 వసూలు చేయనున్నారు. పర్మిట్ సర్టిఫికెట్ ఫీజులు పెరిగాయి. త్రీవీల ర్లకు రూ.200, మిగతా వాహనాలకు రూ.300 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ పెంపుతో రవాణాశాఖలో సేవలు పొందే వారికి అదనపు వ్యయం తప్పదని వినియోగదాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారత సైన్యంలోకి ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్... రుద్ర

కార్గిల్: భారత సైన్యంలో శక్తివంతమైన దళాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. దీనికి 'రుద్ర' అనే పేరు పెట్టామని తెలిపారు. శనివారంనాడు 'కార్గిల్ విజయ దివస్' సందర్భంగా కార్గిల్లోని వార్ మెమెరోయిల్ వద్ద ఆయన అమరవీరులకు నివాళుల ర్పించారు. అనంతరం మాట్లాడుతూ, శత్రువుల ఆటకట్టిం చేందుకు, భవిష్యత్ ముప్పును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ఆల్ ఆర్మ్ బ్రిగేడ్.. రుద్రను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనికి శుక్రవారంనాడు ఆమోదం తెలిపినట్టు చెప్పారు.

'రుద్ర' యూనిట్లో పదాతిదళం, యాంత్రిక పదాతిదళం, సాయుధ యూనిట్లు, ఫిరంగి సేన, ప్రత్యేక దళాలు, మానవరహిత ఏరియల్ యూనిట్లు ఉంటాయని ద్వివేది తెలిపారు. సరిహద్దుల్లో శత్రువులు వణుకు పుట్టించేందుకు లైట్ కమెండో యూనిట్ 'భైరవ్'ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పదాతిదళం ఇప్పుడు ఒక డ్రోన్ ప్లాటూన్ అని, ఆర్టిలరీలో శక్తిభాన్ రెజిమెంట్ ఉంటుందని, డ్రోన్, కౌంటర్-డ్రోన్, లోయిటరింగ్ మందుగుండు సామగ్రి వంటివి సన్నద్ధంగా ఉంటాయని చెప్పారు. రాబోయే రోజుల్లో మన సామర్థ్యం అనేక రెట్లు పెరగనుందని, స్వదేశీ క్షిపణులతో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు.

# గొర్రెల పంపిణీ స్కామ్' కేసు.. ఈడీ దాడులు..

- **హైదరాబాద్ పరిధిలో 10 సోదాలు**
- **ఈడీ అదుపులో మాజీ మంత్రి ఓఎస్టీ**
- **మనీలాండరింగ్ యాక్ కింద దర్యాప్తు**



గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన స్కాం కేసు విచారణలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ కార్యాలయం అధికారులు దాడులు చేపట్టారు. హైదరాబాద్ పరిధిలో 10 చోట్ల ఈడీ దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్, బోయిన్పల్లి, జూబ్లీహిల్స్ ప్రాంతా ల్లో ఈడీ సోదాలు చేపట్టింది. ఈ పథకంలో అక్రమాలు జరిగాయని యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) అధికారులు 2024లో కేసు నమోదు చేశారు.

నిందితులను అరెస్ట్ చేశారు. మొత్తంగా రూ.700 కోట్ల అక్రమాలు జరిగాయని, ఈ స్కామ్లో ఇతర రాష్ట్రాలకు లింకులు ఉన్నాయని ఏసీబీ గుర్తించింది. ఏసీబీ అధికారులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో బుధవారం ఈడీ అధికా రులు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్టీ కళ్యాణ్ను అదుపులోకి తీసుకొని విచారిస్తు న్నారు. మనీ లాండరింగ్ యాక్ట్ కింద దర్యాప్తు చేపట్టింది. టీజీ షిప్ అండ్ గోట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామచంద్ర నాయక పాటు విక్రేతలు మొయినుద్దీన్, కమ్రుద్దీన్ ఇళ్లలోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహిం చినట్లు సమాచారం. గొర్రెల స్కీంకు సంబంధిం చిన పూర్తి వివరాలను సేకరించినట్లుగా తెలిసింది. 2015లో అప్పటి ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేశారు.

# జస్టిస్ వర్మ అభిశంసనపై కేంద్రం నియంత్రణ

## ధన్ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించడమే నేరమైంది: సింఘ్వీ



న్యూఢిల్లీ, : ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్ఖడ్ ఆకస్మిక రాజీనామాకు గల కారణాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. రాజ్యసభ చైర్మన్ హోదాలో ధన్ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించడమే ఆయన చేసిన పెద్ద నేరంగా కనిపిస్తోందని కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ వ్యాఖ్యానించారు. జస్టిస్ వర్మ అభిశంసన తీర్మానం విషయంలో రాజ్యసభ చైర్మన్గా ధన్ఖడ్ వ్యవహ రించిన తీరు కేంద్రంలోని పెద్దలకు కొరుకుడు పడలేదని, అందుకే ఆయనను రాజీనామా చేసేలా వ్యవహ రించారని ఆరోపించారు. జస్టిస్ వర్మ అభిశంసనపై నియంత్రణను కేంద్రం తన చేతిలోకి తెచ్చుకోవాలని భావించిందన్నారు.

దీనికి ధన్ఖడ్ ఒప్పుకోకపోవడం, స్వతంత్రంగా వ్యవహరించడంతో.. "ముందు లోక్సభలోనే మా తీర్మానం. రాజ్యసభలో కాదు. నీతో పనిలేదు పో!." అన్నట్టుగా కేంద్రం వ్యవహరించిందని సింఘ్వీ వ్యాఖ్యానించారు.

# ఉద్యాన పంటలకు ఊతం..

- కూరగాయలు, పండ్లు, పూలు సాగు చేసే రైతులకు సబ్సిడీలు
- పందిరి తోటల ఏర్పాటుకు అర ఎకరానికి రూ.50 వేలు
- గరిష్టంగా రెండున్నర ఎకరాల వరకు రాయితీ
- ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద నిధులు
- సెంట్రల్ స్కీమ్ నుంచి అందనున్న రూ.145 కోట్లు
- కూరగాయలు, పండ్లు, పూల తోటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర,
- రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీలతో కూడిన
- పథకాలను అందజేస్తున్నాయి. మిషన్ ఫర్ ఇంటిగ్రే



టెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ పాం, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన వంటి పథకాలతో రైతులకు జాతీయ ఉద్యాన మండలి (ఎనెచ్ బీ) భారీగా సబ్సిడీలను అందిస్తోంది. సొంత భూమి ఉండి, ఆధునిక పద్ద తులతో ఉద్యాన పంటలు సాగు చేయాలనుకునే రైతులకు ఈ పథకాలు ఉపయోగపడనున్నాయి. రక్షిత సాగు (నెట్ హౌస్, గ్రీన్ హౌస్) కింద 2,500 చదరపు మీటర్లు లేదా అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో టమాటా, క్యాప్సికం, కీర, దోసకాయ వంటి కూర గాయలు లేదంటే గులాబీ, ఆర్కిడ్, అంథూరియం వంటి పూల సాగుకు ఎనెచ్బీ రూ.1.12 కోట్ల వరకు మంజూరు చేస్తోంది. ఇందులో 50 శాతం సబ్సిడీగా అందనుంది. ఈ నిధులతో నెట్స్, గ్రీన్ హౌస్, యాంటీబర్డ్ నెట్స్, టన్నెల్, హెయిల్ నెట్స్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవచ్చు. బహిరంగ క్షేత్రంలో ఐదెకరాల విస్తీర్ణంలో నిమ్మ, నారింజ, మామిడి, సీతాఫలం, రేగు, అరటి, దానిమ్మ వంటి పండ్ల తోటల సాగుకు రూ.75 లక్షల వరకు మంజూరు చేస్తారు. ఇందులో 40 శాతం (రూ.30 లక్షలు) సబ్సిడీగా అందుతుంది. నేల చదును. సూక్ష్మసేద్యం, యాంత్రీకరణ, నీటిపా రుదల వ్యవస్థ. ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఈ నిధులను వినియోగించవచ్చు.

కోల్డ్ స్టోరేజీలు,ప్యాక్ హౌజ్లకు అందనున్న రాయితీ : కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాల కోసం ప్యాక్ హౌస్, రీపేనింగ్ చాంబర్, శుద్ధియూనిట్లు, శీతలీకరణ నిర్మాణాలకు రూ.1.45 కోట్ల వరకు మంజూరు చేయనున్నారు. ఇందులో 30 శాతం అంటే రూ.50.75 లక్షలు సబ్సిడీగా లభిస్తుం ది. అలాగే 5 వేల నుంచి 10 వేల టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి 35 శాతం సబ్సిడీ అందుతుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద 20 గుంటల విస్తీర్ణంలో పందిరి నిర్మాణానికి రూ.50 వేల సబ్సిడీ అందుతుంది. గరిష్ఠంగా 2.20 ఎకరాల వరకు ఈ రాయితీ పొందవచ్చు. సన్నకారు రైతులు శాశ్వత పందిరి విధానంలో తీగజాతి కూరగాయ లు సాగు చేసి నిరంతర ఆదాయం పొందవచ్చు.

'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ పామ్' పథకం కింద ఆయిల్ పామ్ సాగును ప్రోత్స హిస్తున్నారు. ఒక హెక్టార్కు 143 మొక్కలు అవస రమవుతాయి.

ఒక్కో మొక్క ధర రూ.193 కాగా, పూర్తిగా ఉచితంగా ఇవ్వనున్నారు. అంతర పంటల సాగు కోసం ఏడాదికి హెక్టార్కు రూ.5.250. నాలుగేళ్లకు రూ.21,000 సబ్సిడీ ఇస్తారు. ఎరువులు, పురుగుమందులకు కూడా ఇదే మొత్తంలో రాయితీలభిస్తుంది.

డ్రిప్, స్ప్రింక్లర్లకు సైతం... : 'బిందు సేద్యం' పథకం కిందడ్రిప్, స్ప్రింక్లర్లకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఐదెకరాల్లోపు ఉన్న ఓసీ రైతులకు 80 శాతం సబ్సిడీ అందిస్తున్నారు. హార్టికల్చర్ పంటలను కోతులు, అడవిపందుల నుంచి కాపాడుకునేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద వివిధ పరికరాలను కూడా అందజేస్తున్నారు.

క్లస్టర్ల ద్వారా సాగు ప్రోత్సాహం :రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటల సాగుకు అనువైన ప్రాంతాలను క్లస్టర్లుగా గుర్తించి రూ.145 కోట్ల కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర నిధుల ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి జిల్లాకు రూ.4.50 కోట్ల చొప్పున కేటాయిస్తూ మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, దానిమ్మ వంటి తోటల సాగును పెంచేందుకు మొక్కలు, ఎరువులు, నీటి సౌకర్యాల కురాయితీలు అందిస్తున్నారు.

# గురుకుల వ్యవస్థను కాపాడాలి

- **సమస్యల పరిష్కారానికి విద్యార్థులు పాదయాత్ర చేయాలా?**
- **భావిభారతాన్ని రోడ్డెక్కించిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్**
- **మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**



దిగజారుతున్న గురుకుల వ్యవస్థను సీఎం రేవంత్రెడ్డి కాపాడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రవు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించా లంటూ జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ గురుకుల విద్యార్థులు పాదయాత్ర చేయడంపై హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. స్థానిక ఎన్నికల్లో లబ్ది కోసం పాదయాత్ర చేయడం కాదు.. గురుకుల పిల్లల పాదయాత్రపై దృష్టి సారించాలని సూచించారు. ప్రశ్నించిన వారిపై, ప్రతిపక్షాలపై జులుం ప్రదర్శించే రేవంత్ తమ సమస్యలు పరిష్కరించా లంటూ పాదయాత్ర చేస్తున్న ఈ గురుకుల విద్యార్థులకు ఏమని సమాధానం చెబుతా రని నిలదీశారు. పరిపాలన గాలికి వదిలేసి, అనునిత్యం రాజకీ యాలు చేసే రేవంత్రె డ్డికి, కాంగ్రెస్ పార్టీకి గురుకుల విద్యార్థుల గోస కనిపించకపోవడం అమానవీయమని పేర్కొన్నారు. తరగతి గదుల్లో ఉండాల్సిన భావిభారత విద్యార్థులను నడిరోడ్డు ఎక్కించిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభు త్వానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువు కోవాల్సిన పిల్లలకు పట్టెడు అన్నం, తాగునీటి కోసం పాదయాత్రలు చేసే దుస్థితి కల్పించారని మండిపడ్డారు. 'వీ వాంట్ జస్టిస్' అని అన్నందుకు పోలీసు లను పెట్టి బలవంతంగా విద్యార్థులను డీసీ ఎంలలో తరలించిన నీచమైన చరిత్ర ఈ ఇందిరమ్మ రాజ్యానిదని విమర్శించారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక అడిగినా ప్రభుత్వంలో చలనం రావడం లేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరవాలని.. కాంగ్రెస్ పాలనలో రోజు రోజుకూ పతనమవుతున్న గురుకుల వ్యవస్థను గాడిన పెట్టాలని డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తా నుంచి పాద యాత్రగా వెళ్లి జిల్లా కలెక్టర్కు విద్యార్థులు ఇవ్వాలనుకున్న ఫిర్యాదుకు తక్షణం పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు.

# టిబెట్‌లో చైనా నిర్మిస్తున్న అతిపెద్ద డ్యామ్‌ను 'భారత్‌పై వాటర్ బాంబ్'అని ఎందుకు అంటున్నారు?



ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోపవర్ డ్యామ్‌ను చైనా అధికారులు టిబెట్ భూభాగంలో నిర్మించడం ప్రారంభించారు. ఇది భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలను రేకెత్తించింది. యార్లుంగ్ త్సాంగ్పో నదిపై చైనా దీన్ని నిర్మిస్తోంది. జులై 26న జరిగిన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి చైనా ప్రధాని లి కియాంగ్ హాజరైనట్లు స్థానిక మీడియా కథనాలు తెలిపాయి. ఈ నది టిబెటన్ పీఠభూమి గుండా ప్రవహిస్తుంది. నది దిగువన భారత్, బంగ్లాదేశ్‌లోని లక్షలాది మంది ప్రజలను ఈ ప్రాజెక్టు ప్రభావితం చేస్తుందని, పర్యావరణానికి, స్థానిక టిబెటన్లకు హాని కలిగిస్తుందనే వాదనలున్నాయి. అయితే, దాదాపు రూ. 14.4 లక్షల కోట్లు (1.2 ట్రిలియన్ యువాన్లు) ఖర్చుతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రకృతిని కాపాడుతుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయ పడుతుందని చైనా అంటోంది.

మోటువో హైడ్రోపవర్ స్టేషన్ అని పిలిచే ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌గా మారుతుంది. చైనా ప్రస్తుత త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే కూడా ఇది పెద్దది. మోటువో దానికంటే మూడు రెట్లు ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేయగలదు. ఈ డ్యామ్ యార్లుంగ్ త్సాంగ్పో నదీ ప్రవాహాన్ని నియంత్రించడానికి లేదా మార్చడానికి చైనాకు వీలు కల్పిస్తుందని నిపుణులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నది భారతదేశంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలలోకి, అలాగే బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. ఇది ఈ ప్రాంతాలలో సియాంగ్, బ్రహ్మపుత్ర, జమునా నదులుగా ప్రహహిస్తుంది. టిబెట్ పీఠభూమిలోని నదులపై చైనా నియంత్రణ భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది" అని ఆస్ట్రేలియన్ పరిశోధనా బృందం లోవీ ఇనిస్టిట్యూట్ 2020 నివేదికలో పేర్కొంది.

**చైనాతో భారత్ ఏం చెప్పింది ?** ప్రాజెక్టు విషయమై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జనవరిలో చైనా వద్ద ఆందోళన వ్యక్తం చేసిందని, దిగువన నివసించే ప్రజలకు హాని జరగకుండా చూసుకోవాలని కోరిందని ఆ శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇటువంటి పెద్ద ప్రాజెక్టుల విషయంలో దిగువన ఉన్న దేశాలతో పారదర్శకత, సంప్రదింపుల అవసరాన్ని కూడా సూచించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో, భారత్ తన ప్రజలను రక్షించుకోవడానికి సియాంగ్ నదిపై హైడ్రోపవర్ డ్యామ్ నిర్మించాలని యోచిస్తోంది. చైనా అకస్మాత్తుగా తన ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తే వరద

ముప్పునకు గురికాకుండా ఈ డ్యామ్ రక్షణగా పనిచేస్తుంది.తన నదులపై డ్యామ్‌లు నిర్మించే చట్టపరమైన హక్కు తనకు ఉందని, దిగువన ఉన్న దేశాలపై ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు చైనా చెప్పింది.మరోవైపు, ప్రాజెక్టుపై బంగ్లాదేశ్ కూడా ఆందోళనలు వ్యక్తం చేసింది, ఫిబ్రవరిలో డ్యామ్ గురించి మరింత సమాచారం కోరుతూ చైనాకు ఒక లేఖ పంపింది.

**లోతైన లోయలో డ్యామ్ :** టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ప్రదేశంలో విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి చైనా అధికారులు చాలాకాలంగా ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత లోతైనది, భూమిపై అతి పొడవైనదిగా భావిస్తున్న లోయలో ఈ డ్యామ్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతం టిబెట్‌లోని అతి పొడవైన నది అయిన యార్లుంగ్ త్సాంగ్పో, నామ్చా బార్వా అనే పర్వతం చుట్టూ యూటర్న్ తీసుకునే వెంబడి ఉంది.ఈ మలుపును "గ్రేట్ బెండ్" అని పిలుస్తారు, ఈ మలుపు తీసుకునే క్రమంలో నది ఎత్తు వందల మీటర్లకు పడిపోతుంది. ఈ నదిలో కొంత భాగాన్ని మళ్లించడానికి నామ్చా బార్వా పర్వతం గుండా 20 కిలోమీటర్ల పొడవైన సొరంగాలను తవ్వు తామని మునుపటి ప్రణాళికలో చైనా అధికారులు తెలిపారు.

ఇంజనీర్లు సొరంగాల ద్వారా నీటిని మళ్లించడం కోసం ఐదు మెట్ల లాంటి (క్యాస్కేడింగ్) విద్యుత్ కేంద్రాలను నిర్మించడానికి పని చేస్తారని చైనా అధికారిక వార్తాసంస్థ జినువా నుంచి వచ్చిన ఇటీవలి కథనం తెలిపింది. ఉత్పత్తి అయిన విద్యుత్‌లో టిబెట్‌లో కొంత, చైనాలోని ఇతర ప్రాంతాలకు ఎక్కువ భాగం పంపిస్తారని కూడా తెలిపింది.దేశంలోని విద్యుత్ కొరత ఉన్న తూర్పు మహానగరాల కోసం భారీ ఆనకట్టలు, హైడ్రోపవర్ స్టేషన్లను నిర్మించడానికి చైనా టిబెటన్ ప్రాంతాలతో సహా పశ్చిమ ప్రాంతంలోని ఏటవాలు లోయలు, శక్తిమంతమైన నదులపై దృష్టి సారించింది.అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ "షీడియాన్‌డోంగ్‌సాంగ్" అనే విధానం ద్వారా ఈ ప్రణాళికకు మద్దతు ఇచ్చారు, దీనర్థం "పశ్చిమం నుంచి తూర్పుకు విద్యుత్తును పంపడం".ఈ డ్యామ్‌లు దేశానికి, స్థానిక ప్రజలకు ఉపయోగకరమని చైనా ప్రభుత్వం, దాని మీడియా చెబుతున్నాయి. డ్యామ్‌లు కాలుష్యాన్ని తగ్గిస్తాయని, శక్తిని అందిస్తాయని, టిబెటన్ల జీవితాలను మెరుగుపరచడంలో సహాయపడతాయని చెప్పాయి.

**టిబెట్ దోపిడీ..** టిబెటన్లను, వారి భూమిని బీజింగ్ దోపిడీ చేస్తోందనడానికి తాజా ఆనకట్టలే ఉదాహరణ అని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.గత సంవత్సరం, వందలాది మంది టిబెటన్లు మరొక ఆనకట్టకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం వారిలో చాలామందిని అరెస్టు చేసింది, కొంతమందిని తీవ్రంగా కొట్టినట్లు కొన్నివర్గాలు, ధ్రువీకరణ వీడియోల ద్వారా తెలుసుకుంది.జీవవైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన టిబెటన్ లోయలు ముంపునకు గురవడంతో పాటు, భూకంప ప్రమాదాలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో డ్యామ్‌లు నిర్మించడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి కూడా ఆందోళనలు ఉన్నాయి.

**ఇదొక వాటర్ బాంబ్: అరుణాచల్ ప్రదేశ్ సీఎం :** ఈ నెల ప్రారంభంలో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ "డ్యామ్ నిర్మాణం పూర్తయితే సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు చాలావరకు ఎండిపోవచ్చు" అన్నారు. ఈ ప్రాజెక్ట్ మా తెగలకు, మా జీవన విధానానికి, ఉనికి ముప్పు కలిగించనుంది. ఎందుకంటే, చైనా దీనిని ఒక రకమైన వాటర్ బాంబ్‌గా కూడా ఉపయోగించు కోవచ్చు" అని పెమా అభిప్రాయపడ్డారు.

చైనా అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తే, అది సియాంగ్ నది వెంబడి ఉన్న గ్రామాలను నాశనం చేయగలదని, ముఖ్యంగా ఆది తెగ వంటి సమూహాలకు హాని కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు.

# మందకృష్ణ పోరాటంతోనే వర్గీకరణ

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. బోయినపల్లిలో మందకృష్ణకు సత్కారం

బోయినపల్లి, : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి మందకృష్ణ మాదిగ ఎనలేని కృషి చేశారని, ఆయన అలుపెరుగని పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మిత్రమండలి నాయకుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా బోయినపల్లిలో అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు నర్మద మల్లికార్జున్ పాల్గొని మందకృష్ణను గజమాలతో ఘనంగా సత్కరించి శుభా కాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మందకృష్ణ స్ఫూర్తిగా కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు తదితర అనేక ప్రాంతాలకు వర్గీకరణఉద్యమం విస్తరించిందన్నారు. కంటోన్మెంట్ బీజేపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలతో పాటు మందకృష్ణ అభిమానులు, వివిధ పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రెడిట్ కార్డుల బకాయిలు 1 34 వేల కోట్లు

## గత ఏడాదితో పోలిస్తే 44% పెరుగుదల..




క్రెడిట్ కార్డులు చాలా మందిని అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ సీఆర్ఐఎఫ్ హైమార్క్ డేటా ప్రకారం, 91 నుంచి 360 రోజుల ఓవర్డ్యూ ఉన్న క్రెడిట్ కార్డు బకాయిలు కేవలం ఒక్క సంవత్సరంలో 44శాతం పెరిగాయి. ఈ ఏడాది మార్చి నాటికి కార్డుహోల్డర్లు దాదాపు రూ. 34 వేల కోట్ల బకాయిలను చెల్లించాలి. మూడు నెలలు గడుస్తున్నా వీళ్ల బిల్లులు కట్టడం లేదు. దీర్ఘకాలంగా చెల్లించని బకాయిలు మొండిబాకీల (ఎన్పీఏలు) కేటగిరీలోకి చేరుతాయి. చాలా మంది తమ క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించ డానికి ఇబ్బందులు పడుతున్నారని లేదా చెల్లించ కూడదని నిర్ణయించుకుంటున్నారని సీఆర్ ఐఎఫ్ తెలిపింది. ఎక్కువ మంది 91-180 రోజుల ఓవర్ డ్యూ పరిధిలో ఉన్నారు. ఈ విభాగంలో బకాయిల మొత్తం రూ.29,983.6 కోట్లకు పెరిగింది. గతేడాది వీటి విలువ రూ.20,872.6 కోట్లు ఉంది. రెండు సంవత్సరాల క్రితంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువగా ఉంది. కంపెనీలు ఇచ్చిన లోన్ల రిస్కును కొలిచే పోర్ట్ఫోలియో ఎట్ రిస్క్ (పీఏఆర్) కూడా పెరుగుతోంది. 91-180 రోజులు బకాయి ఉన్న కార్డులకు, పీఏఆర్ ఈ ఏడాది మార్చిలో 8.2శాతానికి పెరిగింది. ఒక సంవత్సరం ముందు ఇది 6.9శాతంగా ఉంది. 181-360 రోజుల బకా యిలకు ఇది 2024లో 0.9శాతం ఉంది. క్రెడిట్ కార్డుల బకాయిలు చెల్లించకపోతే 42శాతం నుంచి 46శాతం వరకు వడ్డీ (ఏడాదికి) కట్టాలి. బకాయిలు పేరుకుపోతుండటంతో ఆర్బీఐ క్రెడిట్ కార్డు లోన్ల రిస్క్ వెయిట్ను పెంచింది. బ్యాంకులు వాటిని జారీ చేయడానికి రూల్స్ను కఠినంగా మార్చింది.

**తగ్గని వాడకం..** బకాయిలు పెరుగుతూనే ఉన్నప్పటికీ, క్రెడిట్ కార్డుల వాడకం విపరీతంగా ఉంది. ఈ ఏడాది మే నాటికి, మొత్తం క్రెడిట్ కార్డు బకాయిల విలువ రూ.2.90 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ ఏడాది క్రితం వీటి విలువ రూ.2.67 లక్షల కోట్లు ఉంది. ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి, క్రెడిట్ కార్డు లావాదేవీల విలువ రూ.21.09 లక్షల కోట్లకు చేరుకుంది. ఏడాది లెక్కన ఇది 15శాతం పెరిగింది. కేవలం మే నెలలోనే భారతీయులు రూ. 1.89 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు చేశారు. జనవరి 2021లో ఇది కేవలం రూ. 64,737 కోట్లు మాత్రమే. యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోంది. ఈ ఏడాది మే నాటికి మనదేశంలో 11.11 కోట్ల కార్డులు ఉండగా, 2024లో 10.33 కోట్లు, జనవరి 2021లో కేవలం 6.10 కోట్ల కార్డులు ఉన్నాయి. బ్యాంకులు ఫిన్టెక్ సంస్థలు క్యాష్బ్యాక్, డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లు, ఉచిత లాంజ్ యాక్సెస్, నోకాస్ట్ ఈఎంఐ వంటి ఆఫర్లతో జనాన్ని ఊరిస్తున్నాయి. దీంతో క్రెడిట్ కార్డుల వాడకం రోజువారీ వ్యవహారంగా మారింది.

# ఏపీలో ఇస్తే ఇక్కడ ఎందుకు ఇవ్వరు?

- వికలాంగులను మోసం చేస్తున్న సర్కార్
- వచ్చే నెల 13న వికలాంగుల మహాగర్జన
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ




ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షన్ హామీ ఏపీలో అమలు చేస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడంలేదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు. మెదక్ జిల్లా కేంద్రంలో సాయి బాలాజీ గార్డెన్స్లో వచ్చే నెల 13న జరిగే వికలాంగుల మహాగర్జన సన్నాహక సమావేశం జులై 28న నిర్వ హించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం వికలాంగులకు ఇస్తున్న అన్ని సదుపా యాలు తెలంగాణ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశాడ న్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగు లకు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి 20 నెలలు గడిచినా పెంచలేదన్నారు. చంద్రబాబు నాయుడు మాట ఇచ్చిన నుంచి పెన్షన్ ఇస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన 20 నెలలు గడిచినా పెన్షన్ పెంచ కపోవడం దారుణం అన్నారు. 20 నెలలుగా రూ.20 వేల కోట్లు వికలాం గులు నష్టపోయారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేసిన రూ.20 వేల కోట్లు వికలాంగులకు సంబంధించినవే అన్నారు. పేద వర్గాల డబ్బులు దోచి భూమి ఉన్న వర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి దోచి పెట్టాడని ఆరోపించారు. వీహెచ్పీ ఎస్ జిల్లా ఇన్చార్జి దండు శంకర్, పాండు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి బొంజురు విజయ్ మాదిగ, బొజ్జ సైదులు మాదిగ, జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ, ఊసన్న గళ్ల మురళి మాదిగ, సామెల్ మాదిగ, బాలరాజు మాదిగ, సుధాకర్ మాదిగ, రవి మాదిగ, మాధవి మాదిగ పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యునిగా కమల్హాసన్ ప్రమాణం

చెన్నై, : తమిళనాడు నుంచి రాజ్యసభకు ఎంపికైన 'మక్కల్ నీదిమయ్యం' అధినేత, ప్రముఖ సినీ నటుడు కమల్హాసన్ సహా ఆరుగురు పార్లమెంట్లో ప్రమాణ స్వీకారం చేశారు. డీఎంకేకు చెందిన రాజ్యసభ సభ్యులు పి.విల్సన్, షణ్ముగం, అబ్దుల్లా, అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్, ఎండీఎంకే నేత వైగో, పీఎంకే సభ్యుడు అన్బుమణి పదవీకాలం గురువారంతో ముగిసింది. వీరి స్థానంలో తమిళనాడు నుంచి డీఎంకే మద్దతుతో ఎంపికైన కమల్హాసన్, ఆ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది విల్సన్, కవయిత్రి సల్మా, ఎస్ఆర్ శివలింగం, అన్నాడీఎంకే తరపున ఎంపికైన ఇన్బదురై, ధనపాల్ ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా తమిళంలోనే ప్రమాణం చేశారు. 2018లో కమల్ 'మక్కల్ నీదిమయ్యం' పార్టీ స్థాపించారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీ ఘోరపరాజయం పాలైంది. అయితే 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కమల్ పార్టీ డీఎంకే కూటమికి మద్దతు పలికింది. ఆ ఎన్నికల్లో ఎలాంటి స్థానం కేటాయించని డీఎంకే అధినేత స్టాలిన్.. భవిష్యత్తులో కమల్ను రాజ్యసభకు పంపుతామని హామీనిచ్చారు. ఆ మేరకు ఇప్పుడు కమల్ డీఎంకే మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికై రాజ్యసభలోకి అడుగు పెట్టారు.

# చరిత్ర సృష్టించిన 19 ఏళ్ల వండర్..

## విజయం తర్వాత కన్నీటి పర్యంతం అయిన దివ్య దేశ్‌ముఖ్



19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. కోనేరు హంపిని ఓడించి, 88వ భారత గ్రాండ్ మాస్టర్‌గా అవతరించిన దివ్య దేశ్ ముఖ్ అద్భుత ప్రయాణం గురించి పూర్తి వివరాలు ఈ వార్తలో తెలుసుకుందాం.జులై 28న జరిగిన ఫైనల్‌లో ఆమె దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిపై టై బ్రేకర్‌లో అద్భుత విజయం సాధించి, భారతదేశానికి చెందిన 88వ గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది. ప్రపంచకప్‌ను గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలైన మహిళా క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి మధ్య ఫైనల్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠగా సాగింది. టై బ్రేకర్‌లో మొదటి ర్యాపిడ్ గేమ్ డ్రాగా ముగియగా, రెండవ గేమ్‌లో దివ్య గెలిపొందింది. మొత్తం 75 ఎత్తులలో జరిగిన ఈ గేమ్‌లో కోనేరు హంపి సమయం ఒత్తిడికి గురవడం దివ్యకు కలిసివచ్చింది. విజయం సాధించిన వెంటనే దివ్య సంతోషంతో కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె తన తల్లిని కౌగిలించుకున్న భావోద్వేగ క్షణాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 2025 ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణిగా దివ్య నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దివ్యకు 1.5 పాయింట్లు లభించగా, కోనేరు హంపికి 0.5 పాయింట్లు వచ్చాయి. ఆదివారం నాటి మ్యాచ్‌లో హంపి గట్టి పోటీనివ్వడంతో ఫలితం టై బ్రేకర్‌కు దారితీసింది. దూకుడుగా ఆడిన దివ్య టోర్నీ విజేతగా నిలిచి గ్రాండ్ మాస్టర్ హోదాను దక్కించుకుంది.నాగ్‌పూర్‌కు చెందిన 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ సీనియర్ విభాగంలో చాలా తక్కువ టోర్నీలు మాత్రమే ఆడింది. కోనేరు హంపితో పోల్చుకుంటే దివ్య అనుభవం చాలా తక్కువ. ఈ టోర్నీకి ముందు ఆమెకు గ్రాండ్ మాస్టర్ హోదా కూడా లేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందిన దివ్య, 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అలాగే ఒలింపియాడ్‌లో మూడు స్వర్ణ పతకాలను కూడా అందుకుంది. ఈ ప్రపంచకప్‌లో తనకంటే మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక, జు వెన్జున్ వంటి ప్రతిభావంతులను ఓడించి అందర్నీ ఆకట్టుకుంది. డిసెంబర్ 2024లో కోనేరు హంపి తన కెరీర్‌లో రెండవసారి వరల్డ్ ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచింది. కాబట్టి, ఫైనల్‌లోకి వచ్చేసరికి దివ్య దేశ్‌ముఖ్ అండర్‌డాగ్‌గా పరిగణించబడింది. హంపి ప్రపంచంలో నంబర్ 5 ర్యాంక్‌లో ఉండగా, దివ్య నంబర్ 18 ర్యాంక్‌లో ఉంది. ఈ 19 ఏళ్ల క్రీడాకారిణి గత సంవత్సరం బాలికల విభాగంలో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌గా నిలిచింది. అంతేకాకుండా, ఆమె 2026లో జరగనున్న క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు కూడా అర్హత సాధించింది.

# ఆపరేషన్ సిందూర్ : పార్లమెంట్‌లో జరిగిన చర్చలో రాజ్‌నాథ్ ఏం చెప్పారు, విపక్షాలు ఏమన్నాయి?



పహల్గాం దాడి, 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటు వర్షకాల సమావేశాలలో జులై 28న చర్చ మొదలైంది. చర్చను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ మనసులోని అపోహలను 'ఆపరేషన్ సిందూర్' తొలగించిందన్నారు. అంతకుముందు బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. విపక్షాల నినాదాల మధ్య సభాకార్యకలాపాలు వాయిదాపడ్డాయి.

**ఎవరు ఏమి అన్నారు అంటే..** ప్రభుత్వం పహల్గాం దాడి, 'ఆపరేషన్ సిందూర్' గురించి చర్చించాలనుకోవడం లేదని, దేశానికి నిజం చెప్పాలనుకోవడం లేదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. అయితే మధ్యాహ్నం లోక్‌సభలో పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మొదలైంది. ప్రభుత్వం తరపున రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించారు.

**ఈ చర్చలోపాల్గొన్న ముఖ్య నేతలు ఏం మాట్లాడారు?**

పాకిస్తాన్‌తో ఎటువంటి ఘర్షణ లేదు. ఇది నాగరికతకు, ఆటవికతకు మధ్య ఘర్షణ. మన సార్వభౌమత్వానికి హాని తలపెట్టాలని చూసేవారికి సరైన సమాధానమిస్తాం. మనం యుద్ధాన్ని కోరుకోం. మనది బుద్ధుడి మార్గం. ఈరోజుకీ పాకిస్తాన్ సుసంపన్నంగా ఉండాలనే కోరుకుంటున్నాం. చర్చలు, ఉగ్రవాదం ఒకే ఒరలో ఇమడలేవు. దీనిపై నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉంది.

పాకిస్తాన్‌తో శాంతి నెలకొల్పడానికి మా ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ 2016 సర్జికల్ స్ట్రైక్స్,

2019లో బాలాకోట్ వైమానిక దాడులు, 2025లో ఆపరేషన్ సిందూర్ తరువాత శాంతి స్థాపనకు మేం మరో మార్గాన్ని ఎంచుకున్నాం.పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాదం అనేది.. పథకం ప్రకారం పన్నిన కుట్రలో భాగం. ఇది పాకిస్తాన్, దాని సంస్థలు అనుసరించే ఓ సాధనం" అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.మేం ప్రభుత్వానికి శత్రువులం కాము. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరులో ఈరోజుకీ మేం ప్రభుత్వంతోనే ఉన్నాం, కానీ నిజమేమిటో బయటకు రావాలి. హోం మంత్రి నైతిక బాధ్యత తీసుకుంటారని, ప్రధానమంత్రి ఈ సంఘటనకు సంబందించి పూర్తి సమాచారం ఇస్తారని ఆశించాం.

మేమంతా ఐక్యంగా ప్రధాని మోదీకి మద్దతు ఇచ్చాం. దేశం మొత్తం మోదీతో ఉంది. కానీ మే 10న కాల్పుల విరమణ జరిగినట్టు వార్తలు వచ్చాయి. అలా ఎందుకు జరిగింది? ముందుగా 21 లక్ష్యాలను ఎంపిక చేసుకుని తరువాత తొమ్మిదింటిని మాత్రమే ఎందుకు ఎంచుకున్నారు?

నిజంగానే పాకిస్తాన్ మోకాళ్లపై కూర్చోవడానికి సిద్ధపడితే మీరేందుకు ఆపేశారు. ఎందుకు తలవంచారు, ఎవరికి లొంగిపోయారు?యుద్ధాన్ని ఆపేశామని అమెరికా అధ్యక్షుడు 26సార్లు చెప్పారు. ఐదారు జెట్లను కూల్చివేశారని ట్రంప్ చెప్పారు. ఎన్ని జెట్లను కూల్చివేశారో చెప్పగలరా?" అని ప్రశ్నించారు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్.

**మోడీజీ కి ట్రంప్ అంటే ఎందుకు అంత భయం**

క్రికెట్‌లో ఓ ఆటగాడు 90 పరుగులపై ఉన్నప్పుడు ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడం గురించి ఎప్పుడైనా విన్నారా? ఒకవేళ అలా ఇన్నింగ్స్ ముగించేయమని ఎవరైనా చెప్పారు అంటే అది మోదీజీ తప్ప మరెవరూ అలాంటి పని చేయలేరు. మోదీజీ దయచేసి క్రికెట్ మ్యాచ్‌లో జోక్యం చేసుకోకండి.

140 కోట్లమంది ప్రజలు యుద్ధం చేయమని చెబుతుంటే.. మీరు యుద్ధం ఆపేశారని అమెరికా అధ్యక్షుడు చెప్పారు.ప్రధానమంత్రి జీ... మీ 'ఎక్స్' ఖాతాలో ఒక్కసారికూడా '' మిస్టర్ ప్రెసిడెంట్ మీరు చెప్పింది తప్పు" ఎందుకు రాయలేదు. అందుకు మీకు ధైర్యం సరిపోలేదా? అమెరికా అధ్యక్షుడికి ఎందుకు అంతగా భయపడుతున్నారు, చరిత్ర మిమ్మల్ని ఎప్పటికీ క్షమించదు. మీరు అన్నిచోట్లా బ్రాండింగ్ చేస్తారు. ఇక్కడ కూడా మీరు 'ఆపరేషన్ సిందూర్' అనే బ్రాండింగ్ చేశారు అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విమర్శించారు.

**మీ మట్టాల్లో దేశ భక్తి ఎక్కడ కనిపించడం లేదు..**

గౌరవ్ గొగోయ్ ప్రసంగం విన్నాను. ఆయన ఒక్క ఉపయోగకరమైన పదం కూడా మాట్లాడలేదు. ఆయన ఒక్కసారి కూడా మన సాయుధ బలగాలను పొగడలేదు.

మీరు దేశభక్తి గురించి మాట్లాడతారు. ఎన్ని విమానాలు పడ్డాయి, ఎన్ని క్షిపణులు పడ్డాయో చర్చిస్తున్నారు. మీ దృష్టిలో ఈ దేశ సైనికులకు ప్రాముఖ్యం లేదా?

మీరు ఓట్ల కోసం రాజకీయాలు చేస్తారు, మోదీ దేశం కోసం రాజకీయాలు చేస్తారు, ఇదీ తేడా. మే 6, 7 తేదీల్లో జరిగిన 'ఆపరేషన్ సిందూర్'ను చూసి పాకిస్తాన్ నివ్వెరపోయింది" అన్నారు జేడీయూ ఎంపీ లలన్ సింగ్.

నేను కొన్ని రోజులు మంత్రిగా ఉన్నాను. ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించడానికి నేను కశ్మీర్ వెళ్లాను. ఆ రోజు, సాయుధ సైనికులు ప్రతిచోటా ఉన్నారు.

కానీ ఆరోజు ఏం జరిగింది? ఆ రోజు పహల్గాంలో సాయుధ సైనికులెవరూ లేరు. మన టూరిస్టులు వచ్చేచోట కనీసం పోలీసులు కూడా లేరా? అక్కడ సైనికులు ఉండకూడదని ఎవరు ఆదేశించారు? అక్కడి నుంచే విచారణ ప్రారంభించాలి.

అక్కడి నుంచి పాకిస్తాన్ ఎంత దూరంలో ఉంది, ఈ ఉగ్రవాదులు నేపాల్ నుంచి అక్కడికి వెళ్లారా?

జైషే -ఎ - మహమ్మద్ పుల్వామాలో చేసిన దాడిలో 40 మంది జవాన్లు అమరులయ్యారు, దీనిపై ఈరోజు దాకా ఎలాంటి దర్యాప్తు జరగలేదు. ఇప్పటి వరకు వారిని పట్టుకోలేదు.

దాన్ని 'సిందూర్' అని పిలుస్తూ ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటున్నారు. ఎవరి సిందూరాన్ని లాక్కుపోయారు, అది మా సోదరీమణుల నుంచి లాక్కున్నారు. సిందూరాన్ని అపహరించిన వారిని ఇప్పటి వరకు మీరు పట్టుకోలేకపోయారు" అన్నారు శివసేన (యుబీటీ) ఎంపీ అరవింద్ సావంత్.

**ప్రపంచానికి బలమైన సందేశం ఇచ్చాం..** పహల్గాం దాడి తర్వాత స్పష్టమైన, బలమైన, సాహసోపేతమైన సందేశాన్ని పంపడం చాలా ముఖ్యం. హద్దులు దాటితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేయాల్సి వచ్చింది.

తొలి అడుగుగా ఏప్రిల్ 23న భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం నిర్వహించాం. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ తన మద్దతును శాశ్వతంగా విరమించుకునే వరకు 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ప్రాథమిక చర్యలు తీసుకున్నప్పటికీ, పహల్గాం దాడిపై భారత్ ప్రతిస్పందన ఇక్కడితో ఆగిపోదని స్పష్టమైంది. దౌత్య, విదేశాంగ విధాన కోణంలో పహల్గాం దాడి గురించి ప్రపంచానికి సరైన సమాచారం అందించడమే మా పని. పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాద చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పే ప్రయత్నం చేశాం. పాకిస్తాన్‌లో ఉగ్రవాద చరిత్రను, జమ్ముకశ్మీర్ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని, భారత ప్రజల్లో మత విద్వేషాలను వ్యాప్తి చేయడానికి ఈ (పహల్గామ్) దాడి ఎలా జరిగిందో వివరించాం" అన్నారు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.

ఈ రోజు నేనీ సభలో కోపం, బాధ, అవమానంతో

నిల్చున్నాను. కాల్పుల విరమణ ఉత్తర్వులు తమ దేశ ప్రధాని నుంచి కాకుండా విదేశీయుడి నుంచి అందుకునేలా సైనికులను అవమానించారు.

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాల బాధ, పహల్గాంలో ఉగ్రవాదులను పట్టుకోలేకపోయిన ప్రభుత్వం, వారి గురించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ పేరు దేశభక్తితో కూడుకున్నదిగా అనిపించినా వాస్తవానికి అది ప్రభుత్వం మీడియాలో చేసిన తమాషా మాత్రమే. ఈ ఆపరేషన్ లో ఏం సాధించారో ఎవరూ చెప్పడం లేదు. ఎంతమంది ఉగ్రవాదులు పట్టుబడ్డారు, మన యుద్ధ విమానాల్లో ఎన్ని కూల్చివేశారు, ఎవరి తప్పు, బాధ్యులెవరు, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఈ ప్రభుత్వం ఏ ప్రశ్నలూ వినడానికి ఇష్టపడటం లేదు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకుల చితి దేశ ప్రధాని బీహార్ లో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించడానికి వెళ్లినప్పుడు కూడా చల్లారలేదు" అన్నారు కాంగ్రెస్ ఎంపీ పరిణీతీ సుశీల్‌కుమార్ శిందే.

# గాజాపై మోదీ మౌనం సిగ్గుచేటు

- **భయంతో నైతిక విలువలను వదిలిపెట్టారు : సోనియా గాంధీ**
- **మానవత్వానికి అవమానం జరిగితే ఊరుకుంటారా?**
- **పాలస్తీనాపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని డిమాండ్**



న్యూఢిల్లీ: గాజాలో జరుగుతున్న నరమేధంపై ప్రధాని మోదీ మౌనంగా ఉండడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ సోనియాగాంధీ మండిపడ్డారు. పిరికితనం, భయంతో ప్రధాని మోదీ రాజ్యాంగ, నైతిక విలువలను వదిలిపెడుతున్నారని అన్నారు. గాజా ప్రజలకు అనుకూలంగా భారత్ స్పష్టమైన, ధైర్యమైన వైఖరిని తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రముఖ హిందీ పత్రిక 'దైనిక్ జాగరణ్' లో సోనియాగాంధీ రాసిన వ్యాసం 'గాజా సంకట్ పర్ మూక్ దర్శక్ మోదీ సర్కార్' అనే శీర్షికతో మంగళ వారం ప్రచురితమైంది. "1974లో ఇందిరా గాంధీ నాయకత్వంలో పాలస్తీనా ప్రజల ఏకైక, చట్టబద్ధ మైన ప్రతినిధిగా పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్వోను)ను గుర్తించిన మొదటి అరబ్బేతర దేశంగా భారతదేశం అవతరించింది. 1988 లోపాలస్తీనాను అధికారి కంగా గుర్తించిన మొదటి దేశాల్లో భారత్ ఒకటి' అని ఆమె పేర్కొన్నారు. 2023 అక్టోబ రు 7న ఇజ్రాయెల్ లోని మహిళలు, పిల్లలపై హమాస్ జరిపిన దాడిని ఖండించి తీరాలని చెప్పారు.

**భారత్ వైపు గ్లోబల్ సౌత్ చూపు** : అమెరికా అండతోనే గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్నదని సోనియాగాంధీ తెలిపారు. యూఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానాలను పూర్తిగా విస్మరించిందని, జాతి విధ్వంస చర్యలను నిరోధించా లని అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాన్ని కూడా ఇజ్రాయెల్ పెడచెవిన పెట్టిందని అన్నారు. కుటుంబ వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ కోసమే కొందరు ఈ దాడులకు పురిగొల్పుతున్నారని అమెరి కాపై పరోక్ష విమర్శలు చేశారు. పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ హతమారుస్తున్న తీరు నిజంగా మానవ త్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ను అంతర్జా తీయ న్యాయస్థానంలో నిలబెట్టేందుకు దక్షిణాఫ్రికా ధైర్యంగా ముందడుడు వేసిందని చెప్పారు. ఈ పరి స్థితుల్లో గాజాలో మానవత్వానికి జరుగుతున్న ఘోర అవమానాన్ని మోదీ సర్కారు మౌనంగా చూస్తూ ఉండడం సరికాదని సోనియాగాంధీ అన్నారు. మోదీ సర్కారు తీరుతో భారత దేశ ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యాయని చెప్పారు. పాలస్తీనా అంశంపై నా యకత్వం కోసం గ్లోబల్ సౌత్ మరోసారి భారత్ వైపు చూస్తున్నదని సోనియాగాంధీ తెలిపారు.

# తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం
- జడ్జీలుగా మొహియుద్దీన్, చలపతిరావు, రామకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్
- న్యాయవాదుల కోటా నుంచి నలుగురికి దక్కిన అవకాశం
- మొత్తంగా 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య.. ఇంకా 12 ఖాళీలు




తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయ మూర్తులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్ కుమార్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నెల 3న వీరి పేర్లను సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫార్సులకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ జారీ చేసింది. దీంతో వీరు అదనపు న్యాయమూర్తులుగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త జడ్జీలుగా నియమితులైన నలుగురు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మతో కలసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం హైకోర్టులో 26 (సీజేతో కలిపి) మంది న్యాయ మూర్తులున్నారు. ఈ నలుగురి ప్రమాణం స్వీకారం తర్వాత ఆ సంఖ్య 30కి చేరనుంది. ఇంకా 12 పోస్టులు ఖాళీగా ఉంటాయి. కాగా, సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలత బదిలీపై ఇక్కడికి రావాల్సి ఉంది. ఈ బదిలీలకు కేంద్రం ఇంకా ఆమోదం తెలుపలేదు. అలాగే తడకమళ్ల వినోద్‌కుమార్ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

**సుద్దాల చలపతిరావు..** చలపతిరావు 1971, జూన్ 25న జనగాంలో జన్మించారు. 1998,మార్చి 26న న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. న్యాయవాది వై. రామారావు వద్ద 1998 నుంచి 2004 వరకు జూనియర్గా పనిచేశారు. 2004 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సిటీ సివిల్ కోర్టులతోపాటు హైకోర్టులో సివిల్, క్రిమినల్ సహా అన్ని విభాగాల కేసులు వాదించారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్గా 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

**వాకిటి రామకృష్ణారెడ్డి..** రామకృష్ణారెడ్డి 1970, సెప్టెంబర్ 14న జన్మించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు స్వగ్రామం. వీరిది వ్యవ సాయ కుటుంబం. తండ్రి సర్పంచ్గా, జెడ్పీటీసీగా సేవలందిం చారు. తల్లి గృహిణి. బీకామ్ ఎల్ఎల్బీ పూర్తిచేసి 1998లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. న్యాయవాది ఎ.అనంతసేన్‌రెడ్డి వద్ద జూనియర్ గా పనిచేశారు. 2005 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టుతో పాటు తెలంగాణ, ఏపీ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, ఫ్యామిలీ, కంపెనీ లా విభాగాల్లో సమర్థుడిగా పేరు పొంద 1 2016-17లో తొలి తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈడీ స్టాండింగ్ కౌన్సిల్ విధులు నిర్వహిస్తున్నారు.

**గౌస్ మీరా మొహియుద్దీన్..** గౌస్ 1969, జూలై 15న జన్మించారు. హైదరాబాద్లోని బాలానగర్కు చెందినవారు. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్ఎంటీ మేనేజర్గా పనిచేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాల నుంచి న్యాయ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. 1993 మార్చి 17న న్యాయ వాదిగా ఎన్రోల్ అయ్యారు. ఉమ్మడి బార్ కౌన్సిల్, తెలంగాణ బార్ కౌన్సిల్కు స్టాండింగ్ కౌన్సిల్గా విధులు నిర్వర్తించారు. సివిల్, రాజ్యాంగంతోపాటు పలు విభాగాల్లో సమర్థ వాదనలు వినిపించారు.

**గాడి ప్రవీణ్ కుమార్...** ప్రవీణ్ కుమార్ 1971, ఆగస్టు 28న జన్మించారు. నిజామాబాద్ జిల్లా భీమ్గల్ స్వస్థలం. కాకతీయ వర్సిటీ నుంచి ఎల్ఎల్బీ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1998, నవంబర్ 12న న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్, లేబర్ కోర్టులో పలు కేసులు వాదించారు. రాజ్యాం గం, సర్వీస్ మ్యాటర్, లేబర్ లా, క్రిమినల్ లా.. వంటి పలు విభాగాల్లో సమర్థుడిగా తెచ్చుకున్నారు. ప్రస్తుతం హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్గా విధులు నిర్వహిస్తున్నారు.

# హత్య కేసులో జడ్జికి పాఠాలు చెప్పిన ప్రొఫెసర్కు జీవిత ఖైదు.. !



ఓ మాజీ రసాయన శాస్త్ర మహిళా ప్రొఫెసర్ కోర్టు రూమ్లో జడ్జికి కెమిస్ట్రీ పాఠం చెబుతున్న వీడియో ఇటీవల ఆన్లైన్లో వైరల్గా మారింది. తాజాగా ఆమెకు జీవిత ఖైదు విధిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును వెలువరించింది. ఆ మాజీ ప్రొఫెసర్ పేరు మమతా పాఠక్. ఆమె భర్త కేసుకు సంబంధించి ఆమే సొంతగా హైకోర్టు కు అప్పీల్ చేసుకొని.. కేసును వాదించు కొన్నారు. మమత పాఠక్ ఒకప్పుడు ఛత్తాపుర్లో కెమిస్ట్రీ ప్రొఫెసర్గా పనిచేశారు. ఆమె భర్త డాక్టర్ నీరజ్ పాఠక్ 2021లో అనుమానాస్పద పరిస్థితుల మధ్య ఇంట్లో మరణించారు. ఈ దంపతులకు సుదీర్ఘకాలంగా విభేదాలు ఉన్నాయి. నీరజ్ మరణం విద్యుదాఘాతం వల్ల జరిగినట్లు నాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, ఫోరెన్సిక్, పోస్టుమార్టం రిపోర్టుల్లో చాలా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో దర్యాప్తు బృందం తర్వాత మమతపై హత్య కేసు నమోదు చేసింది. ఈ కేసులో రిపోర్టుల ఆధారంగా ఆమెను దిగువ కోర్టు 2022లో దోషిగా తేల్చింది. కానీ, నీరజ్–మమత దంపతుల సంతానం మానసిక వైకల్యంతో బాధ పడుతుండటతో.. కోర్టు ఆమెకు బెయిల్ మంజూరుచేసింది. ఆ తర్వాత ఆమె మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్పూర్ బెంచ్కు అప్పీల్ చేసింది. సొంతంగానే వాదనలు వినిపించాలని నిర్ణయించింది.

**వైరల్ గా సొంత వాదనలు..** ఈక్రమంలో జస్టిస్ వివేక్ అగర్వాల్కు ఆమె వాదనలు వినిపించిన వీడియో వైరల్ గా మారింది. ఈ క్రమంలో రసాయన శాస్త్రంలో తనకున్న పరిజ్ఞానాన్ని వాడి వేడి వల్ల అయ్యే గాయాలు, విద్యుదాఘాతంతో అయ్యే గాయాలను వర్గీకరించి వివరించింది. పోస్ట్ మార్ట్ చేసిన డాక్టర్ పొరబడి ఉంటారని పేర్కొంది. ఈ వాదన విన్న న్యాయమూర్తి ఒకింత ఆశ్చర్యంతో మీరు రసాయన శాస్త్ర ప్రొఫెసరా అని అడిగారు. దానికి ఆమె అవుననే సమాధానం ఇచ్చింది. ఈ వీడియో ఆన్లైన్లో వైరల్గా మారింది. సోషల్మీడియాలో ఆమెకు మద్దతు కూడా లభించింది. ఈ కేసును తీవ్రంగా తీసుకొన్న కోర్టు కీలక అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా అమికస్ క్యూరిగా సురేంద్ర సింగ్ను నియమించింది. తాజాగా దీని విచారణ ముగిసింది. వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును సమర్థించింది. పరిస్థితులు మొత్తం ఆమెను దోషిగా సూచిస్తున్నట్లు విశ్వసించింది. ఆమెను దోషిగా నిర్ధరించి జీవిత ఖైదును విధించింది. ఈమేరకు 97 పేజీల తీర్పును వెలువరించింది.

# ఇక్కడ నుంచి సునామీ వస్తే జల ప్రళయమేనా : 1952 తర్వాత మళ్లీ రష్యా కమ్చట్కా ద్వీపంలో..



పసిఫిక్ మహా సముద్రం.. రష్యా దేశం పరిధిలో ఉన్న కమ్చట్కా ద్వీపం.. ఇది ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తుంది. ఈ కమ్చట్కా ద్వీపంలో వచ్చే భూకంపాలు కచ్చితంగా సునామీని సృష్టిస్తుంది.. అంతే కాదు.. రాబోయే రోజుల్లో పెద్ద పెద్ద జల ప్రళయాలకు ఈ కమ్చట్కా ద్వీపం కారణం అవుతుందని జపాన్ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఎందుకు.. ఏంటీ.. ఎలా అనేది కూడా వివరిస్తున్నారు అధికారులు.

కమ్చట్కా ద్వీపం ఏరియాలోని సముద్రం అడుగున పెద్ద పెద్ద పర్వతాలు ఉన్నాయి. వీటిని ఎంపరర్ సీమౌంట్ చైన్ అని పిలుస్తారు. ఇవి సముద్ర గర్భంలో పర్వతాలు మాదిరిగా విస్తరించి ఉన్నాయి. 2 వేల కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఎంపరర్ సీమౌంట్ చైన్ పర్వతాల శ్రేణి అనేది.. భూమట్టానికి 6 వేల మీటర్ల లోతు వరకు ఉన్నాయి. సముద్రంలో కనిపించేది మాత్రం 2 వేల మీటర్లే అయినా.. సుమారు 4 వేల మీటర్లు అనేది సముద్రం లోతుల్లో ఉంది. ఎంపరర్ సీమౌంట్ చైన్ అని పిలవబడే ఇవి.. కమ్చట్కా ద్వీపానికి ఉత్తరం నుంచి దక్షిణ భాగానికి విస్తరించి ఉన్నాయి.సముద్రం లోపల ఉన్న ఈ పర్వతాలు ఉన్న ప్రాంతం అనేది భౌగోళికంగా ఎంతో ప్రమాదకరంగా ఉంటుందని.. భూకంపాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని జపాన్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తరచూ ఇక్క భూకంపాలు వస్తున్నా.. 8.8 తీవ్రతతో భూకంపం రావటం అనేది 1952 తర్వాతఇదే అంటున్నారు అధికారులు. ఇక్కడ భూకంపం ఏర్పడితే అది కచ్చితంగా సునామీకి దారి తీస్తుందని.. 1952లో కూడా తీర ప్రాంతాన్ని రాకాసి అలలు ముంచెత్తాయని స్పష్టం చేస్తున్నారు అక్కడి అధికారులు. 2025 జూలై 30వ తేదీ వచ్చిన భూకంపం కూడా అక్కడి నుంచే వచ్చిందని.. ఈసారి 8.8 తీవ్రతతో భారీగా ఉందన్నారు. సునామీ అలలు ఒక రోజు కంటే ఎక్కువే వస్తాయని.. కొన్ని ప్రాంతాల్లో తీరం దాటడానికి 9 నుంచి 10 గంటల సమయం కూడా పడుతుందని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే సునామీ హెచ్చరికలను 24 గంటలు కంటే ఎక్కువ సమయం కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు జపాన్ వాతావరణ శాఖ అధికారులు.జపాన్ దేశానికి చాలా దూరంలో.. ఎక్కడో భూకంపం వస్తే మనకు సునామీ వస్తుందా.. సునామీ తీవ్రత తక్కువగా ఉంటుంది అనే ఆలోచన కూడా చేయొద్దని జపాన్ ప్రజలను హెచ్చరిస్తున్నారు వాతావరణ శాఖ అధికారులు. కమ్చట్కా ద్వీపంలోని భూకంపంతో వస్తున్న సునామీలు చాలా ఉంటాయి.. ఒకేసారి రాదని.. మొదటగా తీరాన్ని తాకే సునామీ అలల తీవ్రత తక్కువగా ఉంటుందని.. ఆ తర్వాత వచ్చే అలల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. భూకంపం వచ్చిన తర్వాత.. ఆయా తీరాలను తాకే సమయం.. ఆయా ప్రాంతాలకు ఉన్న దూరంతో ముడిపడి ఉందని.. కొన్ని తీర ప్రాంతాలను సునామీ అలలు తాకే సమయం 9 నుంచి 10 గంటల సమయం ఉంటుందని.. ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని జపాన్ వాతావరణ శాఖ హెచ్చరించింది.కమ్చట్కా ద్వీపంలో ఏర్పడే సునామీలు చాలా ప్రమాదకరం అని.. సముద్రంలోని పర్వతాలు వల్ల రాబోయే కాలంలోనూ భారీ భూకంపాలతోపాటు పెద్ద పెద్ద సునామీలు వచ్చే అవకాశం కూడా ఉందని.. జల ప్రళయాలకు అవకాశం ఉందని జపాన్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. 1952లోనూ ఇలాంటిదే వచ్చిందని.. మళ్లీ ఇప్పుడు ఆ స్థాయిలో వచ్చిందని చెబుతున్నారు. ఈ సునామీ అమెరికా, జపాన్, రష్యా దేశాలతోపాటు చిలీ, సోలోమాన్ ఐస్ ల్యాండ్స్ ప్రాంతాలకు ముప్పు ఉంటుందని హెచ్చరిస్తున్నారు. రాబోయే కాలంలో జల ప్రళయానికి కమ్చట్కా ద్వీపం అనేది కారణం కావొచ్చు కూడానూ..

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. రాష్ట్రంలో మరో డిస్కం ఏర్పాటు !



ఇంధనశాఖపై సమీక్షలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విద్యుత్ శాఖ ప్రక్షాళన కోసం సంస్కరణలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్‌తో పాటు కొత్తగా మరో డిస్కమ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంధన శాఖపై ముఖ్యమంత్రి గారు జూబ్లీహిల్స్ నివాసంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క , ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. NPDCL, SPDCL లతో పాటు కొత్తగా మరో డిస్కమ్‌ను ఏర్పాటు చేసి దాని పరిధిలోకి వ్యవసాయ రంగంతో పాటు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, స్కూళ్ళు, కాలేజీలకు ఉచిత విద్యుత్ పథకాలన్నీ తీసుకురావాలని సూచించారు. దీనికి రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా కొత్త డిస్కమ్ పరిధి ఉండాలని చెప్పారు. కొత్త డిస్కమ్ ఏర్పాటు వల్ల ఇపుడున్న డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని, జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుందని ముఖ్యమంత్రి గారు అన్నారు. డిస్కమ్‌ల ఆర్థిక స్థితి గతులను మెరుగుపరిచేందుకు సంస్కరణలు తప్పనిసరని చెప్పారు. డిస్కమ్‌ల పునరవ్యవస్తీకరణతో పాటు విద్యుత్ సంస్థలపై ఇప్పుడు ఉన్న రుణ భారం తగ్గించాలని అధికారులకు సూచించారు. రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలని అదేశించారు. 10 శాతం వరకు వడ్డీపై తీసుకున్న రుణాలతో డిస్కమ్‌లు డీలా పడ్డాయని, వాటిని తక్కువ వడ్డీ ఉండేలా రీస్ట్రక్చర్ చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా కలెక్టర్లు అనువైన భవనాలను యుద్ధప్రాతిపదికన గుర్తించాలని చెప్పారు. ఆర్ అండ్ బీ శాఖతో సమన్వయం చేసుకుని రాష్ట్ర సచివాలయానికి సౌర విద్యుత్ అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఎండాకాలంలో సచివాలయంలో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారిన నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌నకు అనువుగా సోలార్ రూఫ్‌టాప్ షెడ్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇందిర సోలార్ గిరి జల వికాసం పథకం రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ తండాలు, ఏజెన్సీ ఏరియాల్లో అమలు చేయాలని నిర్దేశించారు. వచ్చే మూడేళ్లలో 2 లక్షల 10 వేల మంది ఎస్టీ రైతులకు ఈ పథకం వర్తింపజేయాలని, 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ పంపుసెట్లను అందించి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోదీ

## ప్రధానిగా 4,078 రోజుల పాటు పదవిలో



న్యూఢిల్లీ, : ప్రధాని నరేంద్ర మోదీ మరో ఘనతను సాధించారు. అత్యధిక కాలంపాటు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. ఇందిరాగాంధీ 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు ఏకధాటిగా 4,077 రోజుల పాటు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం మోదీ నాటికి 4,088 రోజుల పదవీ కాలాన్ని పూర్తి చేశారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఓటమిని ఎరగకుండా అత్యధిక కాలం పాటు పదవిలో కొనసాగారు. వరుసగా మూడుసార్లు కాంగ్రెసకు విజయం సాధించిపెట్టారు. 1947 ఆగస్టు 15 నుంచి 1964 మే 27 వరకు మొత్తం 6,130 రోజులు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఆ తర్వాతి స్థానంలో మోదీ ఉన్నారు. పదవిలో కొనసాగుతూ వరుసగా బీజేపీని గెలిపిస్తున్న రాజకీయ నాయకునిగా ఇప్పటికే మోదీ ఘనత సాధించారు. ఆయన 2002, 2007, 2012ల్లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి ప్ర?ధాని పదవిని చేపట్టారు. ఇంతవరకు ఏ ఎన్నికల్లోనూ ఆయన ఓడిపోలేదు. వరుసగా ఆరు ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా, పీఎంగా కొనసాగిన ఏకైక నాయకుడు మోదీయే కావడం విశేషం. ప్రధానిగా రెండు టర్ములు పూర్తి చేసుకున్న కాంగ్రెసేతర నేత కూడా ఆయనే కావడం మరో విశేషం.

# ఉగ్రవాదులు దొరికినా..

- **పార్లమెంట్ సమావేశాలప్పుడే ఎన్కౌంటర్ ఎలా?**
- **అబద్ధాలు చెప్పడంలో మోడీ, కేసీఆర్ దిట్ట : సీపీఐ నారాయణ**




పార్లమెంట్ ప్రారంభం సమావేశాలు అవుతున్నప్పుడే పహెల్గాం టెర్రరిస్టులు హతమయ్యా రని వార్తలు వచ్చాయి. ముందే ఉగ్ర వాదులు దొరికినా ఇప్పటి వరకు కావాలనే దాచిపెట్టారా అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారా యణ ప్రశ్నించారు. అబద్దాలు చెప్పడంలో ప్రధాని నరేంద్ర మోడీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిట్ట అని ఆయన విమర్శించారు. జులై 30న ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. అబద్దాలు చెప్పేవారిలో గోబె ల్స్ మొదటి వారని, అయితే ఆయనను మనం ఎవ్వరం చూడలేదు కానీ మోడీ, కేసీఆర్ ను చూస్తున్నామ న్నారు. ప్రతిపక్షాల సహకారం తీసుకుని టెర్రరిజాన్ని అంతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రతి ఘటనను రాజకీయ లబ్ధికోసం వాడుకుంటోందని బరితె గించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోం దని అమర్ నాథ్ యాత్రకు 7.50 లక్షల మంది భద్రతా బలగాలు ఉన్నాయని బలగాలు ఉండగానే ఉగ్రదాడులు ఎలా జరిగాయని నిల దీశారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చనిపోయిన వారికి కోటి రూపాయలు పరిహారం ఇస్తే పహెల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన వారికి లక్ష మాత్రమే పరిహారం ఇస్తున్నారని మండిపడ్డారు. పహెల్గాం ఉగ్రదాడిని బీజేపీ రాజకీ యాలకు వాడుకుంటోందని ఇది శవాల మీద పేలాలు ఏరుకోవడమే నని నారాయణ మండిపడ్డారు.

# మంచంపై మృతదేహంతో మూడు కిలోమీటర్లు.. హృదయ విదారక ఘటన.. ఎక్కడంటే !



భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పినపాక ఏజెన్సీలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కరకగూడెం మండలానికి చెందిన ఒక మహిళ అనా రోగ్య సమస్యలతో భద్రాచం లోని ప్రభుత్వ హాస్పిటల్‌లో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో కుటుంబ సభ్యులు జట్టి కట్టి మృతదేహాన్ని మూడు కిలోమీటర్లు మోసుకెళ్లారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆదివాసీలు బతుకులు మాత్రం మారడం లేదు.. అభివృద్ధికి ఆమడ దూరములో కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. హాస్పిటల్స్, రోడ్డు సైకర్యాలు లేక వాళ్లు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు అనారోగ్యం బారిన పడి సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఏజెన్సీలో చోటు చేసుకుంది. కరకగూడెం మండలం అశ్వాపురంపాడు అనే వలస గిరిజన గ్రామానికి చెందిన నందమ్మ అనే మహిళ రెండు రోజుల క్రితం అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఈ క్రమంలోనే ఆమె చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి లో మృతి చెందింది. అయితే ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకువెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వాళ్ల గ్రామానికి రహదారి లేకపోవడంతో ప్రధాన రహదారి నుండి జెట్టి కట్టి మృతదేహాన్ని చిమ్మ చీకట్లో మూడు కిలోమీటర్లు మోసుకెళ్లారు గ్రామస్తులు. దీంతో మృతదేహం కరకగూడెం చేరుకునే సరికి రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

ఇక వాళ్ల మరుసటి రోజు అంత్యక్రియలు నిర్వహించారు. పాలకులు మారుతున్న ప్రభుత్వాలు మారుతున్న ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల కష్టాలు మాత్రం తీరడం లేదు. వలస గిరిజనులు వచ్చి ఏళ్ళు గడుస్తున్న నేటికీ వారు నివసిస్తున్న గ్రామాలకు రహదారులు లేకపోవడం చూస్తుంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అని చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వాలు, అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ గ్రామాలకు రహదారి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వలస గిరిజనులు వేడుకుంటున్నారు.

# ఏటా 60 వేల ఉదర క్యాన్సర్ కేసులు

## యశోద ఆస్పత్రుల ఎండీ డాక్టర్ జీఎస్ రావు.. హైటెక్ సిటీలో 'జీఐ-ఫోకస్' వర్క్‌షాప్ షురూ

హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా ఉదర క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, మన దేశంలో ఏటా 60 వేల కొత్త కేసులు వస్తున్నాయని యశోద ఆస్పత్రుల ఎండీ డాక్టర్ జీఎస్ రావు తెలిపారు. హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో 'జీఐ-ఫోకస్' పేరుతో రెండు రోజుల నేషనల్ కాన్ఫ రెన్స్ లైవ్ వర్క్‌షాపను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా జీఎస్ రావు మాట్లాడారు.

సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, రొబోటిక్ సర్జన్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ.. ఈ సదస్సులో అధునాతన జీర్ణ, ఉదరకోశ శస్త్ర చికిత్సలపై నిపుణుల నేతృత్వంలో నిర్వహించే లైవ్ సెషన్లు యువ సర్జన్లకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

# ఛలో ఢిల్లీ.. ఎవరి పోరాటం వారిదే..
# బీసీ మంత్రాన్ని జపిస్తున్న ప్రధాన పార్టీలు..




బీసీ.. బీసీ.. బీసీ.. తెలంగాణలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పుడు ఇదే మంత్రాన్ని జపిస్తున్నాయి...! ఒకవర్గం కోసం అన్ని వర్గాలు పోరుబాటకు సిద్ధమయ్యాయి...! స్థానిక సంస్థల ఎన్నికలు.. చావో రేవోలా మారడంతో మూడు పార్టీలు బీసీ రిజర్వేషన్ల అంశాన్నే బ్రహ్మాస్త్రంగా భావిస్తున్నాయి...! ఎవరికి వారు గల్లీలోనే కాదు ఢిల్లీలోనూ కొట్లాడేందుకు సిద్ధవుతున్నారు.బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎవ్వరూ తగ్గేదేలే అన్నట్లున్నారు..! బిల్లు ఆమోదం కోసం ఎందాకైనా వెళ్తామంటోంది తెలంగాణ ప్రభుత్వం. రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆగస్ట్ 5 నుంచి 7 వరకు ఢిల్లీ వేదికగా రేవంత్ బృందం కార్యాచరణ అమలు చేయనుంది. సామ-దాన-భేద దండోపాయం ద్వారా బీసీ రిజర్వేషన్లను సాధిస్తామంటున్నారు ప్రభుత్వ పెద్దలు.మీరేంటి బీసీల కోసం పోరాడేది.. అసలు పోరాటమంటే ఏంటో చూపిస్తామంటోంది బీఆర్ఎస్. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రపతిని కలుస్తామంటున్నారు కారుపార్టీ నేతలు. ఢిల్లీ రావాలని కేసీఆర్‌ను నేతలు కోరగా.. సరే వెళ్లి కలుద్దామని చెప్పినట్లు తెలుస్తోంది. ఆతర్వాత కూడా ఫలితం లేకపోతే.. మున్ముందు ఇంకాస్త దూకుడుగాముందుకెళ్తామంటున్నారు నేతలు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలాడుతోందని.. దమ్ముంటే కార్పొరేషన్ చైర్మన్లు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.ఇటు బీజేపీ నేతలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. అది %బ్రో% బిల్లు కాదు.. ముస్లిం రిజర్వేషన్ బిల్లు అంటున్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్లింలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్లను తొలగిస్తేనే బిల్లుకు మద్దతిస్తామంటున్నారు.ఎమ్మెల్సీ కవిత సైతం బీసీ బిల్లు సాధన కోసం పోరుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న ఆర్డినెన్స్ అంశంపై ప్రభుత్వం సుప్రీంకోర్టు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు కవిత.మొత్తంగా ఓవర్ టు ఢిల్లీ అంటున్నాయి తెలంగాణలోని పొలిటికల్ పార్టీలు. మరి పార్టీల ఒత్తిడితో కేంద్రం దిగొస్తుందా..? బిల్లుకు ఆమోదం తెలుపుతుందా..? అన్నది చూడాలి.

# హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ వెళ్లే వారికి గుడ్ న్యూస్.. ప్రజల ఇబ్బందులకు చెక్ పెడుతూ..



యూఎస్ కాన్సులెట్ వెళ్లేవారికి ఇకపై తిప్పలు తప్పనున్నాయి. యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం వద్ద తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియాను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. రోజుకు సగటున 3,000 మందికి పైగా యూఎస్ కాన్సులేట్‌ను సందర్శిస్తారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దీనిని నిర్మించారు. తెలంగాణ ప్రభుత్వం పౌరులకు ఉపయోగపడే మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

అమెరికా యూఎస్ కాన్సులేట్‌ను సందర్శించేందుకు ప్రతిరోజూ వచ్చే వేలాది మంది.. అక్కడ వెయిట్ చేసే సమయంలో ఇబ్బందులు పడు తుంటారు. ఇకపై ఆ అవస్థలు ఉండవు. ఎందుకంటే.. రూ. 1.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 'తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా'ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ – నానక్‌రామ్‌గూడాలో యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఉంది. రోజుకు సగటున 3,000 మందికి పైగా యూఎస్ కాన్సులేట్‌కు వస్తుంటారు. అక్కడ టైమ్ స్లాట్ కోసం వెయిట్ చేసేవారు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని.. టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఆధునిక వసతులతో ఈ విభాగాన్ని నిర్మించారు. "మా ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల కోసమే. పారిశ్రామిక అభివృద్ధితో పాటు, ప్రజల రోజు వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చే చర్యలు కూడా తీసుకుంటున్నాం" అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

తెలంగాణ – అమెరికా సంబంధాలు : బలపడుతున్నాయని.. మన రాష్ట్ర ఐటీ ఎగుమతుల్లో 38 శాతం అమెరికాకే వెళ్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ ఏడాది జనవరిలో అమెరికన్ కంపెనీలు రూ. 31,500 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. దీని వల్ల 30,000 ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ కొత్త వెయిటింగ్ ఏరియా ద్వారా వ్యాపార సంబంధాలకే గాక, అంతర్జాతీయ ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని చెప్పారు.

# రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు రద్దు !




ప్రభుత్వం అర్హులకే ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో పక్కగా చర్యలు తీసుకుంటున్నా.. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో అనర్హులకూ ఈ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. వారు అప్‌లోడ్ చేసిన ఫొటోల ఆధారంగా, ముందుగానే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసిన వారికి కూడా అప్రూవల్స్ లభించాయి. ఈ విషయంపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ సీరియస్‌గా తీసుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అందరికీ తెలిసిందే..! తొలి విడతలో ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వచ్చే ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, ఒకేసారి భారీ స్థాయిలో గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధతలో ఉన్నారు.అయితే తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఒక కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 1,950 మంది అనర్హులు ఈ పథకం ద్వారా ఇళ్లు పొందినట్లు గుర్తించారు. దీంతో అధికారుల నిర్ణయంపై చర్యలు తీసుకుంటూ, వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు.

ప్రభుత్వం అర్హులకే ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో పక్కగా చర్యలు తీసుకుంటున్నా.. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో అనర్హులకూ ఈ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. వారు అప్‌లోడ్ చేసిన ఫొటోల ఆధారంగా, ముందుగానే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసిన వారికి కూడా అప్రూవల్స్ లభించాయి. ఈ విషయంపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ సీరియస్‌గా తీసుకున్నారు. బేస్‌మెంట్ పూర్తయిన తరువాత తొలి విడతలో రూ. లక్ష చెల్లించే సమయంలో ఈ అనర్హులను గుర్తించినట్లు ఎండీ గౌతమ్ తెలిపారు. వెంటనే వీరికి మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసి, వారి స్థానంలో కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని ఆయన చెప్పారు. అంతేకాక, దీనికి బాధ్యులైన పంచాయతీ సెక్రటరీలను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.మొదటి విడతలో సొంత భూమి ఉండి, ఇల్లు లేని వారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నామని గౌతమ్ స్పష్టం చేశారు. కానీ తనిఖీల్లో బయటపడిన 1,950 మంది గతంలోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి బేస్‌మెంట్ వరకూ నిర్మించారని పేర్కొన్నారు. అధికారుల తనిఖీల ప్రకారం, పథకం కింద దశల వారీగా అనేక స్థాయిల్లో పరిశీలన, అనంతరం కలెక్టర్ ఆమోదం ద్వారా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. అయినప్పటికీ కొన్ని చోట్ల గల అలసత్వం వల్ల అనర్హులకు కూడా ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ అంశంపై అధికారులు తగిన చర్యలు తీసుకుంటూ, పథకం నిజమైన అర్హుల చేతికి చేరేలా చర్యలు ముమ్మరం చేశారు.

# ప్రపంచ వ్యాప్త మార్పులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలి

హైదరాబాద్, : ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మార్పులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీహెచ్ఆర్‌డీ) అధికా రులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఎంసీహెచ్ఆర్‌డీ పాలక వర్గ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం శనివారం చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఎంసీహెచ్ఆర్‌డీలో జరిగింది.

ఈ సబ్‌కమిటీలో సభ్యులైన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంసీహెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శాంతికుమారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఎంసీహెచ్ఆర్‌డీని దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా నిలపాలని, దీనికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లకు జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా ఉన్నత స్థానానికి ఎదిగేందుకు సహకరించాలని మంత్రులు చెప్పారు.

# ఓ ఫ్లాట్‌లో అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు.. తరచూ సీక్రెట్‌గా మంతనాలు.. పోలీసుల ఎంట్రీతో.!



డెఫ్ తయారీలో రాజస్థానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా చత్తీస్‌ఘడ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. వెలిమినేడులోని తన దాబా పక్కన ఉన్న టేకుల అంజిరెడ్డికి చెందిన ప్లాట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా డెఫ్ తయారీ కేంద్రాన్ని నాగదేవ్ శంకర్ యాదవ్ నిర్వహిస్తున్నారు.పక్కా సమాచారంతో దాడి చేసిన పోలీసులు.. శంకర్ యాదవ్ చీకటి వ్యాపారాన్నిబయటపెట్టారు. కల్తీగాళ్ళు యూరియాతో కల్తీ పాలను తయారు చేయడం చూశాం.. విన్నాం. ఈ కేటుగాళ్లు మాత్రం యూరియాతో కల్తీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ డెఫ్‌ను తయారు చేయడం తెలుసా..? సబ్సిడీ యూరియాను పక్కదారి పట్టించి డెఫ్ తయారు చేస్తున్న ముఠా నల్లగొండ జిల్లా పోలీసులు పట్టుకున్నారు.బీహార్ కు చెందిన నాగదేవ్ శంకర్ యాదవ్ ఉపాధి కోసం పదేళ్ల క్రితం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి వలస వచ్చాడు. జాతీయ రహదారి పక్కన దాబా హోటల్‌ను నిర్వహిస్తున్నాడు. దాబా ఆదాయం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈజీ మనీ కోసం పథకం వేశాడు. బీఎస్-6 వాహనాల్లో డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ డెఫ్ ను వినియోగిస్తారు. ఇండస్ట్రియల్ యూరియాతో ఈ డెఫ్ ను తయారు చేస్తారు. దీన్నే ఆసరాగా చేసుకుని చాటు బేరానికి తెర లేపాడు.డెఫ్ తయారీలో రాజస్థానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా చత్తీస్‌ఘడ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. వెలిమినేడులోని తన దాబా పక్కన ఉన్న టేకుల అంజిరెడ్డికి చెందిన ప్లాట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా డెఫ్ తయారీ కేంద్రాన్ని నాగదేవ్ శంకర్ యాదవ్ నిర్వహిస్తున్నారు. డెఫ్ తయారీకి ఇండస్ట్రియల్ యూరియా బస్తాకు రూ.1,500 ధరకు కొనుగోలు చేసి వినియోగించాడు. దీంతో ఉత్పత్తి వ్యయం ఎక్కువ అవుతోంది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకునేందుకు నాగదేవ్ శంకర్ యాదవ్ మరో పథకం వేశాడు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా బస్తా రూ 300లకు అందిస్తున్న యూరియాను అడ్డదారిలో కొనుగోలు చేయాలని భావించాడు. ఇందుకోసం వెలిమినేడు గ్రామానికి చెందిన శంకరయ్యతో కలిసి ప్రాథమిక సహకార సంఘంలో పనిచేస్తున్న దుర్గయ్యకు సబ్సిడీ యూరియా ఇస్తే బస్తాకు రూ. 30 రూపాయల కమిషన్ ఇస్తామని ఆశ చూపారు. వెలిమినేడు ప్రాథమిక సహకార సంఘం నుండి అక్రమంగా యూరియాను తీసుకువచ్చి డెఫ్ వినియోగిస్తున్నారు. వెలిమినేడుతో పాటుగా చిట్యాల, గుండ్రాంపల్లి, చౌటుప్పల్ పీఏసీఎస్ నుంచి కూడా తక్కువ ధరకు తీసుకువచ్చి డెఫ్ తయారు చేసి ఈ ముఠా సొమ్ము చేసుకుంటుంది.రైతులకు యూరియా అందుబాటులో లేకుండా కృత్రిమ కొరత సృష్టిస్తూ అక్రమాలకు పాల్పడిన ఈ ముఠాపై వ్యవసాయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు తయారీ కేంద్రంపై దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 130 బస్తాల రాయితీ యూరియా, వాహనం, ఆటో, డెఫ్ ఉత్పత్తి చేసే యంత్ర పరికరాలు, వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన 16 ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన నాగదేవ్ శంకర్ యాదవ్, వెలిమినేడుకు చెందిన గోలి శంకరయ్య, మేడగోని దుర్గయ్యలతో పాటు వారికి సహకరించిన వినోద్ కుమార్, రాజీవ్ రాయ్, రోషన్ కుమార్ లను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శివరామ్‌రెడ్డి తెలిపారు.

# మిస్సెస్ ఇండియాగా విజయలక్ష్మి.. తెలంగాణ నుంచి పోటీలో నిలిచి కిరీటం దక్కించుకున్న ఏపీ మహిళ !




అన్నమయ్య జిల్లాకు చెందిన మహిళ మిస్సెస్ ఇండియాగా నిలిచింది. సంబేపల్లి మండలం మినుమరెడ్డిగారి పల్లికి చెందిన కవ్వం విజయలక్ష్మి వ్యవసాయ కుటుంబం నుంచి మిస్సెస్ ఇండియా అయ్యింది. ఢిల్లీలో వీఆర్పీ ప్రొడక్షన్స్ నిర్వహించిన సీజన్ 5 పోటీల్లో విజయలక్ష్మి మిస్సెస్ ఇండియా కిరీటాన్ని దక్కించుకుంది. అన్నమయ్య జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. సంబేపల్లి మండలం మినుమరెడ్డి గారి పల్లికి చెందిన కవ్వం విజయలక్ష్మి మిస్సెస్ ఇండియాగా ప్రతిభ కనబరిచింది. 50 ఏళ్ల విజయలక్ష్మి చిత్తూరు జిల్లాలో హెచ్పీసీఎల్ డీలర్‌గా ఉంటుంది. హైదరాబాద్ SBI లో చీఫ్ మేనేజర్‌గా ఆడిటింగ్ వింగ్‌లో పనిచేస్తున్న భర్త మహేష్ చక్రవర్తి ప్రోత్సాహంతో మిస్సెస్ ఇండియా పోటీల్లో పాల్గొనింది. 25 ఏళ్ల నుంచి 65 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళలకు నిర్వహించిన మిస్సెస్ ఇండియా కాంటెస్ట్ రెండు నెలలపాటు జరిగింది. తెలంగాణ నుంచి పోటీలో నిలిచిన విజయలక్ష్మి ఆన్లైన్‌లో జరిగిన రౌండ్స్‌లో గ్రాండ్ ఫినాలే కి ఎంపికైంది. 18 మంది గ్రాండ్ ఫినాలేలో పోటీ పడగా నాలుగు రౌండ్లలో ప్రతిభను కనబరిచి మిస్సెస్ ఇండియాగా విజయలక్ష్మి కిరీటాన్ని దక్కించుకుంది.

టాలెంట్ రౌండ్ రాంప్ వాక్ లాంటి పోటీల్లో మొదటి వయసులో నిలిచిన విజయలక్ష్మి ఈనెల 26, 27 తేదీల్లో ఢిల్లీ ఫామ్ రిసార్ట్స్‌లో జరిగిన ఫైనల్స్ లో టాప్ 1గా నిలిచి క్రోన్ దక్కించుకుంది. వీఆర్పీ ప్రొడక్షన్స్ ఢిల్లీలో నిర్వహించిన గ్రాండ్ ఫైనాలే పోటిల్లో విజేతగా 50 ఏళ్ల విజయలక్ష్మి నిలిచింది.

# నవంబరులో వెయ్యి అంగన్‌వాడీల నిర్మాణం

## శిథిలావస్థకు చేరిన భవనాలపై దృష్టి: మంత్రి సీతక్క

హైదరాబాద్, : ఇందిరాగాంధీ జయంతి (నవంబరు 19) నాటికి రాష్ట్రంలో వెయ్యి అంగన్‌వాడీల భవనాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. అదనపు నిధులు అవసరమైతే.. మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సచివాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల పని తీరుపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కాగా, టీజీపీఎస్సీ ద్వారా సీడీపీవోలుగా ఎంపికైన 23 మందికి సచివాలయంలో మంత్రి సీతక్క నియామక పత్రాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. కాగా, వానాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీతక్క సూచించారు. జిల్లాల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ పైప్‌లైన్లను నిత్యం పరిశీలించాలని, పైపుల లీకేజీలను నివారించాలని సూచించారు.

# టీచర్లకు గుడ్ న్యూస్.. ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం.. 10రోజుల్లోనే ప్రక్రియ పూర్తి..




టీచర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రమోషన్లకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 10 రోజుల్లో టీచర్ల ప్రమోషన్స్ పూర్తి కానున్నాయి. దాదాపు 3900 మందికి ప్రమోషన్లు లభించనున్నాయి. 900 వరకు ప్రధానోపా ధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా.. 900 మంది స్కూల్ ? అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్ మాస్టర్లుగా? ప్రమోషన్ లభించనుంది.టీచర్లకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. టీచర్ల ప్రమోషన్లకు సంబంధించిన షెడ్యుల్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. ఆగస్టు 2 నుంచి ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆగస్టు 11 వరకు దీనిని పూర్తి చేయాలని నిర్ణయించింది. మొత్తం 10 రోజుల్లో టీచర్ల ప్రమోషన్స్ పూర్తి కానున్నాయి. జూన్ 30 వరకు ఖాళీ అయిన స్థానాలతో భర్తీ చేయనున్నారు. దీనికి ముందే ట్రాన్స్‌ఫర్స్ చేపట్టాల్సి ఉండగా.. స్కూల్స్ ప్రారంభమవడంతో ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వాయిదా వేసింది. అయితే ప్రమోషన్లు మాత్రం కల్పించాలని నిర్ణయించింది.కాగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,900 మందికి పదోన్నతులు లభించనున్నాయి. 900 వరకు ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయి. దీంతో 900 మంది స్కూల్? అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్ మాస్టర్లుగా? ప్రమోషన్ లభించనుంది. దీంట్లో మల్టీజోన్-1లో 492, మల్టిజోన్-2లో411 పోస్టులు ఉన్నాయి. అంతేకాకుండా ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ పోస్టులు 641వరకు ఖాళీ ఉన్నాయి. వాటిని ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయనున్నారు. ప్రమోషన్ల వల్ల ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేస్తారు.

అటు పీఈటీ, లాంగ్వేజ్ పండితులకు సైతం ప్రమోషన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.ప్రస్తుతం విద్యాశాఖ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరే ఉంది. విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే తన లక్ష్యమని రేవంత్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. ఇతరులకు ఇస్తే శాఖను పట్టించుకుంటారో లేదో అనే సందేహంతో తన వద్దే ఉంచుకున్నట్లు చెప్పారు. అటు పలు పాఠశాలల్లో రెగ్యులర్ హెచ్ఎం లేకపోవడంతో పలు సమస్యలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులోకి బర్లను తోలి నిరసన





భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లోకి  దంపతులు బర్లను తోలి నిరసన తెలిపారు. పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. భూపాలపల్లి టౌన్ మంజూరు నగర్ కి చెందిన కూరాకుల ఓదెలు, లలిత దంపతులు పశుపోషణ చేస్తూ జీవిస్తున్నారు. స్థానికంగా ఉన్న వారి  స్థలంలో ఇల్లు కట్టుకొని, బర్ల కోసం షెడ్డువేశారు. వీరి ఇంటికి కొద్ది దూరంలో సింగరేణి స్థలం ఉంది. అక్కడి వరకు సీసీ రోడ్డు వేయాలంటే బర్ల కొట్టం అడ్డంగా ఉంది. అది ప్రభుత్వ స్థలంలో ఉందని ఓదెలు కుటుంబానికి నోటీసులు ఇచ్చి.. జులై 31న పోలీసుల సహకారంతో మున్సిపల్ ఆఫీసర్లు షెడ్డును కూల్చేశారు. ఎందుకు కూల్చారని బాధితులు అడిగితే.. ఆఫీసర్లు ఎమ్మెల్యే పేరు చెప్పడంతో కోపంతో ఓదెలు దంపతులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులోకి తమ బర్లను తోలుకుని వెళ్లి నిరసన తెలిపారు. న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగి చస్తామని మందు డబ్బాతో హెచ్చరించారు. పోలీసులు అడ్డుకుని ఓదెలు దంపతులను పీఎస్ కు తరలించారు.

**నాకు తెల్వకుండా చేశారు: ఎమ్మెల్యే గండ్ర వివరణ** మున్సిపల్ ఆఫీసర్లు బర్ల కొట్టాన్ని కూల్చివేసినది తనకు తెలియదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. షెడ్డును కూల్చి వేయమని ఎవరికీ చెప్పలేదని, బాధ్యులైన ఆఫీసర్లపై చర్యలు తీసుకుని, ఓదెలు కుటుంబానికి న్యాయం చేస్తానన్నారు.

# సీనియర్ జడ్జి వేధిస్తున్నారని ఆరోపిస్తూ రాజీనామా చేసిన మహిళా జడ్జి అదితి శర్మ, ఆమె ఏమన్నారంటే..

మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు మహిళా న్యాయమూర్తులను తొలగించడం తప్పు అని వారిని తిరిగి నియమించాలని సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం ఆదేశించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ ఆరుగురు న్యాయమూర్తులలో ఒకరు అదితి శర్మ, ఆమె జూలై 28న తన పదవికి రాజీనామా చేశారు. నేను ఈ వ్యవస్థ చేతిలో ఓడిపోయినందుకు కాదు, ఈ వ్యవస్థే విఫలమైనందుకు జ్యుడీషియల్ సర్వీసుకు రాజీనామా చేస్తున్నా అని అదితి శర్మ అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత 2025 మార్చిలో, అదితి శర్మ మళ్లీ మధ్యప్రదేశ్‌లోని శహ్‌డోల్ జిల్లాలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె విధుల్లో చేరి ఐదు నెలలు మాత్రమే అయింది. ఒకరికి అనుకూలంగా నిర్ణయం వచ్చినప్పటికీ, ఓడిపోయిన వ్యక్తి తన వాదనలు వినిపించి, సంతృప్తి చెందే అవకాశం కల్పించడానికి కోర్టులు అవసరం. నాకు న్యాయం జరగలేదు, విచారణ కూడా జరగలేదు అని ఆమె మీడియతో అన్నారు.



# ఆ ఎమ్మెల్యేలపై వేటు వేయాలి..

## సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ గౌరవించాలి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఇంకా విచారణ అవసరం లేదని.. వెంటనే స్పీకర్ వారిని డిస్ క్వాలిఫై చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు జులై 31న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని, గెలవడానికి గులాబీ సైన్యం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గౌరవప్రదమైన స్పీకర్ పదవిని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ చేసిన నీతిమాలిన, రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయిం పుల రాజకీయానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ లాంటిదని తెలిపారు. పార్టీ తరపున ఎన్నికైన 10 ఎమ్మెల్యేలు ప్రలోభాలకు లొంగినా కష్ట కాలంలో పార్టీ వెంట నిలిచిన లక్ష లాది కార్య కర్తలకు ధన్యవాదాలు చెప్పారు. రేవంత్ ప్రభుత్వం చేస్తున్న అడ్డగోలు, అప్రజాస్వా మిక, అవినీతి రాజకీయాలను ఎక్కడికక్కడఎండగడుతూ పార్టీకి అండగా ఉన్న లక్షలాది మంది కార్యకర్తలు గొప్పస్ఫూర్తి చాటారని కొనియాడారు.

**రాహుల్ గాంధీ ఆచరించాలి :** పార్టీ మారితే ఆటోమేటిక్గా అనర్హత వర్తిం చాలని పాంచ్ న్యాయ్ పేరుతో చెప్పిన రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు తీర్పుని స్వాగ తించాలని మాజీమంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. పాంచ్ న్యాయ్ పేరుతో చెప్పిన నీతులను రాహుల్ గాంధీ ఆచరణలో చూపిం చాలని కేటీఆర్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత విధిస్తూ వెంటనే నిర్ణయం తీసుకోవా లని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రాష్ట్ర పన్ను రాబడి పెరిగింది..!

- **జూన్‌లో రూ.13,122 కోట్ల రాక**
- **గత నెలలో ఏకంగా 10,876 కోట్ల అప్పు**
- **మే కంటే రూ.1,420 కోట్లు అదనం**
- **ఆదాయ, వ్యయాలపై కాగ్ నివేదిక**

హైదరాబాద్, : రాష్ట్ర ప్రభుత్వ పన్ను రాబడి పెరిగింది. జూన్‌లో ఈ ఆదాయం పెరిగినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తెలిపింది. గత నెలలో పన్ను రాబడి రూ.13,112 కోట్లు వచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించి కాగ్ నివేదికను విడుదల చేసింది. వస్తు సేవల పన్ను, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నులు, సుంకాల ద్వారా గత ఏప్రిల్‌లో రూ.10,916 కోట్ల ఆదాయం వచ్చింది. మేలో రూ.11,692 కోట్లు రాగా.. జూన్‌లో రూ.13,112 కోట్లు వచ్చింది. అంటే.. రూ.1,420 కోట్లు అదనంగా వచ్చాయి. దీంతో జూన్ నాటికి జీఎస్టీ ద్వారా రూ.12,622 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.3,712 కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ.8,466 కోట్లు, ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.4,595 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.4,385 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల ద్వారా రూ.1,940 కోట్ల రాబడులు సమకూరాయి.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నికర అప్పు రూ.20,266 కోట్లకు చేరింది. ఒక్క జూన్‌లోనే రూ.10,876 కోట్ల రుణాలు తీసుకుంది. ఆ నెలలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయడం వల్ల ఎక్కువ అప్పు తీసుకోవాల్సి వచ్చింది. ఇలా అన్ని రకాల రాబడుల ద్వారా ప్రభుత్వానికి జూన్ నాటికి రూ.57,499 కోట్లు సమకూరాయి. ఇది అంచనా వేసిన రాబడి రూ.2,84,837 కోట్లలో 20.19 శాతం. కాగా, జూన్ నాటికి ప్రభుత్వం అన్ని రకాలుగా రూ.52,559 కోట్లను ఖర్చు చేసింది. ఇది అంచనా వ్యయం రూ.2,63,846 కోట్లలో 19.95 శాతం. మూలధన వ్యయం కింద అంచనా వేసిన రూ.36,504 కోట్లలో జూన్ నాటికి రూ.4,755 కోట్లను ఖర్చు చేసింది.

# జనహిత పాదయాత్ర మోసం కాదా?

## ఆరు గ్యారంటీల అమలుపై శ్వేతపత్రం ఇవ్వండి: బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్రావు



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'జనహిత పాదయాత్ర' వాస్త వంగా జనహితమా లేదా ప్రజలను మోసం చేయడమా అనేది ఆపార్టీ స్పష్టంగా చెప్పాల ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు, యువత, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, రైతులు, మహిళలు వంటి వర్గాలకు డిక్లరేషన్ల పేరుతో అనేక హామీలు ఇచ్చిందని, కానీ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆయన విమర్శించారు. బీజేపీ స్టేట్ ఆఫీసులో ఆయన మీడియాతోమా ట్లాడారు. కాం గ్రెస్ పార్టీ అన్నివర్గాల ప్రజలను మోసం చేసిం దని, ఇది ఎలా జనహితమవు తుందని ప్రశ్నించారు. ఎన్నికల సమ యంలో ప్రజల కు ఇచ్చిన ఆరు గ్యారం టీలు, హామీలు, మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు, డిక్లరేషన్ల అమలుపై ఎంత మేరకు నెరవేరాయో శ్వేతప త్రాన్ని విడుదల చేయాన్నారు.

**మాలెగావ్ తీర్పును స్వాగతించిన బీజేపీ..** 2008 మాలెగావ్ పేలుళ్ల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులను నిర్దో షులుగా ప్రకటిస్తూ ముంబయిలోని ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్వాగతించారు.

అప్పట్లో దేశ భద్రతకు, మత సామరస్యానికి విఘాతం కలిగించేలా కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందన్నా రు. మాలెగావ్ కేసులో కోర్టు తీర్పుతో కాంగ్రెస్ పార్టీ కుట్ర విఫలమైందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అన ర్హతపై దాఖలైన పిటిషన్పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన స్వాగతించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆర్ఎస్ ప్రవీణ్‌కు నోటిసులు !

హైదరాబాద్, : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో విచారణలో భాగంగా మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు సిట్ అధికారులు నోటీసులు అందించారు. నోటీసు అందుకున్న రెండు రోజుల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 6 గంటల్లోపు వాగ్మూలం ఇచ్చేందుకు తమ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. కాగా సిట్ నోటీసులపై ప్రవీణ్ కుమార్ స్పందించలేదు.

వాగ్మూలం ఇచ్చేందుకు ఆయన నిరాకరించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాల్సి వస్తుందనే స్టేట్మెంట్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం. అయితే జులై 14 న ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు ఇవ్వగా ఆయన ఇంకా స్పందించలేదు. గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో.. బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్ ను హ్యాక్ చేస్తుందని, ఫోన్ ట్యాపింగ్ కి పాల్పడుతుందని కేంద్ర ఎన్నికల సంఘంతో డీజీపీకి ఆయన ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

# ఇరిగేషన్ భూములను కబ్జాల నుంచి విడిపించండి

## కబ్జాకు పాల్పడినవాళ్లపై కఠిన చర్యలు తీసుకోండి

## హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం



రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ భూములను కబ్జా చేసిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, కబ్జా చెరలో ఉన్న ఆ భూములను విడిపించాలని అధికారులను ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. కబ్జా చెర నుంచి విడిపించిన భూముల చుట్టూ కంచెలను యుద్ధప్రాతిపది కన ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, హైడ్రా, రెవెన్యూ డిపార్ట్మెంట్ల అధికారులతో జులై 31న సెక్రటేరియెట్ లో మంత్రి ఉత్తమ్ సమావేశమయ్యారు.

రూ. వందల కోట్ల విలువైన ఇరిగేషన్ భూములను కబ్జా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షిం చొద్దని తేల్చి చెప్పారు. భూముల పరిరక్షణకు సంబంధించి ఎదురయ్యే న్యాయపరమైన సవాళ్లను అధిగమించేందుకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు ప్రత్యేకంగా ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్ను నియమించాల్సిందిగా అడ్వకేట్ జనరల్ను కోరారు. హైదరాబాద్ గండిపేట, రాజేంద్రనగర్ లోని వాలంతరీ (వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ఇన్స్టిట్యూట్), తెలంగాణ గ్రౌండ్ వాటర్ అండ్ ఇరిగేషన్ రీసెర్చ్ లేబొరేటరీ (టీజీఈఆ ర్ఎల్) భూములు ఆక్రమణకు గురయ్యాయని గుర్తుచేశారు. 426.30 ఎకరాల్లోని 131.31 ఎకరాలు కబ్జాకు గురయ్యాయని ఆయన తెలిపారు. కబ్జాకు గురైన భూముల్లో 81.26 ఎకరాలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) పరిధిలోకి వస్తాయని, ప్రస్తుతం అవి కోర్టు కేసుల్లో చిక్కుకున్నాయ ని పేర్కొన్నారు. మిగతా 50.13 ఎకరాలు ఇంకా కబ్జాదారుల చెరలోనే ఉన్నాయన్నారు. జిల్లా కోర్టులో 20 కేసులు పెండింగ్ ఉన్నా యని చెప్పారు. మరో రెండు కేసులు హైకోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. కబ్జాకు గురైన ఇరి గేషన్ భూములను వీలైనంత త్వరగా విడిపిం చేందుకు ఇరిగేషన్ శాఖ, హైడ్రా, రెవెన్యూ,ఆర్ అండ్ ఆర్ విభాగాలు కలిసి పనిచేయాల ని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. రాష్ట్రంలోని ఇరిగేషన్ శాఖ భూములు, బిల్డింగులు, క్వార్ట ర్లన్నింటి లెక్కలను తీయాలన్నారు. ఆక్రమణ లకు గురైన డిపార్ట్మెంట్ క్వార్టర్లను రికవర్ చేసుకోవాలని తెలిపారు. కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

**ఇరిగేషన్ భూముల్లో సోలార్ ప్లాంట్లు** : ఇరిగేషన్ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలిం చాల్సిందిగా అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. గత కేబినెట్ మీటింగ్లో దీనిపై చర్చించామ ని గుర్తు చేశారు. వీటి ద్వారా ఉత్పత్తి చేసిన కరెంట్ను అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు వాడుకునే వీలుంటుందని ఆయన అన్నారు.

# జనవరిలో యాదాద్రి ప్లాంట్ అన్ని యూనిట్లు ప్రారంభం

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనుల్లో రెండేండ్లు జాప్యం : డిప్యూటీ సీఎం భట్టి




ఈ ఏడాది చివరి నాటికి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని అన్ని యూనిట్లను పూర్తి చేసి 2026 జనవరి నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ అందిం చేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇందు కోసం నిర్దేశించిన క్యాలెండర్ ప్రకారం పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 1న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం, వీర్లపా లెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో రూ.970 కోట్లతో వైటీపీఎస్ లో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన స్టేజ్ 1 లోని ఒకటో యూనిట్ ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో భట్టి మాట్లా డుతూ గత ప్రభుత్వం ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ సాధించడంలో జాప్యం చేయడం వల్ల రెండేండ్ల పాటు ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం జరిగిందని ఫలితంగా ఆర్థిక భారం గణనీయంగా పెరిగిం దని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేవలం రెండు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించామని చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో పనిచేసే ఉద్యోగులకు అత్యుత్తమ సౌకర్యాలు స్థానికంగా కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు, కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి సహ కరించిన స్థానిక ప్రజలకు కూడా థర్మల్ పవర్ ప్లాంట్ ఉద్యోగులకు అందే విద్య, వైద్య సౌకర్యా లను ఉచితంగా అందచేస్తామని ప్రకటించారు. నియోజకవర్గ ప్రజలకు అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. పవర్ ప్లాంట్ ఆవరణలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సం దర్భంగా పవర్ ప్లాంట్ కోసం భూములు ఇచ్చినభూనిర్వాసితులు భట్టి విక్రమార్కను కలిశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేదని.. ఆ హామీని నెరవేర్చా లని కోరారు. పవర్ ప్రాజెక్టు కోసం భూములను ఇచ్చిన వారికి ఆగస్టు 15లోగా 246మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు భట్టి ప్రకటించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిగా అందని వారికి అందచేస్తామని, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ తో పాటు

పులిచింతల ప్రాజెక్టు భూ నిర్వాసితుల కు నిబంధనల మేరకు ఉద్యోగాలు కల్పిస్తామని డిప్యూటీమ సీఎం భరోసా ఇచ్చారు.

**రెండేండ్లలోనే 4వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు: ఉత్తమ్ :** ప్రతి వారం టార్గెట్ పెట్టి ప్రగతిని సమీక్షించడంతో రెండేండ్లలోనే 4వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రాబోతుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. తాను నల్లగొండ ఎంపీగా ఉన్న సమయంలోనే విష్ణుపురం డబుల్ రైల్వే లైన్ మంజురైందన్నారు. అయితే 93 కిలోమీటర్ల ఈ డబుల్ లైన్ రైల్వే పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సరిగా నిధులు రాకపోవడతో ఆలస్యం అవుతున్నట్లు తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రహదారుల పూర్తికి రూ.280 కోట్ల మంజూరు చేయడంతో పాటు క్లియరెన్స్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, అధికారులు నవీన్ మిట్టల్, ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ అటెండెన్స్ పెట్టిన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు

## అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం నకిలీ హాజరుపై సీరియస్



పంచాయతీ కార్య దర్శుల ఫేక్ అటెండెన్స్ పై మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహించకుండా, ఫేక్ అటెండెన్స్ తో పని చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులకు మంత్రి సీతక్క జులై 31న ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత విధానాల ప్రకారం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న గ్రామం నుంచే మొబైల్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలి. కానీ, కొంతమంది కార్య దర్శులు ఇతరుల సహాయంతో, లేదా తమ మొబైల్ ఫోన్లను మల్టీపర్పస్ వర్కర్లకు ఇచ్చి, తాము లేకుండానే యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నట్లు అధికారులు గుర్తిం చారు.

ఏకంగా తమ పాస్పోర్ట్ ఫోటోలను వాడి హాజరు నమోదు చేసిన ఉదంతాలూ ఇటీవల వెలుగులోకి వచ్చాయి. కొన్నిచోట్ల ఖాళీ కుర్చీలను ఫొటో తీసి అటెండెన్స్ యాప్ లో అప్లోడ్ చేశారు. జిల్లాల వారీగా పదుల సంఖ్యలో ఇలాంటి ఫేక్ హాజరు కేసులు వె లుగులోకి వచ్చాయి. ఇలా మోసపూరితంగా వ్యవహరిస్తున్న కొంతమందితో మొత్తం వ్యవ స్థకు చెడ్డపేరు వస్తున్నదని పంచాయతీ కార్య దర్శుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి.

ఫేక్ అటెండెన్స్ వేస్తున్న పంచాయతీ కార్యద ర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వా న్ని కోరాయి. దీనిపై వెంటనే స్పందించిన అధి కారులు.. సంబంధిత జిల్లాల డీపీఓలకు ఆ ఉద్యోగులపై సస్పెన్షన్ విధించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్లకు నివేదికలు పంపించి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఫేక్ అటెండెన్స్ పెట్టిన పంచాయతీ కార్యదర్శులు, పర్యవేక్షించకుండా వదిలేస్తున్న అధికారుల పై మంత్రి సీతక్క ఆదేశాలతో కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ సృజన.. డీపీఓలను ఆదేశించారు.

# అందుబాటులో కి GHMC వాట్సాప్ సేవలు..




గ్రేటర్ హైదరాబాద్ నగర వాసులకు జీహెచ్ఎంసీ గుడ్ న్యూస్ చెప్పింది. సమస్యల పరిష్కారం కోసం వాట్సాప్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి మై జీహెచ్ఎంసీ యాప్ తో పాటు వాట్సాప్ లో కూడా ఫిర్యాదు చేసేందుకు కల్పించింది.నుంచి మై జీహెచ్ఎంసీ యాప్ తో పాటు వాట్సాప్ లో కూడా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించింది. ఆగస్టు 01న వాట్సాప్ సర్వీసులను ప్రారంభించింది.చెత్త వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు, గార్బేజ్ బిన్ ఓవర్ ఫ్లో లాంటి సమస్యలపై ఫిర్యాదుచేసేందుకు అవకాశం కల్పించింది జీహెచ్ఎంసీ. అందుకోసం 8125966586 నంబర్ కు ఫోటోతో పాటు లొకేషన్ పెడితే చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసి అధికారులు తెలిపారు.ఇప్పటికే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన చెల్లింపులు వాట్సాప్ ద్వారా అవకాశం కల్పించేందుకు కసరత్తు చేస్తోంది జీహెచ్ఎంసీ. ప్రస్తుతం ప్రతి ఏడాది సుమారు రూ.2 వేల కోట్ల మేర ఆస్తిపన్ను వసూలవుతుండగా.. దాంట్లో సగం వరకు ఆన్లైన్ పేమెంట్స్ రూపంలో వస్తోంది. గూగుల్ పే, మైజీహెచ్ఎంసీ యాప్, పేటీఎం, ఇతర యూపీఐ ప్లాట్ఫామ్లతోపాటు వెబ్సైట్ ద్వారా ప్రజలు ట్యాక్స్ పే చేస్తున్నారు.అయితే ప్రతిసారీ కట్టాల్సిన ట్యాక్స్ లను గుర్తు చేయడానికి జీహెచ్ఎంసీ సుమారు 20 లక్షల ఎస్ఎంఎస్లు పంపాల్సి వస్తోంది. ఆ మెసేజ్ లు పంపేందుకు పెద్ద మొత్తంలో ఖర్చువుతోంది. ప్రతి 1,000 మెసేజ్లకు సగటున రూ.52 ఖర్చవుతోంది. ఈ ఖర్చును తగ్గించేకందుకు తగ్గించేందుకు, వాట్సప్ బిజినెస్ అకౌంట్ ద్వారా పేమెంట్స్ చేపట్టాలనేప్లాన్ లో ఉంది. అదే విధంగా గ్యార్బేజ్ ఇతర కంప్లయింట్లకు సంబంధించిన సేవల కోసం వాట్సాప్ సదుపాయం కల్పించడం గమనార్హం

# ఎరువుల సరఫరాపై కేంద్రానికి తుమ్మల లేఖ



హైదరాబాద్, : తెలంగాణకు రావాల్సిన ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ కేంద్రమంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖ రాశారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువులు త్వరితగతిన పంపించాల్సిందిగా కోరారు. ఆగస్టు నెలవారీ కేటాయింపులతోపాటు ఇప్పటి వరకు ఏర్పడ్డ 1.93 లక్షల మెట్రిక్ టన్నుల లోటు, జూలైలో ఇంకా సరఫరా కావాల్సిన 0.44 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల్ని ఆగస్టు నెల కేటాయింపులతో కలిపి సరఫరా చేయాల్సిందిగా కోరారు.

ఎరువుల సరఫరాపై మంత్రి తుమ్మల సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వార్షిక కేటాయింపుల్లో భాగంగా 2025 ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందన్నారు. కేటాయించిన మొత్తం నెలవారి ప్రణాళికప్రకారం రాష్ట్రానికి పంపిణీ చేయా ల్సి ఉండగా.. తక్కువే సరఫరా చేసిందని అధికారులు మంత్రికి వివరించారు.

# కమ్యూనిస్టులు ఉప్పులాంటోళ్లు

## ఉప్పు ఉంటేనే వంటకు రుచి వచ్చినట్టు ఎర్రజెండా కనిపిస్తేనే సమస్యల పరిష్కారం: సీఎం రేవంత్



కమ్యూనిస్టులు ఉప్పులాంటి వారని, ఎంత మంచి వంటకమైనా ఉప్పుతోనే రుచి వచ్చినట్లు.. సమస్యల పరిష్కారం కావాలంటే ఎర్ర జెండా ఉండాల్సిందేనని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుల పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు. కమ్యూనిస్టులు ఎర్ర జెండా పట్టుకుని పోరాటం చేస్తేనే ప్రజలకు ప్రభు త్వంపై విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఒక దినపత్రిక పదో వార్షికోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. "ప్రచారం చేయడం నా చేతిలో లేదు. మీరు చేసేకా ర్యక్రమాలకు వెసులుబాటు కల్పించడం సీఎంగా చేతిలో ఉంది. పెట్టుబడులు ఉన్న వ్యాపారసంస్థలు వారి ప్రయోజనాల కోసం ప్రచారం చేసుకుంటా యి. కానీ, నేను కమ్యూనిస్టు సోదరులను ఉప్పుతో పోలుస్తాను. ఏ వంటకంలోనైనా ఎన్ని మసాలాలు వేసినా, ఉప్పు లేకపోతే రుచి ఉండదు. అలాగే, ప్రజా సమస్యలపై ఎర్రజెండా కనిపించినప్పుడే ప్రజలకు ఒక విశ్వాసం వస్తుంది. కమ్యూనిస్టులు అధికారం లోకి రావడానికి పనికొస్తారో లేదోనేను విశ్లేషించలే సుకానీ, ఉన్నవాళ్లనుదించడానికి మాత్రం వందకు వంద శాతం పనికొస్తారు. తప్పులు చేసేవారిని దిం చడానికి కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారు. అందుకే తప్పులు జరగకుండా పాలన అందించా లని నేను ఎప్పుడూ అనుకుంటాను" అని వ్యాఖ్యా నించారు.

**అబద్ధాలు చెప్పొద్దని నిర్ణయించుకున్నా..** అబద్దాల పునాదులపై రాజకీయ భవిష్యత్తు నిర్మిం చుకుంటే అది ఏదో ఒక రోజు కూలిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "నేను రాజకీయాల్లో కి వచ్చినప్పుడు అబద్దాలు చెప్పకూడదని నిర్ణయిం చుకున్నా. నా ఏ ఉపన్యాసం లేదా విశ్లేషణ అయినా రేవంత్ రెడ్డి అబద్ధం చెప్పారని ఇప్పటివరకూ ఎవరూ విశ్లేషించలేదు. నిజం కొన్నిసార్లు ఇబ్బంది కలిగించినా, నేను ఎప్పుడూ అబద్దం చెప్పను" అని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం దిగిపోయిన నాయకుడు మాత్రం చెప్పేవన్నీ అబద్ధాలే అని, నిజాలుగా భ్రమలు కల్పించగల నేత అని కేసీఆ రనుద్దేశించి వ్యాఖ్యానించారు. తనకు కమ్యూనిస్టుల పట్ల అపారమైన గౌరవం ఉందని సీఎం రేవంత్ తెలిపారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచినప్పుడు తన పార్లమెంటు కార్యాలయాన్ని మల్లు స్వరాజ్యం గారితో ప్రారంభించుకున్నట్లు గుర్తు చేసుకున్నారు.

**జర్నలిస్టులు లక్ష్మణరేఖ గీసుకోవాలి :** రాజకీయ పార్టీల యాజమాన్యంలో నడుస్తున్న పత్రికలు, ప్రసార మాధ్య మాల కారణంగా జర్నలిజం వి శ్వసనీయత వేగంగా పడిపోతు న్నదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో సిద్ధాంతాల వ్యాప్తి

కోసం పత్రికలు స్థాపించేవారని.. కానీ ఇప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, సంపాదించిన ఆస్తులను కాపాడు కోవడానికి పత్రి కలను వాడుకుంటున్నాయని తెలిపారు. ఈ ధోరణి వల్ల నిజమైన జర్నలిస్టుల విశ్వసనీయత దెబ్బతింటు న్నదని పేర్కొన్నారు. "జర్నలిజం ముసుగులో అరాచకాలు చేసేవారిని నిజమైన జర్నలిస్టులు పక్కకు నెట్టాలి. లేకపోతే ఇది తెలంగాణ సమాజానికే కాద్ము దేశ భద్రతకు కూడా ప్రమాదకరం" అని హెచ్చరిం చారు. సోషల్ మీడియాలో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు ఐఎస్ఐ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని, ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' లో కొందరిని అరెస్టు చేశారని గుర్తు చేశారు. జర్నలిస్టులకు, రాజకీయపార్టీ కార్యకర్తలకు మధ్య తేడా తెలియని పరిస్థితి ఏర్పడిందని, మీడియా సమావేశాల్లో అడిగే ప్రశ్నల తీరును బట్టి వారు జర్నలిస్టులా? రాజకీయ పార్టీల కార్యకర్తలా? అని గుర్తించాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. దీనిపై జర్నలిస్టులు విశ్లేషించుకొని, ఒక లక్ష్మణరేఖ గీసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్రెడ్డిసూచించారు, సీనియర్, నిబద్ధత కలిగిన జర్న లిస్టులు రాసే విశ్లేషణాత్మక కథనాలు ప్రభుత్వానికి ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. నిజమైన జర్నలిస్టులు నిర్వహించే సెమినార్ల ద్వారా 'జర్నలిస్ట్' అనే పదానికి ఒక నిర్వచనం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో ఎవరికి వారు 'జర్నలిస్ట్' అని పేరు పెట్టుకొని ఇష్ట మొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. వారికి కనీస అక్షర జ్ఞానం కూడా ఉండదని, జర్నలిజం స్కూళ్లకు వెళ్లిన వారు కారన్నారు. "గతంలో సీనియర్ జర్నలిస్టులకు జూనియర్లు ఎంతో గౌరవం ఇచ్చేవారు. జర్నలిజానికి తమ జీవితాన్ని అంకితం చేసిన సీనియర్లకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేంసరేందర్ రెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, జాతీయ కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ కమిషనర్

**నిబంధనల పేరుతో హోటల్ యజమానికి జీహెచ్ఎంసీ డీసీ రవికుమార్ బెదిరింపు**

**రూ.5 లక్షల లంచం డిమాండ్... 2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ**

హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న కె.రవి కుమార్ రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సర్కిల్ పరిధిలోని ఒక హోటల్.. నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ దాని యజమానిని వారం రోజులుగా రవి కుమార్ బెదిరిస్తున్నాడు. 'మీ మీద చర్యలు తీసుకోవద్దంటే నాకు రూ.5 లక్షలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశాడు. దీంతో బుద్వేల్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ చాంబర్‌లో ఆయనకు సదరు హోటల్ యజమాని రూ.2 లక్షల ఇస్తుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



మీడియాకు ఇవ్వడానికి తీసుకున్నట్లు రవి కుమార్ తమ విచారణలో చెప్పాడని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఏసీబీ హైదరాబాద్ రేంజ్ డీఎస్పీ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయన్ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న కె.రవి కుమార్‌కు ఇటీవల సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించిన తర్వాత బదిలీ కావాల్సి ఉన్నా, తనకున్న పరిచయాలతో ఇక్కడే కొనసాగుతున్నారు. రవి కుమార్‌తో ఇదే సర్కిల్‌లో 8 నెలల్లో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల సంఖ్య ఐదుగురికి చేరుకుంది. ఇంతకు ముందు సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ బల్వంత్‌రెడ్డి, ఏఈ వెంకోబా, బిల్ కలెక్టర్ మధు, అతడి అసిస్టెంట్ రమేశ్‌లను ఏసీబీ అరెస్టు చేసింది.

# అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు తీర్పు వెలువరించిన హైకోర్టు




అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయడానికి వాటి బాధితులే కానవసరం లేదని.. అపరిచితులైనా.. లేదా రోడ్డుపై వెళుతున్న ఏ వ్యక్తి అయినా ఫిర్యాదు చేయవచ్చని హైకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పులో స్పష్టం చేసింది. హైదరాబాద్ బేగంపేట బీఎస్ మక్తాలో 400 చదరపు గజాల్లో అను మతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవా లంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ చేగూరి అనిత ఆండాళ్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. వినోద్కుమార్ విచా రణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. “పిటిషనర్, పిటిషనర్ కుమారుడు 200 గజాల చొప్పున కొనుగోలు చేసి విడివిడిగా స్టిల్ట్ తోపాటు రెండంతస్తుల నిర్మాణాలకు అనుమతి తీసుకున్నప్పటికీ, తరువాత 400 చదరపు గజాల్లో గ్రౌండ్ తో పాటు 4 అంత స్తుల నిర్మాణాలకు అనుమతులను సవరించాలంటూ దర ఖాస్తు చేశారు.

తరువాత పటిష్ఠత, వాస్తు నేపథ్యంలో అయిదో అంతస్తు నిర్మించారు. అనుమతుల సవరణతో పాటు తరువాత క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసినా, దానిపై అధికారులు నిర్ణయం తీసుకోలేదు. ప్రాంతంలో నివసించని నరేందర్ అనే వ్యక్తి వేసిన పిటి షన్ ఆధారంగా హైకోర్టు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చింది. ఈ పిటిషన్ మమ్మల్ని ప్రతివాదులుగా చేర్చ కుండా, మా వాదన వినకుండా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అప్పీలు దాఖలు చేస్తే సింగిల్ జడ్జి వద్దనే పునస్సమీక్ష కోరాలని, లేదంటే తాజా పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఆదేశించడంతో ఇక్కడ పిటిషన్ చేశారు’ అని తెలిపారు. జీహెచ్ఎంసీ తరఫు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ నిర్మా ణాలకు అనుమ తులను తిరస్కరించినట్లు చెప్పారు. క్రమబద్ధీకరణ కేవలం 2015లోపు చేపట్టిన నిర్మాణాలకే వర్తిస్తుంద న్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రైవేటు వ్యక్తి అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

అలాంటప్పుడు పిటిషనర్ను ప్రతివాదిగా చేయకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్న వాదన సరికాదన్నారు. అనుమ తుల ప్రకారం నిర్మించి, అక్రమ నిర్మాణం క్రమబద్ధీకర ణకు అధికారులు అంగీకరించిన తరువాత వారు చర్యలు చేపట్టి ఉంటే.. పిటిషనర్ హక్కుల పరిరక్షణ అంశాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని చెప్పవచ్చని, అయితే ఇక్కడ ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపట్టా రన్నారు. అందువల్ల సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సహేతుకం కావని చెప్పలేమన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జీహెచ్ఎంసీ ఇచ్చిన నోటీసులను రద్దు చేయా లంటూ దాఖలు చేసిన పిటిషన్లో జోక్యం చేసుకోలే మంటూ కొట్టివేశారు. అయితే పిటిషనర్ పెట్టిన క్రమబ ద్ధీకరణ దరఖాస్తుపై ఎ.ప్రవీణ్ కుమార్ కేసులో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పరిష్కరించాలని జీహెచ్ ఎంసీకి సూచించారు.

# రాష్ట్ర ప్రభుత్వంలో కానరాని జవాబుదారి తనం

## సహా చట్టానికి తూట్లు ... ప్రభుత్వ కార్యాలయాల్లో ఇవ్వని సమాచారం

## రాజ్యాంగ హక్కులను చట్టాలను కాలరాస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు




ప్రజా ప్రభుత్వంలో ప్రజల్లో జవాబుదారి తనం పెంపొందించి, మెరుగైన పాలన అందిస్తారని గత ప్రభుత్వంలో కంటే మెరుగైన పాలనా కనబతుందని ఆశించిన అది కేవలం మాటలకే కానీ చేతలకు కానట్టుగానే కనిపిస్తుంది రాష్ట్ర ప్రభుత్వంలో సమాచార హక్కు చట్టం కానరావడం లేదు జవాబు దారి తనం పాలనా లో ప్రజల భాగస్వామ్యం పెంపొందించే ప్రక్రియకు మూలమైన సహచట్టం అధికారులు తూట్లు పొడుస్తున్న ప్రజా ప్రతినిధులు మాత్రం దానిపై ఎటువటిని చర్యలకు పూనుకోవడం లేదు ఇటీవల రాష్ట్ర ప్రధాన చీఫ్ కమిషనర్ తో సహా ఐదు గురు రాష్ట్ర కమిషనర్లుగా నూతనంగా నియమితులయ్యారు.

సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర గవర్జర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు. అయినప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో స.హ చట్టం అమలు మచ్చు కు కూడా కాన రావడంలేదు. సింహభాగం ప్రభుత్వ కార్యాలయాల్లో సెక్షన్ 4(1) బీ అంటే తెలియయడం లేదు. ఇదీ అధికారులు అవినీతి అలసత్వానికి నిదర్శనంగా మారింది. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు పారదర్శకమైన పాలన అందిస్తామని ప్రభుత్వ పెద్దలు సహ కమిషనర్లు బహిరంగంగా వెల్లడిస్తున్నా పలు ప్రభుత్వ శాఖల అధికారుల్లో చలనం రావడం లేదు. ఇప్పటికైనా సహ కమిషనర్లు స్పందించి ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సహచట్టంపక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి. సమాచారహక్కు చట్టం 2005లో వచ్చింది. ఈ చట్టం కింద ప్రభుత్వ కార్యా లయం ఎదుట నోటును బోర్డులో వారి కార్యా లయంలో ఉద్యోగుల సమగ్ర వివరాలు, వారు అందిస్తున్న సేవలు తదితర 17 అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి, కానీ ఎక్కడా అలా వెల్లడించకుండా సహచట్టాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. కొన్ని కార్యాలయాల్లో మాత్రం సహచట్టం అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మే షన్ ఆఫీసర్, అప్పీలేట్ అధికారి పేర్లతో మమ అనిపిస్తున్నారు. పలు కార్యాలయాల్లో బేఖాతర్ చేస్తున్నారు రాష్ట్రంలోని 31 జిల్లాలు హైదరాబాద్ మహాన గరంలోని అన్ని కార్యాలయాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతుంది ముఖ్యముగా రాష్ట్రానికి రెవిన్యూ ఆర్టీఏ రిజిస్టర్ శాఖ తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, మైనింగ్, ఇరిగేషన్ తదితర ముఖ్య కార్యాయాల్లో కోట్ల రూపాయల విలువగల దస్త్రాలు ముఖ్య మైన కాగితాలను అప్పీలు చేసుకున్న ఇవ్వడం లో ప్రభుత్వ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలో ప్రభుత్వ విలువైన భూములకు సంబంధించిన సమాచారం అడిగిన ఇవ్వడం లేదు ప్రభుత్వ పెద్దలు వెంటనే దీనిపై స్పందించి సహచట్టం అమలుకోసం గట్టి ప్రయత్నం చేయాలి..

# జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీతలకు చిరంజీవి శుభాకాంక్షలు..

71వ జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చింది. డైరెక్టరేట్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ఆధ్వరంలో 2023 సంవత్సరానికి గానూ ఈ అవార్డులను ప్రకటించింది. పలు విభాగాల్లో తెలుగు సినిమాలు సత్తా చాటాయి.. టాలీవుడ్ నుంచి ఉత్తమ సినిమాగా భగవంత్ కేసరి అవార్డ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్రప్రముఖులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ సినీరంగానికి అత్యంత ప్రతిష్టాత్మక గౌరవదాయకమైన 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. పలు విభాగాల్లో తెలుగు సినిమాలు సత్తా చాటాయి. ముఖ్యంగా నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి మూవీ ఉత్తమ ప్రాంతీయ సినిమాగా ఎంపిక కావడంతో చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే మెగాస్టార్ చిరంజీవి సైతం సోషల్ మీడియా ద్వారా జాతీయ అవార్డ్ గ్రహీతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ చేశారు. "తెలుగు టాలెంట్, తెలుగు సినిమాలు ఈసారి పదికి పైగా విభాగాల్లో అవార్డులు గెలుచుకోవడం చూసి ఎంతో గర్వంగా ఉంది.. " అంటూ పోస్ట్ చేశారు.

ఉత్తమ చిత్రం: 12వ ఫెయిల్
(నిర్మాత–దర్శకుడు : విధు వినోద్ చోప్రా)
ఉత్తమ నటుడు: విక్రాంత్ మాస్సే
(12వ ఫెయిల్), షారూఖ్ ఖాన్ (జవాన్)
ఉత్తమ నటీమణి: రాణి ముఖర్జీ ( మిసెస్ చాటర్జీ వర్సెస్ నార్వే)
ఉత్తమ దర్శకుడు: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)

**తెలుగు నుంచి గెలుచుకున్న ముఖ్య అవార్డులు:**

ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ – కేసరి
(హీరో: బాలకృష్ణ, దర్శకుడు: అనిల్ రావిపూడి)



ఉత్తమ AVGC చిత్రం: హనుమాన్
ఉత్తమ స్క్రీన్ ప్లే: సాయి రాజేష్ (బేబీ)
ఉత్తమ బాలనటి: సుకృతి బండిరెడ్డి (గాంధీ తాత చెట్టు)
ఉత్తమ యాక్షన్ దర్శకత్వం: నందు–పృథ్వీ ( హనుమాన్)
ఉత్తమ గీత రచయిత: కాసర్ల శ్యామ్.. ఊరు పల్లెటూరు (బలం)
మరాఠీలో విడుదలై సంచలనం సృష్టించిన నాల్ సినిమా ఉత్తమ బాలల చిత్రంగా నిలిచింది.

- ఉత్తమ ప్రజాదరణ చిత్రంగా రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ
- బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
- బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లీష్)
- బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
- బెస్ట్ బయోగ్రాఫికల్ ఫిల్మ్: మా బావు, మా గావ్ ఒడిశాకు చెందిన సినిమాకు దక్కాయి

# బీజేపీలోకి వచ్చేందుకు ప్రయత్నించడం లేదు : ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ : తాను మళ్లీ బీజేపీలోకి రావడానికి ప్రయత్నిస్తున్నానని, అమిత్ షా తనకు ఫోన్ చేశారని జరుగుతున్న ప్రచారం నిజం కాదని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. తన రాజీనామాను అధిష్ఠానం ఆమోదించడంలో పెద్ద కుట్ర జరిగిందన్నారు. కొంత మంది దొరలు తన గురించి తప్పుడు సమాచారాన్ని ఢిల్లీ పెద్దలకు పంపారని ఆరోపించారు. తెలంగాణ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, బీజేపీకి ఎవరి వల్ల నష్టం జరిగిందో కేంద్రం పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని అనుకుంటున్నానని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మంచి రైటర్ అని.. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే ఫైటర్ కావాలని రాజాసింగ్ పేర్కొన్నారు. తాను పదకొండేళ్లుగా పార్టీలో ఉన్నానని, మూడోసారి గెలిచినప్పటికీ మొదట ఎక్కడ ఉన్నానో ఇప్పుడూ అక్కడే ఉన్నానని తెలిపారు. చాలా బాధతో పార్టీని వీడానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిపై అధిష్ఠానం ఐబీతో నివేదిక తెప్పించుకోవాల్సిన అవసరముందన్నారు.

# అర్ధరాత్రి అందరూ గాఢ నిద్రలో ఉండగా.. ఈ ముస్లిం దేశాన్ని కుదిపేసిన భూకంపం..




రష్యా తర్వాత ఇప్పుడు మరో దేశంలో భూమి కంపించింది. ఆగస్టు 1న అర్ధరాత్రి తర్వాత ప్రజలు గాఢ నిద్రలో ఉన్నప్పుడు ఇళ్లు సహా..ఇంట్లోని మంచం వరకు ప్రతి వస్తువు కంపించటం మొదలుపెట్టింది. నిద్రలోంచి తేరుకున్న ప్రజలు అది భూకంపం అని తెలుసుకున్న వెంటనే అరుపులు కేకలు పెడుతూ ఇళ్ల నుండి బయటకు పరుగులు తీయడం ప్రారంభించారు. భారత కాలమానం ప్రకారం,.. రష్యా తర్వాత ఇప్పుడు మరో దేశంలో భూమి కంపించింది. ఆగస్టు 1న అర్ధరాత్రి తర్వాత ప్రజలు గాఢ నిద్రలో ఉన్నప్పుడు ఇళ్లు సహా..ఇంట్లోని మంచం వరకు ప్రతి వస్తువు కంపించటం మొదలుపెట్టింది. నిద్రలోంచి తేరుకున్న ప్రజలు అది భూకంపం అని తెలుసుకున్న వెంటనే అరుపులు కేకలు పెడుతూ ఇళ్ల నుండి బయటకు పరుగులు తీయడం ప్రారంభించారు. భారత కాలమానం ప్రకారం, ఆఫ్ఘనిస్తాన్‌లో ఆగస్టు 1న తెల్లవారు జామున 2:33 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.5గా నమోదైంది. కొన్ని రోజుల క్రితమేరష్యాలో 8.8 తీవ్రతతో భూకంపంచిన కారణంగా రష్యాతో సహా అనేక దేశాలలో సునామీ హెచ్చరిక జారీ చేయబడింది.శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రతతో భూకంపం ఆఫ్ఘనిస్తాన్‌ను తాకింది. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2:33 గంటలకు భూకంపం సంభవించింది. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (NCS) ప్రకారం, భూకంప కేంద్రం భూమి నుండి 87 కిలోమీటర్ల లోతులో ఉందని గుర్తించింది. దీని కేంద్రం 35.86ు ఉత్తర అక్షాంశం, 69.94ు తూర్పు రేఖాంశంలో ఉంది. NCS సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ X లో దీని గురించి సమాచారం షేర్ చేశారు. ఇంకా ఎటువంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం నిర్ధారించబడలేదు. కానీ రాజధాని కాబూల్‌తో సహా అనేక ప్రాంతాల్లో ప్రకంపనలు సంభవించాయి. NCS ప్రకారం, గత వారంలో ఆఫ్ఘనిస్తాన్‌లో నాలుగు సార్లు భూకంపాలు నమోదయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో, ఈ దేశంలో భూకంపాలు ఎందుకు తరచుగా సంభవిస్తున్నాయనే ప్రశ్న తలెత్తుతుంది. ఐక్యరాజ్యసమితి (UNOCHA) ప్రకారం, ఆఫ్ఘనిస్తాన్ ప్రకృతి వైపరీత్యా కారణంగా అత్యంత ఎక్కువగా నష్టపోయే దేశంగా గుర్తించారు. కాలానుగుణ వరదలు, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు ఇక్కడ తరచుగా సంక్షోభాలకు కారణమవుతాయి. దశాబ్దాల సంఘర్షణ, అభివృద్ధి చెందకపోవడం వల్ల ఆఫ్ఘన్ ప్రజలు ఈ విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోయారు. రెడ్ క్రాస్ ప్రకారం, ఆఫ్ఘనిస్తాన్‌లోని హిందూకుష్ పర్వత ప్రాంతం భూకంప దృక్కోణం నుండి చాలా చురుకుగా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇక్కడ శక్తివంతమైన భూకంపాలు సంభవిస్తాయి. ఈ ప్రాంతం భారత, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఉన్న అనేక ఫాల్ట్ లైన్లపై ఉంది. ప్రధాన ఫాల్ట్ లైన్లలో ఒకటి హెరాత్ గుండా వెళుతుంది. ప్రస్తుతం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. స్థానిక అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు.గత కొన్ని రోజుల్లో ఆఫ్ఘనిస్తాన్‌లో నాలుగు భూకంపాలు సంభవించాయి. ఇలాంటి పరిస్థితిలో, ఈ దేశంలో భూకంపాలు ఎందుకు తరచుగా సంభవిస్తున్నాయనే ప్రశ్న తలెత్తుతుంది. రెడ్‌క్రాస్ ప్రకారం, ఆఫ్ఘనిస్తాన్‌కు శక్తివంతమైన భూకంపాల చరిత్ర ఉంది. హిందూ కుష్ పర్వత శ్రేణి భౌగోళికంగా చురుకైన ప్రాంతం, ఇక్కడ ప్రతి సంవత్సరం భూకంపాలు సంభవిస్తాయి. ఆఫ్ఘనిస్తాన్ భారతీయ మరియు యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య అనేక ఫాల్ట్ లైన్లపై ఉంది, వాటిలో ఒకటి హెరాత్ గుండా నేరుగా వెళుతుంది.

# డ్రగ్స్ తీసుకుంటే వణుకు పుట్టిస్తాం

- కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో పాలసీ
- డగ్స్, గంజాయి నియంత్రణకు ఈగల్ ఫోర్స్
- క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గుతుంది
- స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీ ఏర్పాటు
- స్పోర్ట్స్ కాన్ క్లేవ్లో సీఎం రేవంత్ రెడ్డి




రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి తీసుకుంటే చ్చరించారు. మత్తు పదా ర్థులు సప్లై చేసినా కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ ను ఆలా వాళ్లు తెలంగాణ వైపు చూసేందుకు కూడా భయపడాలని, అందుకే ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారు ఎంతటి పెద్దవారైనా ..ఈగల్ ఫోర్స్ వదిలిపెట్టదని నొక్కి చెప్పారు. గంజాయి, డ్రగ్స్ తీసుకోవాలంటే భయం కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆగష్టు 2న హైదరాబాద్లో నిర్వహించిన స్పో ర్ట్స్ కాన్ క్లేవ్లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్రీడా పాలసీ ద్వారా క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గుతుందని వ్యాఖ్యానించారు. అందుకే పబ్లిక్, ప్రైవేట్ భాగ స్వామ్యంతో ఈ పాలసీని రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి చాలా పరిమితమైన పాత్ర విధించామన్నారు. 'చాలా లోతుగా ఆలోచించి తెలంగాణ క్రీడా పాలసీని తీసుకొ చ్చాం. ఇప్పటి వరకూ రాష్ట్రానికి క్రీడా విధానం ఏది లేదు. క్రీడా పాలసీ లేకపోవడంతో యువత పెడదారి పడుతోంది. ఈ మధ్య కాలంలో తెలంగాణలో డ్రగ్స్, గంజాయి కేసులు బాగా పెరిగాయి. అందుకే నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేశాం. దేశంలో క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్ల యువత డ్రగ్స్కు అలవాటు పడే ప్రమాదం ఉన్నది. తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడారు. అలాంటి యువత ఇప్పుడు వ్యసనాల బారిన పడుతు న్నారు. క్రీడల్లో తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడేలా క్రీడా పాలసీని తీసుకొస్తున్నాం.

క్రీడలతో పాటు వివిధ రంగాల్లో విజయవంత మైన వారితో బోర్డు ఏర్పాటు చేశాం. 1956 లో జరిగిన ఒలంపిక్స్‌లో నాలుగో స్థానం సాధించిన ఫుట్బాల్ జట్టులో హైదరాబాద్కు చెందిన వారు 9 మంది ఉన్నారు. అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, రవికాంత్ రెడ్డి, సిరాజ్. నిక్కత్ జరీన్, దీప్తి లాంటి అనేక మంది క్రీడాకారులు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సిరాజ్, నిక్కత్ జరీన్కు గ్రూప్ వన్ ఉద్యోగంతో పాటు హైదరా బాద్లో ఇంటి స్థలం ఇచ్చి ప్రో త్సహించాం. పారా ఒలంపిక్స్‌ లో రాణించిన దీప్తికి కోటి రూపాయల నగదు బహుమతితోపాటు ఇంటి స్థలం ఇచ్చాం' అని రేవంత్ రెడ్డి చెప్పారు.

**ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధం** : చదువులోనే కాదు క్రీడల్లో రాణించినా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందనే సందేశం ఇచ్చాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల క్రీడా మైదానాలు ఫంక్షన హాల్స్ గా మారాయి. సన్బర్న్ లాంటి ఈవెంట్స్కు వేదికగా మారా యి. తెలంగాణ లో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నాం. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క గోల్డ్ మెడల్ రాకపోవడం దేశానికే అవమానం. ఒలింపిక్స్‌లో దేశానికి 71వ స్థానం రావడం అందరూ ఆలోచించాల్సిన విషయం. దక్షిణ కొరియాలో స్పోర్ట్స్ యూనివర్సిటీకి 16 బంగారు పతకాలు వచ్చాయి. ఒక్క అమ్మాయే 3 పతకాలు గెలుచుకున్నది. తెలంగాణను క్రీడ లకు వేదిక చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం.. విజన్ డాక్యుమెంట్ 2047లో స్పోర్ట్స్ పాలసీకి చాప్టర్ కేటాయించాం. నేషనల్ గేమ్స్, కామ న్వెల్త్ గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్ ను నిర్వ హించిన చరిత్ర హైదరాబాద్కు ఉన్నది. వచ్చే ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధమని ప్రకటించాం. కానీ, అందులో ఒక్క పతకం కూడా రాకపోతే మొహం ఎక్కడ పెట్టుకుంటాం? 2026లో ఖేల్ ఇండియా నిర్వహణకు అవకాశం ఇవ్వా లని ఇప్పటికే కేంద్రాన్ని కోరాం. ఒలింపిక్స్‌ రెండు విభాగాల నిర్వహణకు సిద్ధమని కేంద్రా నికి తెలిపాం. తెలంగాణ క్రీడా విధానం కేవలం ఒక కాగితం కాదు.. బంగారు రేకులతో రాసిన పత్రం. ఒలింపిక్స్‌ పతకం తేవడమే లక్ష్యంగా పనిచేస్తాం. క్రీడాలకు అవసరమైన బడ్జెట్ను కే టాయిస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అగసార నందిని, నిశిక అగర్వాల్, ధనుష్ శ్రీకాంత్, పవన్ కల్యాణ్, సాయి తేజలకు ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందచేయడంతో పాటు కోచ్గా శివకుమార్ ను నియమించారు.

# గల్ఫ్‌లో జిల్లా వాసుల ఇక్కట్లు

- **ఇటీవల ఒకే గ్రామం నుంచి దుబాయ్‌లో ఇద్దరి మృతి**
- **సౌదీలో జిల్లా వాసి అవస్థలు**
- **జీతం ఇవ్వమని అడిగితే వీసా టర్మినేట్ చేయించిన కంపెనీ**
- **రెండు నెలలుగా రోడ్డుపైనే జీవనం**




నిజామాబాద్, : స్థానికంగా ఉపాధి దొరకక దేశం కాని దేశాలకు వలసవెళ్తున్న జిల్లా వాసుల పరిస్థితి రోజురోజుకి అక్కడ ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ సరైన ఉపాధి లేక, వ్యవసాయం చేసుకునే పరిస్థితులు లేక గల్ఫ్ బాట పడుతున్న జిల్లా వాసులకు ఏజెంట్ల మోసాలు, అక్కడి చట్టాలు ఇబ్బంది కరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. గల్ఫ్ దేశాలలో ఉన్న వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు సక్రమంగా లేకపోవడంతో ఎంతో మంది గల్ఫ్ ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్నారు.

జిల్లాకు చెందిన 3లక్షల మందికి పైగా గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్నారు. సౌది అరేబియా, దుబాయ్, మస్కట్, ఓమన్, ఖతర్, షార్జా, ఇరాక్, ఇరాన్ లాంటి దేశాలలో ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు ఏళ్లతరబడి అక్కడే పనిచేస్తున్నారు. వారిని చూసి మరికొంత మంది విజిట్ వీసాతో వెళ్లి అక్కడ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వేల్పూర్ మండలం పచ్చలనడ్కుకు చెందిన ఇద్దరు వ్యక్తులు నెల రోజుల వ్యవధిలోనే గుండెపోటుతో ప్రాణాలను కోల్పోయారు. గ్రామానికి చెందిన సాబేర్ అలీ, కిషన్‌లు మూడు దశాబ్దాలుగా సౌదిలో ఉండగా నెల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోవడం ఆ గ్రా మంలో విషాదం నింపింది. తాజాగా మా క్లూర్ మండలం అమ్రాద్ తండాకు చెందిన మెగావత్ సంతోష్ సౌదిఅరేబియాలో కంపెనీ చేతిలో మోసపోయి ఇబ్బంది పడుతూ సెల్ఫీవీడియో విడుదల చేశాడు.

# కార్పొరేట్ లుక్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల పునర్వ్యవస్థీకరణ కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా మరింత సులువుగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో సబ్ రిజిస్టర్ కార్యాలయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగష్టు 2న రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతు న్నాయని, ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్రజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించబోతున్నట్లు తెలిపారు.

**విడతల వారీగా..** మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకేచోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయా న్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల, మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగా రెడ్డి, పఠాన్చెరువు కలపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పోరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రా ర్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించి నట్లు వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికా రులను ఆదేశించారు. ఇక ఇంటి గ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల పల్ల పనితీరు మెరు గుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమ వుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చుని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్లోని గండిపేట, శేరిలింగంప ల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనే జ్మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటె డ్సబజిస్ట్రార్ కార్యాల యంగా నిర్మిస్తున్నామ ని తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయం ఒక రోల్ మోడల్గా ఉంటుందని పొంగులేటి చెప్పారు.

# మేకిన్ ఇండియా అస్త్రాల సత్తా చాటాం

- ఆపరేషన్ సిందూర్‌లో శత్రువులను మట్టికరిపించాం
- స్వదేశీ ఆయుధాల బలాన్ని ప్రపంచానికి చూపాం
- భారత్-యూకే వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకం
- మన దేశంపై పెరుగుతున్న నమ్మకానికి సూచిక
- కాశీ-తమిళ సంగమంతో సాంస్కృతిక వారసత్వం బలోపేతం
- ఆత్మవిశ్వాసంతో వికసిత్ భారత్ నిర్మిస్తున్నాం
- తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రధాని మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



చెన్నై, : మేకిన్ ఇండియాలో భాగంగా తయారైన ఆయుధాలతో శత్రువులను మట్టి కరిపించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. స్వదేశీ ఆయుధాల బలమేంటో ప్రపంచానికి చాటామన్నారు. మాల్దీవుల నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా తమిళనాడులోని తూత్తుకుడికి ప్రధాని వచ్చారు. రూ. 4,900 కోట్ల వ్యయంతో చేపట్టిన తూత్తుకుడి విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మాణం, వీవోసీ పోర్ట్ ఉత్తర కార్గో బెర్త్-3 నిర్మాణం ప్రారంభించారు. అలాగే పలు రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితం చేశారు. కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రం 3, 4 యూనిట్ల నుంచి విద్యుత్ తరలింపు కోసం ఐఎస్‌టీఎస్ కింద ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్గిల్ విజయ్ దివ్‌సను పురస్కరించుకుని అమరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఆపరేషన్ సింధూర్‌లో మేకిన్ ఇండియా ఆయుధాలు ఎంతో ప్రభావం చూపాయి. కీలక పాత్ర పోషించాయి. వాటితోనే తీవ్రవాదులను మట్టిలో కలిపేశాం. దేశంలో తయారయ్యే ఆయుధాలు ఉగ్రవాదానికి ఆశ్రయమిచ్చే వారికి నిద్ర లేకుండా చేస్తున్నాయి. నాలుగు రోజుల విదేశీయానం తరువాత నేరుగా రామేశ్వరం వంటి పవిత్ర భూమికిపైకి వచ్చే అదృష్టం నాకు కలిగింది. భగవాన్ శ్రీరాముడు, తిరుచ్చెందూర్ మురుగన్‌ల ఆశీర్వాదంతో తమిళనాట కొత్త అధ్యాయం లిఖితమవుతోంది. 2014లో తమిళనాడు అభివృద్ధిలో పరుగులు పెట్టే ప్రణాళికలు రచించాం. వాటి ఫలితమే ఇప్పుడు తూత్తుకుడి విమానాశ్రయం, పోర్టు విస్తరణ వంటివి జరుగుతున్నాయని

చెప్పారు.

నా విదేశీ పర్యటనలో చరిత్రాత్మక భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశాం. ఇది దేశంపై ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకాన్ని, దేశ నూతన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. ఈ ఆత్మవిశ్వాసంతో వికసిత భారత్‌ను నిర్మిస్తున్నాం. మహాకవి సుబ్రమణ్య భారతీయార్ కూడా తూత్తుకుడి గడ్డపై జన్మించారు. ఆయనకు తూత్తుకుడితో పాటు నా నియోజకవర్గం కాశీతో కూడా గాఢానుబంధముంది. అందుకే కాశీ-తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా మన ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని నిరంతరం బలోపేతం చేసుకుంటున్నాం. పారిశ్రామిక వృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్‌కు రైల్వే జీవనాడి. గత 11 ఏళ్లలో దాని ఆధునీకరణపై దృష్టి సారించాం. నేడు దేశవ్యాప్తంగా ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి గట్టి కృషి జరుగుతోంది. ఇటీవల ఇంజనీరింగ్ అద్భుతమైన చీనాబ్ వంతెనతో జమ్మూ-శ్రీనగర్‌ను అనుసంధానించాం.

అటల్ సేతు, బోగిబీల్ వంతెన, సోన్‌మార్గ్ సొరంగం వంటివి ఎన్నో ప్రాజెక్టులను మా ప్రభుత్వం పూర్తి చేసింది. తద్వారా లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించాం" అని పేర్కొన్నారు. తమిళ సంప్రదాయమైన పంచెకట్టులో సభకు హాజరైన ప్రధాని.. తమిళంలో ప్రసంగాన్ని ప్రారంభించి, తమిళంలోనే ముగించడం విశేషం.

# వికసిత్ తమిళనాడును నిర్మిస్తాం.. రూ.4,900 కోట్లతో అభివృద్ధి పనులు



తూతుకూడి: వికసిత్ తమిళనాడు, వికసిత్ భారత్ నిర్మాణానికి తాము పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమిళనాడు లోని తూతుకూడిలో రూ.4,900 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శనివారంనాడు శంకుస్థాపనతో పాటు, కొన్నింటిని జాతికి ప్రధానమంత్రి అంకితం చేశారు. తూతుకూడి ఎయిర్‌పోర్ట్‌లో కొత్తగా నిర్మించిన టెర్మనల్‌ను ప్రారంభించారు. తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తేనారాసు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పి.గీతా జీవన్, లోక్‌సభ ఎంపీ కనిమొళి, పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి కార్గిల్ విజయ్ దివస్‌ను గుర్తుచేసుకుంటూ కార్గిల్ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఇటీవల బ్రిటన్‌లో తాను పర్యటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తన పర్యటనలో భారత్-బ్రిటన్ మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిందన్నారు. ఇది ప్రపంచ దేశాలకు భారత్‌పై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. అదే పట్టుదలతో వికసిత తమిళనాడు, వికసిత భారత్‌కు కట్టుబడి ఉన్నామని చెప్పారు. లార్డ్ రామేశ్వర్, తిరుచెందూర్ మురుగన్ ఆశీస్సులతో ఈరోజు తూతుకుడిలో నూతన అభివృద్ధి అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు.

# ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రోత్సాహకాలు

## పీఎంవీబీఆర్‌వై ఆవిష్కారం.. ఆగస్టు 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ, : కొత్తగా ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు కేంద్రం నూతన పథకాన్ని ఆవిష్కరించింది. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పేరుతో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించినట్టు కార్మిక శాఖ తెలిపింది. ఈ పథకం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుందని, వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఈ పథకానికి రూ.99,446 కోట్లు కేటాయించినట్టు తెలిపింది.

ఇందులో 1.92 కోట్ల మంది మొదటిసారిగా ఉద్యోగం పొందిన వారు ఉండాలని ఆశయంగా పెట్టుకొంది. 2025 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2027 జూలై 31లోగా ఈ ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఉద్యోగాలు పొందినవారితోపాటు ఉద్యోగాలు కల్పించిన యజమానులకూ ప్రోత్సాహకాలు అందించనుండడం ఈ పథకం ప్రత్యేకత. వస్తువుల తయారీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకం పార్ట్‌-ఏలో తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, పార్ట్‌-బిలో యజమానులకు అందించే ప్రోత్సాహకాలను ప్రస్తావించారు.

తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారు ఈపీఎఫ్‌వోలో పేరు నమోదు చేసుకొని ఉంటే వారికి ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇది గరిష్ఠంగా రూ.15,000 వరకు ఉంటుంది.

రూ.లక్ష వరకు వేతనం పొందే వారూ ఈ ప్రోత్సాహకం పొందేందుకు అర్హులే. ఆరు నెలల సర్వీసు పూర్తయిన తర్వాత తొలి విడత ప్రోత్సాహకం లభిస్తుంది. 12 నెలలు ఉద్యోగం చేసి, యాజమాని నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమా'న్ని పూర్తి చేసిన తర్వాత రెండో విడత ప్రోత్సాహకం చెల్లిస్తారు. దీన్ని ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలోగానీ, సేవింగ్స్ పత్రాల రూపంలోగానీ కొంతకాలంపాటు డిపాజిట్ చేయాలి. కొత్తగా సృష్టించే ఉద్యోగాలకే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. పార్ట్‌-బి ప్రకారం అదనంగా కల్పించే ప్రతి ఉద్యోగానికి ప్రోత్సాహకం కింద యజమానికి ప్రతినెలా రూ.3,000 చొప్పున రెండేళ్లు ఇస్తారు. తయారీ రంగ యజమానులకైతే మూడు, నాలుగేళ్లపాటు కూడా ఈ ప్రయోజనం కల్పిస్తారు.

# 4,850 కోట్లు..మాల్దీవులకు రుణ సాయం

- ఆ దేశ పర్యటనలో ప్రకటించిన మోదీ
- ప్రధానికి ఘన స్వాగతం పలికిన ముయిజ్జు
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చర్చలు



మాలె, : మాల్దీవులకు రూ. 4,850 కోట్ల రుణ సాయం చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆ దేశానికి భారత్ నమ్మకమైన మిత్రుడని పేర్కొన్నారు. జరగనున్న మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు మాల్దీవుల రాజధాని మాలెలో శుక్రవారం ఉదయం ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు, పలువురు ఆ దేశ మంత్రులు స్వయంగా మాలెలోని వెలెనా అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి ప్రధానికి స్వాగతం పలికారు.

అనంతరం రిపబ్లిక్ స్క్వేర్‌లో సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికి సైనిక వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ స్వయంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. వాణిజ్యం, రక్షణ, మౌలిక వసతులు వంటి అంశాల్లో సహకరించుకోవాలని నిర్ణయించారు. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు పలు కారణాల వల్ల దెబ్బతిన్న తర్వాత తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇరు దేశాలు ఒక ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు.

అంతేగాక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపైనా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యం, మహాసాగర్(మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ (గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్) అనే భారత విధానంలో మాల్దీవులకు ప్రధాన పాత్ర ఉందని పేర్కొన్నారు. రక్షణ, భద్రత అంశాల్లో సహకారం పరస్పర విశ్వాసానికి కీలకం అన్నారు. మాల్దీవుల రక్షణ రంగం బలోపేతానికి భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందన్నారు. 'అధ్యక్షుడు ముయిజ్జు స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం నా హృదయానికి హత్తుకుంది.. రానున్నకాలంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో ఉన్నత స్థాయికి చేరతాయి' అని మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో విశ్వాసం వ్యక్తంచేశారు. కాగా ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటనతో ఇరు దేశాల దౌత్య సంబంధాల్లో సానుకూల మార్పు వస్తుందని విశ్లేషకుల అంచనా. మాల్దీవుల్లో ఏకీకృత చెల్లింపుల విధానం(యూపీఐ)ని కూడా ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు. కాగా మాల్దీవులపై చైనా పట్టును సడలింపజేసి హిందూ మహా సముద్ర ప్రాంతంలో ఆ దేశ ఆధిపత్యం లేకుండా చూడాలని భారత్ ఆశిస్తోంది.

# మరింత కొత్తగా సీఎంఆర్‌ఎఫ్

- **దరఖాస్తుదారు వాట్సాపకే చెక్కు వివరాలు**
- **సీఎం రేవంత్ సందేశంతో ప్రత్యేకంగా డిజైన్**
- **19 నెలల్లో 3.23లక్షల మందికి సాయం**



హైదరాబాద్, : ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) పథకాన్ని అక్రమాలకు, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. ఇప్పటికే పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. తాజాగా మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. సీఎంఆర్ఎఫ్ సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో పొందుపర్చిన ఫోన్ నంబరుకు చెక్కు వివరాలతో పాటు సీఎం రేవంత్ సందేశాన్ని జతచేసి పంపుతున్నారు.

అలాగే చెక్కు విడుదలైన తేదీతో పాటు దరఖాస్తు చేసిన ప్రజాప్రతినిధి కార్యాలయానికి ఎప్పుడు చేరుతుందనే వివరాలను కూడా మెసేజ్ రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని కొంతమంది ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కులపై ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ సందేశాన్ని తొలగించి లబ్ధిదారులకు అందిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఒకటి, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సీఎం సందేశం లేకుండా ఇచ్చిన చెక్కులు కూడా బహిర్గతమయ్యాయి.

ఈ క్రమంలోనే అధికారులు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేసినట్టుగానే.. లబ్ధిదారులకు అందించే చెక్కుల వివరాలను కూడా వారి వాట్సాపకే పంపుతున్నారు. అలాగే చికిత్సకు ముందు ఆస్పత్రులకు ఇచ్చే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) పత్రాలపైనా ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్'లను ముద్రిస్తున్నారు. ఆ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ లెటర్ ఎవరికి ఇచ్చారు, ఆ పేషంట్ పేరు, మంజూరు చేసిన నగదు వివరాలన్నీ కనబడుతున్నాయి. మరోవైపు.. సీఎంఆర్ఎఫ్ సాయంలో ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 19 నెలల కాలంలోనే సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,399.21 కోట్ల నిధులను విడుదల చేసింది. 2023 డిసెంబరు 7 నుంచి 2025 జూలై 26నాటికి దాదాపు 3,23,739 మంది నిరుపేద, పేద, మధ్య తరగతి కుటుంబాలకు సర్కారు వివిధ రూపాల్లో సాయం అందించింది. చికిత్సకు ముందు అందించే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ల ద్వారా 27,872 మందికి రూ.413.25 కోట్లు, అలాగే చికిత్స అనంతరం దరఖాస్తు చేసుకున్న 3,01,867 మందికి రూ.985.96 కోట్ల చొప్పున నిధులను విడుదల చేసింది.

# టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

- తెలంగాణలో అపార అవకాశాలు
- తైవాన్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం
- ఈ-గవర్నెన్స్‌లో ఎస్తోనియా సహకారం తీసుకుంటామని వెల్లడి



హైదరాబాద్, : టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అపారమైన అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని తైవాన్ పారిశ్రామికవేత్తలను కోరారు. శుక్రవారం సచివాలయంలో తైవాన్ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) అధ్యక్షుడు జస్టిన్ వాంగ్ నేతృత్వంలో 11 మంది ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "స్వల్ప కాలంలోనే టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు దీటుగా ఎదిగింది. రాష్ట్ర పారిశ్రామిక జీఎస్‌వీపీ (రాష్ట్ర స్థూల విలువ జోడింపు) 2024-25లో రూ.2.77 లక్షల కోట్లుగా ఉంది.

ఇందులో టెక్స్‌టైల్ రంగం కీలక పాత్ర పోషించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) గేమ్ చేంజర్‌గా మారింది. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ పారిశ్రామి కాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది" అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. తైవాన్ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే 'తెలంగాణ - తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్' పేరిట ప్రత్యేక టెక్స్‌టైల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా, ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా దేశ సహకారం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధులు మంత్రిని కలిశారు. తెలంగాణ ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్‌లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని కోరారు.

# ఆరోగ్యశ్రీలో 27% కిడ్నీ చికిత్సలే !

- తర్వాత స్థానాల్లో క్యాన్సర్, పాలీట్రామా
- ఏడాదిన్నరలో 10.70 లక్షల చికిత్సలు..
- ఐదు విభాగాల్లోనే 6.55 లక్షల కేసులు
- ఆరోగ్యశ్రీలో 461కి పెరిగిన ప్రైవేటు ఆస్పత్రులు..
- ఎంప్యానెల్ కోసం పోటీ పడుతున్న వైనం
- భారీగా పెరగడానికి కారణాలివే..



హైదరాబాద్, : బీఆర్ఎస్ హయాంలో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున 25 వేల వైద్య చికిత్సలు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సంఖ్య దాదాపు 60 వేలకు పెరిగింది. అందుకు కారణాలు.. వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచారు. ప్రైవేటు ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్య 374 నుంచి 461కి పెరిగింది. ఆరోగ్యశ్రీ కింద చికిత్సల సంఖ్య 898 నుంచి 1835కిపెరిగింది. 1375 చికిత్సల ధరలను 20-25% మేర పెంచారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రతినెలా క్రమం తప్పకుండా సగటున రూ.50-60 కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతో గతంలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపేసిన ప్రైవేటు ఆస్పత్రులు సైతం మళ్లీ తిరిగి ఆ సేవలను కొనసాగిస్తున్నాయి.

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్య చికిత్సల్లో మూత్రపిండాలకు సంబంధించిన కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. మొత్తం కేసుల్లో 27 శాతం ఇవే ఉన్నాయి! ఆ తర్వాత స్థానంలో క్యాన్సర్ కేసులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్య చికిత్సల్లో 52 శాతం కేసులు కిడ్నీ, క్యాన్సర్, పాలీట్రామాకు సంబంధించినవే ఉంటున్నాయి. కిడ్నీ 27 శాతం, క్యాన్సర్ 17, పాలీట్రామా 8 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద కేవలం 18 నెలల్లోనే రికార్డు స్థాయిలో 10,70,206 లక్షల చికిత్సలు జరిగాయి. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌లో 1.25 లక్షలు, రంగారెడ్డిలో 68 వేలు, నల్లగొండలో 59 వేలు, మేడ్చల్‌లో 52 వేల చికిత్సలు జరిగాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు తాజాగా సర్కారుకు అందించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. కేవలం 5 విభాగాల్లోనే 65 శాతం చికిత్సలు అందించినట్లు తెలిపింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 1042 సర్కారీ దవాఖానాలు ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య 461కి పెరిగింది. అంతేగాక చికిత్సల రేట్లను కూడా పెంచారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యసేవలు పొందే వారి సంఖ్య భారీగా పెరిగిందని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఆరోగ్యశ్రీ కింద ఏడాదిన్నర కాలంలో 10.70 లక్షల చికిత్సలను అందించారు.

ఇందులో ఐదు విభాగాల్లోనే 6.55 లక్షల చికిత్సలు జరిగినట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. మూత్రపిండాల విభాగంలో 2.13 లక్షలు, క్యాన్సర్‌లో 1.90 లక్షలు, పాలీట్రామాలో 88 వేలు, యూరినరీ సర్జరీల్లో 81, జనరల్ మెడిసిన్ విభాగంలో 81 వేల కేసులకు చికిత్సలందించారు. మిగిలిన అన్ని విభాగాల్లో కలిపి 4.60 లక్షల చికిత్సలు అందించినట్లు తెలిపాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2023 డిసెంబరు వరకు ఆరోగ్యశ్రీ కింద మొత్తం 30.17 లక్షల వైద్య చికిత్సలు అందించారు. ఇందులో ఒక్క ప్రైవేటులోనే 19.06 లక్షలు కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11.10లక్షల చికిత్సలు అందించారు. పదేళ్లలో ఏడాదికి సగటున 3 లక్షల కేసులకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా, గతంలో ఎంతో పలుకుబడి ఉంటే తప్ప ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీలో ఎంప్యానెల్ అయ్యేవికావు. మూడు నాలుగేళ్లకోసారి ఎంప్యానెల్ అయ్యేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరేవారు. దీంతో పరిమిత సంఖ్యలోనే ప్రైవేటు ఆస్పత్రులు అనుసంధానమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండల, నియోజకవర్గ స్థాయి ఆస్పత్రులకు సైతం ఎంప్యానెల్ అయ్యేందుకు అవకాశం కల్పించింది. నిబంధనల్లో మార్పులు చేశారు. 15 అంచెలను 10కి కుదించారు. దరఖాస్తు చేసిన కొద్దిరోజుల్లోనే తనిఖీలు పూర్తి చేసి ఎంప్యానెల్ జాబితాలో చేర్చారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు ఎంప్యానెల్ కోసం పోటీపడుతున్నాయి.